PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 110 | విజయవాడ, శుక్రవారం 22 నవంబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 22 November 2024 | Rs

### అదానితో ఒప్పందాలన్నింటినీ రద్దు చేసుకోవాలి

- తక్షణమే అరెస్టు చేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్

2



### బుమ్రా కెప్టెన్సీకి పరీక్ష

- నేటినుంచి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ

8

## అదానీ అవినీతి పుట్టలోంచి

# భారీ ముడుపుల స్కామ్

- సౌర విద్యుత్ కాంట్రాక్టుల కోసం ప్రభుత్వ పెద్దలకు రూ.2029 కోట్ల లంచాలు
- న్యూయార్క్ కోర్టులో అమెరికా న్యాయశాఖ అభియోగాలు
- కుప్పకూలిన అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు
- జెపిసి విచారణకు ప్రతిపక్షాల డిమాండ్

**న్యూఢిల్లీ :** బిజెపి పదేళ్ల పాలనలో ప్రధాని నరేంద్రమోడీకి అత్యంత సన్నిహితుడైన పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ అవినీతి విశ్వరూపం దాల్చింది. ఆ అవినీతి పుట్టలోంచి తాజాగా మరో భారీ అవినీతి స్కామ్ బయటపడడంతో దీనిపై జెపిసితో సమగ్ర విచారణ జరిపించాలని, అదానీపై కేసు పెట్టి తక్షణమే అరెస్టు చేయాలని వామపక్షాలు, కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. అదానీ తాజా కుంభకోణం భారత్‌తో బాటు ప్రపంచ వ్యాపితంగా దుమారం రేపుతోంది. 2020-2024 మధ్య లాభదాయకమైన సౌర విద్యుత్ కాంట్రాక్టులను దక్కించుకోవడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులకు రూ.2029 కోట్ల ముడుపులు ముట్టజెప్పడం లేదా ఇస్తానని వాగ్దానం చేయడం వంటివి అదానీ, ఆ కంపెనీకి చెందిన మరో ఆరుగురు ఎగ్జిక్యుటివ్‌లు చేశారని అమెరికా న్యాయశాఖ అక్కడి కోర్టుకు తెలియజేసింది. ఇందుకు సంబంధించి 54 పేజీల నేరాభియోగ పత్రాన్ని న్యాయవాదులు కోర్టులో దాఖలు చేయడం, ఆ అభియోగ పత్రంలోని వివరాలను ప్రముఖ అమెరికన్ పత్రిక ఫైనాన్షియల్ టైమ్స్ వెల్లడించడంతో ఈ భాగోతం బయటపడింది. నేరాభియోగ పత్రంలో కేటగిరీల వారీగా, వ్యక్తుల వారీగా ఎవరికి ఎంతెంత ముడుపులు ముట్టజెప్పడం లేదా హామీ ఇవ్వడమో చేశారని స్పష్టంగా పేర్కొనడం జరిగింది. గౌతమ్ అదానీ మేనల్లుడు సాగర్ అదానీని కూడా ఫెడరల్




ప్రాసిక్యూటర్లు ప్రతివాదుల జాబితాలో చేర్చారు.

భారత్, కెన్యా, శ్రీలంక, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియాలకే పరిమితమనుకున్న అదానీ అవినీతి లీలలు అమెరికాకు కూడా విస్తరించాయి. స్టాక్ మార్కెట్‌లో అదానీ షేర్లను మ్యానిపులేట్ చేసి వాటి వాస్తవిక విలువ కన్నా అనేక రెట్లు పెంచుకున్నట్లు అమెరికన్ షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రిసెర్చి బయట పెట్టినప్పుడు ఆ ఆరోపణలపై సంయుక్త పార్లమెంటరీ సంఘం (జెపిసి)తో దర్యాప్తు జరిపించాలని ప్రతిపక్షాలు పదే పదే దిమాండ్ చేసినా మోడీ ప్రభుత్వం పట్టించుకోలేదు. తాజా కుంభకోణం అమెరికా బ్యాంకులు, ఇన్వెస్టర్లతో ముడి పడి ఉండడంతో ఇప్పుడలా తప్పించుకోవడం కుదరకపోవచ్చు. ముడుపుల ఆరోపణలు మిగతా 7లో

### 'ఆ నంబర్ 1' జగనేనా?

2019 మే నుండి ఈ సంవత్సరం జూన్ వరకూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఉన్నత పదవిలో ఉన్న వ్యక్తికి గౌతమ్ అదానీ, ఆయన సహ కుట్రదారులు రూ.1,750 కోట్లను 'అవినీతి చెల్లింపు'గా అందించారని అమెరికా న్యాయశాఖ ఫెడరల్ ప్రాసిక్యూటర్లు వెల్లడించారు. అదానీ నుంచి ముడుపులు అందుకున్నవారిలో అప్పటి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ కూడా ఉన్నట్లు అమెరికన్ స్టాక్ ఎక్స్‌ఛేంజి కమిషన్ ఆరోపించింది. దీంతో అనుమానపు ముల్లు ఆయన పైపు చూపుతోంది. కోర్టు ఫైలింగ్స్‌లో జగన్ పేరును ప్రస్తావించకపోయినా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంలో అత్యున్నత స్థానంలో ఉన్న వ్యక్తి ( అమెరికా ఫెడరల్ ప్రాసిక్యూటర్ల ప్రకారం 'విదేశీ అధికారి 1') అని పేర్కొన్నారు. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) నుంచి ఏడు గిగావాట్ల సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు రాష్ట్ర పంపిణీ కంపెనీలను అంగీకరింపజేసినందుకు ప్రతిఫలంగా





అదానీతో జగన్

ఈ మొత్తాన్ని అందించారు. ఈ కుంభకోణం చోటు చేసుకున్న సమయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న వైయస్ జగన్మోహన్ రెడ్డి ఉన్నారు. గౌతమ్ అదానీ వ్యక్తిగతంగా ఆంధ్రప్రదేశ్‌కు మిగతా 7లో

## తక్షణమే అరెస్టు చేయండి

- అదానీ గ్రూపుపై కేసు నమోదు చేయాలి
- సిపిఎం డిమాండ్
- అవకతవకలపై స్వతంత్ర సంస్థతో పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టాలి

**న్యూఢిల్లీ :** అదానీ గ్రూపు పాల్పడిన అవకతవకలన్నింటిపై స్వతంత్ర సంస్థతో పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపించాలని, అమెరికా ప్రాసిక్యూటర్లు అందజేసిన ఆధారాల ప్రాతిపదికన అదానీపై వెంటనే కేసు నమోదు చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు పొలిట్‌బ్యూరో ఒక ప్రకటన జారీ చేసింది.

గౌతమ్ అదానీ మరో ఆరుగురిపై అమెరికా కోర్టులో అక్కడి న్యాయశాఖ దాఖలు చేసిన నేరారోపణ పత్రంలో కేంద్ర, రాష్ట్ర స్థాయిలో భారత ప్రభుత్వ అధికారులకు ముడుపులు చెల్లించడంలో గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీలకు ప్రమేయం వుందంటూ తీవ్రమైన నేరాభియోగాలు వున్నాయి. సౌర విద్యుత్ సరఫరా కోసం రాష్ట్రాలు లేదా ప్రాంతీయ విద్యుత్ పంపిణీ కంపెనీలతో విద్యుత్ విక్రయానికి సంబంధించి అక్రమ ఒప్పందాలతో ముందుకు సాగడానికి భారత ప్రభుత్వ అధికారులకు రూ.2,029 కోట్లు ఇవ్వజూపారని లేదా ఇస్తామని హామీ ఇచ్చారని ఆ అభియోగ పత్రం పేర్కొంటోంది. అదానీలు అమెరికా ఇన్వెస్టర్లను తప్పుదారి పట్టించారనే ఆరోపణలపై అమెరికాలో ఈ కేసు నమోదైంది. ప్రభుత్వ అధికారులకు ఇవ్వజూపిన, వాగ్దానం చేసిన ముడుపులకు సంబంధించిన నిర్దిష్ట వివరాలను అందజేసిన సాగర్ అదానీ నుండి సాక్ష్యాధారాలను కూడా సేకరించినట్లు అభియోగపత్రం పేర్కొంది. "ముడుపుల పత్రాలు గుర్తించినవి : (1) రాష్ట్రం లేదా ప్రాంతం కోసం ప్రభుత్వ అధికారులకు ఇవ్వచూపిన ముడుపులు (2) ఇస్తామని చెప్పిన ముడుపుల మొత్తం (3) ఈ ముడుపులు ముట్టజెప్పినందుకు లేదా ఇస్తామని హామీ ఇచ్చినందుకు ప్రతిఫలంగా రాష్ట్రం లేదా ప్రాంతం కొనుగోలు చేయడానికి అంగీకరించిన సౌర విద్యుత్ మొత్తం. చాలా సందర్భాల్లో, మొత్తంగా ఇవ్వచూపిన ముడుపుల మొత్తంలో ఒక్కో మెగావాట్ రేటు ఎంత వుందో కూడా ముడుపుల పత్రాలు గుర్తించాయి. అలాగే ఈ లంచాలు అందుకునే ప్రభుత్వ అధికారులకు సంబంధించిన సంక్షిప్త నామాలు కూడా వున్నాయి. ఒక్కో రాష్ట్రంలో, ప్రాంతంలో ప్రభుత్వ అధికారుల మధ్య పంపిణీ చేయాల్సిన ముడుపుల మొత్తం కూడా వుంది." ఇంత పెద్ద ఎత్తున లంచాలకు పాల్పడడం, పైగా అదానీలు, ప్రభుత్వ అధికారులను తమ అధీనంలో వుంచుకోవడం, ఇదంతా కూడా భారత్‌లో కాకుండా అమెరికాలో వారి నేర న్యాయ వ్యవస్థ ద్వారా బయటపడడం సిగ్గుచేటైన విషయం. అంతేకాకుండా ఇటువంటి అక్రమ, నేరపూరితమైన కార్యకలాపాలు చేపట్టేందుకు గౌతమ్ అదానీకి, ఆయన వ్యాపార సామ్రాజ్యానికి మోడీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో రక్షణగా నిలుస్తున్నది. హిండెన్‌బర్గ్ వ్యవహారంలో తలెత్తిన ఆరోపణలపై ఎలాంటి విచారణ లేదా ప్రాసిక్యూషన్ జరగకుండా అదానీకి ప్రధాని నరేంద్ర మోడీ పూర్తి రక్షణగా నిలిచారు. మోడీ ప్రభుత్వం ఇక ఇప్పుడు ఏ తెర చాటునా దాక్కోలేదు. అమెరికాలోని ప్రాసిక్యూషన్ అందజేసిన సమాచారం ఆధారంగా కేసు నమోదు చేయాల్సిందిగా తక్షణమే సిబిఐకి ఆదేశాలు జారీ చేయాలి. ప్రభుత్వ అధికారులకు ముడుపులు ఇవ్వడమనేది సిబిఐ పరిధిలో వున్న అవినీతి నిరోధక చట్టం కిందకు వస్తుంది. అదానీ గ్రూపు కంపెనీలు పాల్పడిన తప్పులు, అవకతవకలన్నింటినీ వెలికితీయడానికి స్వతంత్ర సంస్థతో పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టడం తక్షణావసరమని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

### అదాని అవినీతిపై గప్‌చుప్

- పెదవి విప్పని టిడిపి కూటమి
- నేరుగా ఒప్పందం లేదన్న వైసిపి

8

## జనసేనకు పిఎసి ఛైర్మన్!

- నామినేషన్ దాఖలు చేసిన పులవర్తి రామాంజనేయులు
- బరిలో వైసిపి..నేడు పోలింగ్



పులపర్తి రామాంజనేయులు




పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పిఎసి) ఛైర్మన్ పదవి జనసేనకు దక్కడం దాదాపు ఖరారు అయ్యింది. భీమవరం ఎంఎల్ఎ పులవర్తి రామాంజనేయులు పేరును ఆ పార్టీ అధ్యక్షుడు, డిప్యూటి ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. గురువారం ఉదయం ఆయన నామినేషన్ దాఖలు చేశారు. దీంతో దాదాపు 60 సంవత్సరాల తరువాత పిఎసి ఛైర్మన్ పదవి ప్రతిపక్షానికి కాకుండా అధికార కూటమిలోని పార్టీకే దక్కనుంది. వైసిపి నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పోటీలో ఉండటంతో ఎన్నిక అనివార్యమైనప్పటికీ తెలుగుదేశం కూటమికే మెజార్టీ ఉన్న విషయం తెలిసిందే. దీంతో పులపర్తి రామాంజనేయులు పేరును పిఎసి ఛైర్మగా ప్రకటించడం కేవలం లాంఛనమే. పోటీ అనివార్యం కావడంతో అసెంబ్లీ కమిటీ హాలులో శుక్రవారం బ్యాలెట్ పద్ధతిలో ఎన్నిక జరుగనుంది. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నామినేషన్ సందర్భంలో కొంత ఉత్కంఠ నెలకొంది. నామినేషన్ వేసేందుకు గురువారం మధ్యాహ్నం 1గంట వరకే సమయం ఉన్నప్పటికీ మధ్యాహ్నం 12.50గంటలకు వరకు నామినేషన్ తీసుకునేందుకు అసెంబ్లీ సెక్రటరీ అందుబాటులో లేరు. దీంతో వైసిపి సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనమండలిలో ఆ పార్టీ నేత బొత్స సత్యనారాయణ తీవ్రంగా స్పందించారు. సెక్రటరీ గదికి ఎదురుగా ఉన్న ఆర్థికశాఖమంత్రి పయ్యావుల కేశవ్ గదిలో ఉన్న మంత్రి అచ్చెన్నాయుడును ఆయన నిలదీశారు. దీంతో అచ్చెన్నాయుడు శాసనసభలోకి వెళ్లి సెక్రటరీని ఆయన ఛాంబర్‌కు పంపించారు. నామినేషన్ వేసేందుకు సమయం ప్రకటించి నామినేషన్ తీసుకోకపోవడం ఏంటని, అసెంబ్లీకి నియమ నిబంధనలు ఉంటాయని, వాటిని పాటించకపోతే ఎలా అని బొత్స అధికారులను ప్రశ్నించారు . అనంతరం పిఎసి సభ్యునిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఆయనతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ (పియుసి) ఛైర్మన్‌గా బూచేపల్లి మిగతా 7లో

## త్వరలోనే కర్నూలులో హైకోర్టు బెంచ్

- లోకాయుక్త, హెచ్ఆర్‌సి కూడా అక్కడే
- రాష్ట్ర సమగ్ర అభివృద్ధే ధ్యేయం
- శాసన సభలో సిఎం చంద్రబాబు వెల్లడి



**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

సాధ్యమైనంత త్వరలోనే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. ఇప్పటికే కర్నూలులో ఉన్న లోకాయుక్త, హెచ్ఆర్‌సి కార్యాలయాలు కూడా అక్కడే కొనసాగతాయని ఆయన ప్రకటించారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు సంబంధించిన తీర్మానాన్ని రాష్ట్ర శాసనసభ గురువారం ఆమోదించింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఈ చర్య తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఈ అంశాన్ని రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించిందని, ఆ దిశలో చర్యలు కూడా ప్రారంభమయ్యాయని చెప్పారు. సాధ్యమైనంత త్వరగా వీటిని పూర్తిచేసి హైకోర్టు బెంచ్‌ను కర్నూలులో ఏర్పాటు చేస్తామని చెప్పారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఉత్తరాంధ్రలో విశాఖపట్నంను, రాయలసీమలో కర్నూలు, తిరుపతి పట్టణాలను మరింత అభివద్ధి చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం మూడు రాజధానులు పేరుతో మూడు ముక్కలాటలాడి ఏ ప్రాంతం అభివృద్ధి కాకుండా చేశారని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో తాము విశాఖ, కర్నూలులో కూడా అమరావతే రాజధాని అని చెప్పామని, అక్కడి ప్రజలను ఒప్పించామని అన్నారు. రాయలసీమను ఉద్యానవన హబ్‌గా మారుస్తామన్నారు. రాయలసీమలో ముఠాలను నియంత్రించామని చెప్పారు. ఎన్‌టిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే కృష్ణా జలాలను సీమకు తరలించాలని తాము ఆలోచించామని చెప్పారు. దీనిలో భాగంగానే తెలుగుగంగ, హంద్రీనీవా, నగరి గాలేరు ప్రాజెక్టులను ఎన్టీఆర్ ప్రారంభించారని, వాటిని తామే పూర్తిచేశామని అన్నారు. నదుల అనుసంధానం చేసి, పోలవరం పూర్తి చేసి గోదావరి నీళ్లను బనకచర్లకు తీసుకెళ్తే గేమ్ ఛేంజర్ అవుతుందన్నారు. కియా పరిశ్రమను తీసుకొచ్చేందుకు యేడాదిలోనే గొల్లపల్లి రిజర్వాయర్ పూర్తి చేశామన్నారు. కియా రాకతో అనంత జిల్లా ముఖచిత్రం మారిపోయిందన్నారు. అనంతపురానికి బెంగళూరు ఎయిర్ పోర్టు, కర్నూలుకు హైదరాబాద్ ఎయిర్ పోర్టు, చిత్తూరుకు చెన్నై ఎయిర్ పోర్టులు దగ్గరగా ఉన్నాయన్నారు. ఈ మూడు అవకాశాలను అభివృద్ధికి ఉపయోగించుకోవచ్చునన్నారు. రాయలసీమలో మంచి రోడ్లు వచ్చాయంటే టిడిపి కృషి కారణం అన్నారు. ఓర్వకల్లులో ఎయిర్ పోర్టు ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. తిరుపతి ఎయిరో పోర్టును విస్తరించి సర్వీసులు పెంచినటుల, కడప ఎయిర్ పోర్టులో రాత్రి సమయంలోనూ విమానాలు దిగే అవకాశం కల్పించినట్లు చెప్పారు. ప్రస్తుతం నాలుగు ఉమ్మడి జిల్లాల్లో నాలుగు ఎయిర్ పోర్టులు ఉన్నాయన్నారు. మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ టిడిపి హయంలోనే రాయలసీమ అభివృద్ధి చెందిందన్నారు. తిరుపతి ఐఐటీ, ఐజర్, కర్నూలులో మిగతా 7లో

### నెతన్యాహుకు ఐసిసి అరెస్టు వారంట్

- ఇజ్రాయిల్ మాజీ రక్షణమంత్రి, హమాస్ నేతలకు కూడా

**అమెస్టర్‌డామ్ :** గాజాలో యుద్ధ నేరాలకు, మానవాళి వ్యతిరేక చర్యలకు పాల్పడ్డారంటూ ఇజ్రాయిల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహు, మాజీ రక్షణ మంత్రి యోవ్ గాలంట్‌లకు అంతర్జాతీయ న్యాయస్థానం అరెస్టు వారంట్లు జారీ చేసింది. హమాస్ నేత ఇబ్రహీమ్ అల్ మాస్రికి కూడా అరెస్టు వారంటు జారీ అయింది. నెతన్యాహు, గాలంట్‌లు గాజాలో అమానుష రీతిలో మారణకాండకు పాల్పడ్డారని, ఆహారం, నీరు వంటి మౌలిక అవసరాలను కూడా అందనివ్వకుండా అమానవీయ చర్యలకు దిగడంతో వేలాదిమంది ప్రజలు మరణించారని న్యాయస్థానం పేర్కొంది. ఇందుకు అవసరమైన సాక్ష్యాధారాలను కూడా గుర్తించామని పేర్కొంది. గాజాలో యుద్ధ నేరాలకు పాల్పడలేదంటూ ఇజ్రాయిల్ ఈ వారంట్లను తోసిపుచ్చింది. గతేడాది అక్టోబరు 7న ఇజ్రాయిల్‌పై హమాస్ దాడి, అందుకు ప్రతిగా గాజాలో ఇజ్రాయిల్ నరమేధం నేపథ్యంలో నెతన్యాహు, గాలంట్‌లను అరెస్టు చేయాలని ఐసిసి ప్రాసిక్యూటర్ కరీమ్ ఖాన్ మే 20న కోరారు.

## అందరూ కలిసి విశాఖ ఉక్కును అమ్మేస్తారా?

- అధికార, ప్రతిపక్షాలను నిలదీసిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐవి
- ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం
- డిమాండ్ చేసిన విపక్ష ఎమ్మెల్సీలు
- ప్రైవేటీకరణే లేదని ప్రభుత్వం సమాధానం

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రతిపక్షం కలిసి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తారా? అని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు శాసనమండలిలో నిలదీశారు. ఇలా అమ్మేస్తే కొత్త ప్రాజెక్టు కడపలో పెట్టాలని మరోచోట పెట్టాలని మాట్లాడుకోవడం ఎందుకని ప్రశ్నించారు. ఉన్నదానిని నిలబెట్టుకొని ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకోవాలని కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తున్నారనే విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా? అని వైసిపి సభ్యులు వరుదు కళ్యాణి, దువ్వాడ శ్రీనివాస్, పాలవలస విక్రాంత్ శాసనమండలి ప్రశ్నోత్తరాల్లో భాగంగా పరిశ్రమల శాఖ మంత్రిని గురువారం అడిగారు. అయితే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయడం లేదని, అటువంటి అంశం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి రాలేదని మంత్రి టిజి భరత్ చెప్పారు. ఈ సందర్భంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో, ప్రస్తుత ప్రభుత్వంలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయొద్దని ప్లాంట్ కార్మికులు ఆందోళన చేస్తున్నారని చెప్పారు. భూములు అమ్మి అప్పులు తీర్చుకోవాలని కార్మిక సంఘాలతో గత ముఖ్యమంత్రి అన్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణపై స్పష్టత ఇవ్వాలని కోరారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై రాష్ట్ర ప్రభుత్వ విధానం ఏమిటని ప్రశ్నించారు. ప్రైవేటీకరణవైపు స్పష్టమైన అడుగులు పడుతున్నాయని చెప్పారు.

ఇటీవల ఒక బ్లాస్ట్ ఫర్నిచర్‌ను మూసివేశారని, ఉద్యోగులకు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ ఇచ్చారని చెప్పారు. శాసనసభ, మండలిలో ప్రైవేటీకరణ చేయొద్దని కేంద్రాన్ని కోరుతూ గానీ, డిమాండ్ చేస్తూ గానీ ఏకగ్రీవ తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. విశాఖ స్టీల్ ప్లాంట్ ఎందరో త్యాగాల ద్వారా వచ్చిందన్నారు. వైసిపి పాలనలో ప్రైవేటీకరణ జరగబోతే తాము అడ్డుకున్నామని చెప్పారు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ కానివ్వబోమన్నారు. దీనిని నిర్వహించే అంశంలో చాలా లోపాలు ఉన్నాయని చెప్పారు. ఇటీవల ప్లాంట్ కార్మికులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి సమగ్ర కార్యాచరణ ఇస్తే కేంద్ర ప్రభుత్వం వద్దకు తీసుకెళ్తామని అన్నారు. ప్రైవేటీకరణ కాకుండా తాము నిలబడతామని చెప్పారు. అఖిలపక్ష పార్టీలను కేంద్ర ప్రభుత్వం వద్దకు తీసుకెళ్లాలని తాము గత ప్రభుత్వంలో అభ్యర్థించినా తీసుకెళ్లలేదన్నారు. గతంలో త్రికర్ణశుద్ధితో గత ప్రభుత్వం ఆపి ఉంటే ఈ ప్రశ్న ఇప్పుడు ఉత్పన్నమయ్యేది కాదని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చెప్పారు. మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. నిధుల సేకరణ కోసం గత ప్రభుత్వంలో భూములు అమ్ముకునే ప్రయత్నం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో ఆపే శక్తి లేకపోతే అఖిలపక్షాన్ని తాము తీసుకెళ్లేవాళ్లమన్నారు. తమకు ఆ శక్తి ఉందనే తీసుకెళ్లలేదని చెప్పారు. కొత్త ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల కాలంలో ప్లాంట్ భూములను వేలం వేసేందుకు రెండు విడతలుగా నోటిఫికేషన్ ఇచ్చారని చెప్పారు. ప్లాంట్‌ను పూర్తిగా ప్రైవేటీకరణ చేయకుండా ఉంచాలన్నారు. ప్రైవేటీకరణ చేస్తే పోరాడతామన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని కోరారు. మంత్రులు అచ్చెన్నాయుడు, భరత్ మాట్లాడుతూ.. ప్రైవేటీకరణ చేయడం లేదని, అలాంటప్పుడు తీర్మానం చేయాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. ప్లాంట్ ప్రైవేటీకరణ చేయొద్దని ప్రతిపక్ష సభ్యులు ఆందోళన చేయడంతో సభను ఛైర్మన్ కొంతసేపు వాయిదా వేశారు.



### వణుకుతున్న మన్యం

- రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు

**ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)**

చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. రాత్రి వేళలు, తెల్లవారుజామున విపరీతమైన పొగమంచు కురుస్తోంది. అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లాలో గడిచిన మూడురోజుల్లో చలి తీవ్రత పెరిగింది. తెల్లవారుజామున పది నుంచి 12 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాయంకాలం 16 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. వేకువజామున పనుల్లోకి వెళ్లే రైతులు, ఉద్యోగులు, కార్మికులు, వ్యాపారులు పెరిగిన చలితో అవస్థలు పడుతున్నారు. మంచు తీవ్రత పెరగడంతో వంజంగి హిల్స్‌కు పర్యాటకుల తాకిడి పెరిగింది. మంచుతో కప్పబడిన ఎత్తైన హిమగిరిలు పర్యాటకులను అలరిస్తున్నాయి.

## మైనార్టీలపై బిజెపి మంత్రి సత్యకుమార్ అనుచిత వ్యాఖ్యలు

- విచారం వ్యక్తం చేసిన సభ

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

బిజెపి మంత్రి సత్యకుమార్ యాదవ్ చేసిన అనుచిత వ్యాఖ్యలు శాసనమండలిలో దుమారం రేగింది. ఒక మతాన్ని కించపరిచేలా మాట్లాడిన మాటలపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాదోపవాదనలు జరిగాయి. మంత్రి వ్యాఖ్యలపై సభ విచారం వ్యక్తం చేస్తున్నట్లు మండలి ఛైర్మన్ కె మోషేను రాజు ప్రకటించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో వైద్యవిద్య సీట్లను వద్దంటూ జాతీయ వైద్య మండలికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసిన అంశంపై వైసిపి సభ్యులు పి వరాహ వెంకట సూర్యనారాయణరాజు, అరుణ్‌కుమార్ గురువారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రిని అడిగారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ '100 ఎలుకలు తిన్న పిల్లి పాపపు పరిహారం కోసం హజ్ యాత్రకు వెళ్లినట్లు విధ్వంసం సృష్టించిన వైసిపి నాయకులు ఇప్పుడు మాట్లాడుతున్నారు' అని వ్యాఖ్యానించారు.

ఈ వ్యాఖ్యలపై వైసిపి సభ్యులు మహ్మద్ రుహుల్లా మిగిలిన సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక మతాన్ని కించపరిచే విధంగా మంత్రి వ్యాఖ్యాలు సరికావని, వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాను సామెత చెప్పానని 'హజ్ యాత్ర', 'కాశీ యాత్ర' అభ్యంతకరమైతే తన మాటలను వెనక్కి తీసుకుంటానని మంత్రి అన్నారు. వైసిపి సభ్యులు ఛైర్మన్ పోడియం ముందు ఆందోళన చేశారు. 'బిజెపి మంత్రి డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. మంత్రి క్షమాపణ చెప్పాలని, అతను మాటలను రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు.... మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యలను సమర్థిస్తూ హజ్ యాత్ర విలువను పెంచారని అన్నారు.

డిప్యూటీ ఛైర్మన్ మనయా జకియా ఖానమ్ మాట్లాడుతూ.. గౌరవప్రదమైన సభలో మతాన్ని, కులాన్ని కించపరిచేలా మాట్లాడకూడదని అన్నారు. మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ.. సభ రికార్డులను పరిశీలించి అభ్యంతరకమైన వ్యాఖ్యలుంటే తొలగించాలని చెప్పారు. మండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. ఈ మండలి సమావేశాలు ప్రారంభమైన నాటి నుంచి తన బాధ్యతను విస్మరించి మతాలు, వ్యక్తులను ధూషిస్తూ మాట్లాడటం సమంజసం కాదని మంత్రి సత్యకుమార్‌నుద్దేశించి అన్నారు. అభ్యంతరకరమైన పదాలుంటే సభ్యులు బాధపడ్డ విషయంపై సభ విచారం వ్యక్తం చేస్తుందని, అటువంటి పదాలను రికార్డుల నుంచి తొలగించాలని ఛైర్మన్ పేర్కొన్నారు.

# అదానితో ఒప్పందాలన్నింటినీ రద్దు చేసుకోవాలి

- తక్షణమే అరెస్టు చేయాలి
- కేటాయించిన భూములను వెనక్కి తీసుకోవాలి
- విశాఖ డేటా సెంటర్‌ను ప్రభుత్వమే నిర్వహించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు

**ప్రజాశక్తి - అరకులోయ రూరల్ (అల్లూరి జిల్లా)**

భారీ కుంభకోణానికి పాల్పడిన అదానీని తక్షణమే అరెస్ట్ చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అరకు లోయలోని ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అదాని కుంభకోణంపై అమెరికాలోని న్యూయార్క్ కోర్టులో కేసు దాఖలైనా విచారణ చేయడానికి కేంద్రం నిరాకరిస్తోందన్నారు. ఢిల్లీలోని ఉన్నతాధికారులకు రూ.2,029 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌లోని ఉన్నతాధికారులకు, రాజకీయ నాయకులకు రూ.1,750 కోట్లు అదాని లంచం ఇచ్చినట్లు బట్టబయలైందని, ఈ మేరకు కేసు న్యూయార్క్ కోర్టులో దాఖలు అవ్వడం దేశానికి తలవంపులు తీసుకొచ్చే విషయమని చెప్పారు. అనేక సాక్ష్యాధారాలు బయటకు వస్తున్నా మోడీ ప్రభుత్వం అదానీని వెనకేసుకురావడం సిగ్గుచేటన్నారు. తక్షణమే అదానిని అరెస్ట్ చేయడంతో పాటు, ఆయన సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వ చేసుకున్న ఒప్పందాలనింటిన్ని రద్దు చేయాలని, వివిధ ఒప్పందాల్లో భాగంగా అదాని సంస్థలకు రాష్ట్ర వ్యాప్తంగా కేటాయించిన భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లంచాలు తీసుకున్న అధికారులపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

**సెకి ఒప్పందాలను రద్దు చేయాలి...**

గత వైసిపి ప్రభుత్వం మోడీ ఒత్తిడితోనే ఒప్పందం చేసుకుందని, సెకి సంస్థకు హైడల్ పంప్డ స్టోరేజ్, సోలార్ గ్రీన్ ఎనర్జీ పేరుతో 11 వేల ఎకరాల భూములు కేటాయించిందని, సత్యసాయి, నంద్యాల, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో అలా భూములు ధారాదత్తం చేశారని తెలిపారు. సెకి విద్యుత్ యూనిట్‌కి రూ.2.45 పైసలు ఇవ్వాలని పేర్కొంటూ 25 ఏళ్లపాటు ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. ఇదో పెద్ద కుంభకోణమని ఆ రోజే సిపిఎం తీవ్రంగా వ్యతిరేకించి, విచారణ జరపాలని డిమాండ్ చేసిందని ఆయన గుర్తుచేశారు. మోడీ ఒత్తిడితోనే రాష్ట్రంలో పంప్డ స్టోరేజ్ ప్రాజెక్టులను నాడు అదానీకి కేటాయించారన్నారు. తాజాగా చంద్రబాబు ప్రభుత్వం అదానీ ప్రతినిధులతో, వారి కుమారుడితో సమావేశమై మళ్లీ ఒప్పందం చేసుకుంటున్నట్టు సంతోషంగా ప్రకటించడం సిగ్గుచేటని చెప్పారు. తక్షణమే సెకి ఒప్పందాలను రద్దు చేయాలని, అదే సమయంలో తక్కువ ఖర్చుతో గ్రీన్ ఎనర్జిని ఉత్పత్తిచేసి ప్రజలకు ఇవ్వాలని శ్రీనివాసరావు కోరారు. విశాఖపట్నంలో అదాని గ్రూపు ఏర్పాటు చేయతలపెట్టిన డాటా సెంటర్‌ను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. అదాని కుంభకోణంపై చంద్రబాబు ప్రభుత్వం తక్షణం స్పందించాలని లేని పక్షంలో జగన్ ప్రభుత్వానికి, బాబు ప్రభుత్వానికి తేడా ఉండదని అన్నారు. తాము అవినీతిని సహించబోమని పవన్ కల్యాణ్ రోజురోజుకూ రంకెలేస్తున్నారని, ఆయన ఈ కుంభకోణం మీద స్పందించాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం అదానీ విషయమై అసెంబ్లీలో చర్చించి ఒప్పందాల రద్దుకు చర్యలు చేపట్టాలన్నారు.

**అభివృద్ధి పేరుతో భారాలు**

రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పేరుతో ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వం ఇలానే చేసిందని గుర్తుచేశారు. రోడ్ల గుంతలు పూడ్చాలంటే జిల్లా రోడ్లపై టోల్ ట్యాక్స్ వేయాల్సిందేనని చంద్రబాబు చెప్పడం దారుణమన్నారు. రాష్ట్రానికి డబ్బులు లేకపోతే కేంద్రంతో పోరాడి, లేకుంటే బతిమాలి నిధులు తీసుకొచ్చి గుంతలను పూడ్చాలన్నారు. సాగునీటి ప్రాజెక్టులను కూడా ప్రైవేటుకు అప్పగిస్తామని చెబుతున్నారన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయిస్తామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పిన మాటలు ఉత్తివేనని అర్థమవుతోందన్నారు. ఇప్పటి వరకూ అల్లూరి జిల్లాకు ఏమీ కేటాయింపులు చేయని విషయాన్ని ప్రస్తావించారు. నిధుల కేటాయింపులు లేకుండా అభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, అనంతగిరి జెడ్‌పిటిసి డి.గంగరాజు పాల్గొన్నారు.

**గిరిజన స్పెషల్ డిఎస్‌సికి నోటిఫికేషన్ ఇవ్వండి**

అల్లూరి, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పెద్ద సంఖ్యలో ఆదివాసీ నిరుద్యోగులు డిఎస్‌సి కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మెగా డిఎస్‌సిని 16347 పోస్టులతో తీస్తే అల్లూరి జిల్లాలో ఆదివాసీలకు 60-70 పోస్టులు మాత్రమే ఉన్నాయని, అలాంటప్పుడు గిరిజన నిరుద్యోగులకు ఏం న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో జిఓ నెంబరు 3ని పునరుద్ధరణ చేసి, స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ జారీ చేసి గిరిజన నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు మొట్టమొదటి సంతకం డిఎస్‌సి మీద పెట్టారని, ఆ సంతకమే ఇంతవరకూ అమలు కాలేదని అన్నారు.



## 5 శాతానికి పడిపోయిన సెల్‌ఫోన్ల తయారీ

- మంత్రి లోకేష్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

2019 వరకు రాష్ట్రంలో 25 శాతం సెల్‌ఫోన్లు తయారు కాగా, గత ఐదేళ్లలో 5 శాతానికి పడిపోయాయని ఐటిశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. శాసనసభలో గురువారం ఎలక్ట్రానిక్స్ పాలసీ, డేటా సెంటర్ పాలసీలపై ఆయన మాట్లాడారు. 53 ఎలక్ట్రానిక్స్ కంపెనీల్లో 27 ఇతర రాష్ట్రాలకు పారిపోయాయని తెలిపారు. టాటా గ్రూప్ సంస్థ ఓల్టాస్ రూ.1,200 కోట్ల పెట్టుబడి పెడతాం, ఏడెకరాల భూమి అడిగితే ఇవ్వకపోవడంతో పక్క రాష్ట్రానికి వెళ్లిపోయారన్నారు. 2,330 మందికి ఉపాధి కల్పించే జిఎం ఎలక్ట్రికల్స్‌ను, అమర్ రాజా కంపెనీని వేధించి తెలంగాణకు తరిమేశారని తెలిపారు. గత శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి వల్ల టిసిఎల్ సంస్థ పలు సంస్థలు ఇతర రాష్ట్రాలకు వెళ్లాయన్నారు. గత పాలకుల వేధింపులు తాళలేక ఫ్యాక్స్ కాన్, యాపిల్ వంటి పరిశ్రమలు కర్ణాటక, తెలంగాణ, గుజరాత్‌కు వెళ్లిపోయాయని తెలిపారు. రాబోయే రోజుల్లో మొబైల్ ఫోన్‌తో పాటు పర్సనల్ కంప్యూటర్స్, ఐప్యాడ్ అసెంబ్లింగ్ కాకుండా టోటల్ కంపోనెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లు రాష్ట్రంలో ఏర్పాటు చేయడంపై దృష్టిసారించామన్నారు. అలాగే స్మాల్ అండ్ మీడియం పరిశ్రమలకు 30 శాతం క్యాపిటల్ సబ్సిడీ అందిస్తున్నామని తెలిపారు. డేటా ఈజ్ ద ఫ్యూచర్... ఎఐ అనేది నేడు అనివార్యమైందన్నారు. డేటా సెంటర్లకు గ్రీన్ ఎనర్జీ కూడా అవసరం ఉందని, డేటా సెంటర్లకు కావాల్సిన ఎకో సిస్టమ్ కల్పించి 24/7 గ్రీన్ ఎనర్జీ అందిస్తామని హామీ ఇచ్చామన్నారు.

## ద్రవ్య వినిమయ బిల్లుకు మండలి ఆమోదం

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ద్రవ్య వినిమయ బిల్లు సహా మరో మూడు బిల్లులకు శాసనమండలి గురువారం ఆమోదం తెలిపింది. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తరపున మంత్రి అచ్చెన్నాయుడు మండలిలో ద్రవ్య వినిమయ బిల్లును ప్రవేశపెట్టగా, సభ్యులు ఎటువంటి చర్చ లేకుండా ఆమోదం తెలిపారు. ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆంధ్రప్రదేశ్ అబ్కారీ (సవరణ) బిల్లు - 2024, ఏపి స్వదేశంలో తయారైన విదేశీ మద్యం, విదేశీ మద్యముల వ్యాపార క్రమబద్ధీకరణ (సరవణ) బిల్లు - 2024, ఆంధ్రప్రదేశ్ మద్య నిషేధ (సవరణ) బిల్లు - 2024లకు మండలి ఆమోదం తెలిపింది. ఎపి మద్య నిషేధ బిల్లుపై జరిగిన చర్చలో వైసిపి సభ్యులు వై శివరామిరెడ్డి మాట్లాడుతూ... షాపులు ఎక్కడపడితే అక్కడ పెట్టడానికి వీలు లేదని, బెల్టు షాపులు నిర్వహించడానికి అవకాశం లేదని స్వయంగా ముఖ్యమంత్రి చెప్పినా, తమ ప్రాంతంలో గ్రామానికి 10 బెల్టు షాపులు ఉన్నాయని అన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర సమాధానమిస్తూ... అధిక ధరలు వసూలు చేసినా, బెల్ట్ షాపులను నిర్వహించినా మొదటిసారి రూ.5 లక్షలు జరిమానా విధిస్తారని, అనంతరం అటువంటి చర్యలకు పాల్పడితే లైసెన్స్ రద్దు చేస్తారన్నారన్నారు. కల్లుగీత కార్మికులకు కేటా యించిన 10 శాతం షాపులకు డిసెంబరులో కేటా యిస్తామన్నారు. గత ప్రభుత్వంలో కొన్ని మండలాలకు అసలు షాపులే కేటాయించకుండా అచ్చంగా బెల్టు షాపులపైనే ఆధారపడేలా చేశారని తెలిపారు.

# త్వరలో 6,100 పోలీస్ ఉద్యోగాల భర్తీ

- నేరస్తులకు కొమ్ముకాస్తున్న జగన్
- తల్లీచెల్లిని అసభ్యంగా దూషించిన వర్రాకు మద్దతు ఇస్తారా?
- క్రిమినల్ చట్టసవరణలపై సిఎం చంద్రబాబు



**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో పోలీసుశాఖను బలోపేతం చేస్తామని, ఖాళీగా ఉన్న 6,100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ త్వరలో భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. శాసనసభలో గురువారం సాయంత్రం ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు, పిడి యాక్టు పటిష్టత, ఇసుక అక్రమార్కులపై పిడి యాక్టు, వివిధ నేరాల్లో దోషులకు కఠిన శిక్షలకు సంబంధించి చట్ట సవరణ బిల్లులను సిఎం తరపున హోంమంత్రి అనిత, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో సిఎం చంద్రబాబు మాట్లాడుతూ.. నేరస్తుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించేలా శాంతిభద్రతలను కాపాడతామని తెలిపారు. ఆడబిడ్డల జోలికొస్తే ఏం చేయాలో చేసి చూపిస్తానని తెలిపారు. వైసిపి హయాంలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యమైందన్నారు. పోలీసుశాఖను బలోపేతం చేసేందుకు అధునాతన వాహన సమకూరుస్తామని తెలిపారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసేందుకు ప్రాంతీయ ఫోరెన్సిక్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. రాజకీయ ముసుగులో నేరాలు చేస్తే ముసుగు తీసి కఠినంగా శిక్షిస్తామన్నారు. వైసిపిలో పేటిఎం బ్యాచ్ పెట్రేగిపోతుందని, జగన్‌ను వ్యతిరేకించిందని ఆయన సోదరి షర్మిల, తల్లి విజయమ్మపై అసభ్యకరమైన పోస్టులు పెట్టిన కడప ఎంపి అవినాష్‌రెడ్డి అనుచరుడు వర్రా రవీంద్రరెడ్డిని వెనకేసుకురావడం ద్వారా జగన్ రాజకీయంగా ఎంత దిగజారిపోయారో అని ప్రజలంతా చర్చించుకుంటున్నారని తెలిపారు. వర్రా పేరుతో టిడిపి వారు పోస్టింగ్‌లు పెట్టారని ఏడాది తరువాత ఇప్పుడు మాట్లాడుతున్నారని, ఎవరు.. ఎక్కడ పోస్టింగ్‌లు పెట్టారో నూతన సాంకేతిక పద్ధతి ద్వారా తేలుస్తామన్నారు. వర్రాను ప్రోత్సహించిన వారిని అరెస్టు చేయాలని ఆయన సోదరి వైఎస్ షర్మిల డిమాండ్ చేస్తుంటే వర్రాకు సంబంధం లేదని జగన్ బుకాయిస్తున్నారని ఆరోపించారు. శాంతిభద్రతలు ఉంటేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం ఉంటే పెట్టుబడులు వస్తాయన్నారు. పెట్టుబడులు వస్తే ఉద్యోగాలొస్తాయని, సంపద పెరుగుతుందన్నారు. గంజాయిని నిర్మూలించేందుకు డ్రోన్ల ద్వారా సర్వే చేస్తున్నామన్నారు. ప్రభుత్వ డిజిటల్ కార్పొరేషన్‌లో సొంత మనుషులను పెట్టి సోషల్ మీడియాలో పని చేయించుకున్నారని జగన్‌పై సిఎం ధ్వజమెత్తారు. వీరి అడ్రస్సులు కూడా లేకుండా చేశారని అన్నారు. ఇసుక అక్రమార్కులపైనాపై పిడి చట్టం అమలు చేస్తామని వెల్లడించారు. హోంమంత్రి అనిత, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, విష్ణుకుమార్ రాజు తదితరులు మాట్లాడారు.

## ఎలక్ట్రానిక్ రంగంలో 5 లక్షల ఉద్యోగాలు

- మంత్రి నారా లోకేష్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాబోయే ఐదేళ్లలో ఐటి రంగంలో ఐదు లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని, విశాఖపట్నంలో రానున్న మూడు నెలల కాలంలో టిసిఎస్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని, క్యాంపస్ ఏర్పాటుకు కూడా వారు ఒప్పుకున్నారని ఐటిశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఇన్ఫోసిస్ సంస్థను కూడా క్యాంపస్ ఏర్పాటు చేయాలని కోరామని, ఇందుకు అవసరమైన భూములను కేటాయించి ఆరు నెలల్లో పనులు మొదలుపెడతామన్నారు. విశాఖపట్నంలో ఐటి హబ్‌పై వంశీకృష్ణ శ్రీనివాస్, గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, ఈశ్వరరావు శాసనసభలో గురువారం అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేష్ సమాధానమిచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా 20 శాతం తెలుగువారు ఉండటం హర్షణీయమన్నారు. 2014-19లో రాష్ట్రానికి దాదాపు 150 కంపెనీలు రావడంతో 50 వేలమందికి ఉపాధి లభించిందన్నారు. డాటా సెంటర్‌ను తీసుకొచ్చేందుకు అప్పట్లో అదానితో ఒప్పందం చేసుకున్నామని, విశాఖలో ఐటి రంగం ప్రముఖులతో కాంక్లేవ్ పెట్టామన్నారు. వైసిపి ప్రభుత్వ అనాలోచిత చర్యల వల్ల నిక్సీ, ఎస్‌టిబిఐ వెళ్లిపోయాయన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గత ప్రభుత్వ హయాంలో ఐటి కంపెనీల్లో వాటాలు అడిగారని సభకు తెలిపారు. ముఖ్యంగా డేటా సెక్యూరిటీ, టాక్సేషన్, డాటా ఎంబసీలపై కేంద్ర స్థాయిలో పాలసీ ఫ్రేమ్‌వర్క్ చేయాల్సి ఉందన్నారు. సోషల్ ఎకో సిస్టమ్ ఏర్పాటులో భాగంగా దేశంలోనే అతిపెద్ద కన్వెన్షన్ సెంటర్ త్వరలో విశాఖకు రాబోతుందన్నారు. ఇటీవలే టూరిజాన్ని ఇండస్ట్రీ హబ్‌గా గుర్తించే పాలసీ తీసుకొచ్చామన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో ముందుకు వెళ్తున్నామన్నారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- మండలిలో ప్రస్తావించిన పిడిఎఫ్ సభ్యులు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పిడిఎఫ్ సభ్యులు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. శాసనమండలి 'ప్రత్యేక ప్రస్తావన'లో గురువారం ఈ అంశాలను ప్రస్తావించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రంథాలయ ఉద్యోగులకు 010 హెచ్ కింద జీతాలు మంజూరు చేయాలని పిడిఎఫ్ సభ్యులు కెఎస్ లక్ష్మణరావు కోరారు. ప్రస్తుతం వీరికి గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద జీతాలు చెల్లించడం వల్ల సమయానికి అందని పరిస్థితి నెలకొందన్నారు. అక్టోబరు నెలలో అందాల్సిన జీతాలు ఇప్పటికీ అందలేదని చెప్పారు. కెజిబివిలో గతంలో తొలగించిన 89 మందిని విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని పిడిఎఫ్ సభ్యులు ఐ వెంకటేశ్వరావు కోరారు. వీరు రూ.12 వేల జీతంతో ఇంటర్మీడియట్ విద్యార్థులకు తరగతులు బోధిస్తున్నారని చెప్పారు. 2022 జూన్‌లో వీరిని విధుల్లోంచి తొలగించారని, అర్హత ఉన్న కొందరిని ఇతర సబ్జెక్టుల బోధనకు సర్దుబాటు చేశారన్నారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

ప్రభుత్వ పాలిటెక్నిక్ అధ్యాపకుల 2019-21 మధ్య పెండింగ్‌లో ఉన్న జీతభత్యాల బకాయిలను విడుదల చేయాలని పాకలపాటి రఘువర్మ కోరారు. ప్రభుత్వ వైద్యశాలల్లో మహిళలకు డ్యూటీ రూమ్స్ ఏర్పాటు చేయాలని సిపాయి సుబ్రమణ్యం కోరారు. ఉద్యోగులకు ప్రభుత్వం పాత జిపిఎస్ విధానాన్ని కొనసాగిస్తుందా లేక గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఒపిఎస్ విధానాన్ని అమలు చేస్తుందా అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని ఎంవి రామచంద్రారెడ్డి కోరారు. కెజిబివిలో పని చేసే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కోసం గతంలో విడుదల చేసిన జిఓలను అమలు చేయాలని కల్పలత కోరారు. నాలుగేళ్ల తరువాత గతంలో జరిగిన ఉపాధి పనులపై ఎసిబి విచారణ ప్రారంభించిందని, దీనిని కొనసాగిస్తారా లేక నిలిపివేస్తారా అనేది స్పష్టం చేయాలని అశోక్‌బాబు కోరారు. ఆఫ్రికన్ జాతి కోనోకార్పస్ మొక్కలపై అధ్యయనం చేయించాలని పి హరిప్రసాద్ కోరారు. ఈ మొక్కలపై ప్రజల్లో అనేక అనుమానాలు, భయాలు ఉన్నాయన్నారు. పలాస నియోజకవర్గంలో డయాలసిస్ సెంటర్లు, బెడ్‌లు పెంచాలని నర్తు రామారావు కోరారు. రాష్ట్రంలో ఎపిఎస్‌పిఎఫ్ కానిస్టేబుళ్లకు జోనల్ ప్రాతిపదికన బదిలీలు చేయాలని చంద్రగిరి ఏసురత్నం కోరారు. ప్రభుత్వ పాఠశాలలు పనివేళలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకూ తగ్గించాలని చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. తణుకు తదితర ప్రాంతాల్లో డంపింగ్ యార్డుల్లో నివశిస్తున్న యానాదులకు ఆధార్ కార్డులు మంజూరు చేసి సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని వి రవీంద్రనాథ్‌రెడ్డి కోరారు.

# క్రమం తప్పకుండా ప్రివిలేజ్ కమిటీ సమావేశాలు

- ప్రభుత్వాన్ని కోరిన పిడిఎఫ్ సభ్యులు
- ప్రొటోకాల్ ఉల్లంఘనలపై 'మండలి'లో సభ్యుల అసంతృప్తి

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

శాసనమండలి సభ్యుల విషయంలో అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని పిడిఎఫ్ సభ్యులు కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి ప్రివిలేజ్ కమిటీ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించి, ప్రొటోకాల్ అమలుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై గురువారం సభ్యులిచ్చిన షార్ట్ నోటీస్‌పై చర్చకు శాసనమండలి ఛైర్మన్ కె మోషేను రాజు అనుమతినిచ్చారు. కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. అనేక సందర్భాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగుతుందని తెలిపారు. బాపట్లలో ఇటీవల స్వర్ణాంధ్ర (2047) వర్క్‌షాపు నిర్వహించినప్పుడు శాసనమండలి సభ్యులకు ఆహ్వానం లేదన్నారు. ప్రివిజిలేజ్ కమిటీ ఉన్నా నాలుగేళ్లకు ఒకసారి సమావేశం పెట్టడం వల్ల ఎటువంటి ఫలితం ఉండటం లేదన్నారు. ప్రభుత్వం కూడా జిఎడి నుంచి జిల్లా అధికారులకు ఉత్తర్వులివ్వాలని కోరారు. గుంటూరు జిల్లా డిఆర్‌సి నిర్వహిస్తే ఎమ్మెల్సీలను ఆహ్వానించలేదన్నారు. ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఉల్లంఘన పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఎమ్మెల్సీలు ఫోన్ చేస్తే స్పందించడం లేదని, మెసేజ్ పెట్టినా, లెటర్ రాసినా స్పందన ఉండటం లేదని, ఇదేం పద్ధతి అని ప్రశ్నించారు. శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. తనను ప్రతిపక్షనేతగా ప్రభుత్వం గుర్తించి కేబినెట్ హోదా ఇస్తూ ఉత్తర్వులిచ్చినా ఇప్పటికీ అధికారులు అమలు చేయలేదని చెప్పారు. ముఖ్యమంత్రి పెట్టిన సంతకానికే విలువ లేకపోతే, సామాన్యులకు ఏం న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. సభ్యులు ఎం అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. పోలీస్ అమరవీరుల దినం రోజున భీమవరంలో జరిగిన కార్యక్రమానికి మండలి ఛైర్మన్ కె మోషేను రాజు హాజరైతే ఎటువంటి ప్రొటోకాల్‌నూ అధికారులు పాటించకపోవడాన్ని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ అంశంపై సభ్యులు బి రామ్‌గోపాల్‌రెడ్డి, వి చిరంజీవిరావు, శ్రీకాంత్, ఎం హనుమంతరావు, రవీంద్ర, మాధవ్, బి తిరుమలనాయుడు తదితరులు ప్రసంగిస్తూ వారికి ఎదురైన అనుభవాలను వెల్లడించారు.

**ప్రొటోకాల్‌పై చర్చ విచారకరం : మండలి ఛైర్మన్**

ప్రొటోకాల్ అంశంపై చర్చ జరగాల్సి రావడం చాలా విచారకరం అని ఛైర్మన్ కె మోషేను రాజు పేర్కొన్నారు. ఇటీవల త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి భీమవరం వస్తే, ఈ విషయంపై తనకు సమాచారం ఇవ్వలేదని చెప్పారు. అధికారులను ప్రశ్నించేందుకు ఫోన్ చేస్తే కనీసం స్పందించని దుస్థితి నెలకొందన్నారు. సభ్యులు లేవనెత్తిన సమస్యలను విచారించి తగుచర్యలు తీసుకోవాలని, మూడు నెలలకు ఒక పర్యాయం ప్రివిలేజ్ కమిటీ సమావేశం నిర్వహించాలని సూచించారు. అంతకముందు, చర్చ ప్రారంభంలో అధికారులు హాజరు కాలేదని, ముందు వారిని పిలిపించాల్సిందిగా మంత్రి అచ్చెన్నాయుడుకు సూచించారు.

**ప్రొటోకాల్ పాటించాల్సిందే : మంత్రి అచ్చెన్నాయుడు**

ప్రొటోకాల్ తప్పనిసరిగా పాటించాల్సిందేనని మంత్రి కె అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రతి పదవికీ తగిన విధంగా ప్రొటోకాల్ ఉందని, గత ఐదేళ్లలో అనుసరించిన విధానాల నుంచి కొందరు అధికారులు బయటపడలేదని చెప్పారు. ప్రొటోకాల్‌కు తాను ఒక బాధితుడినేనని, గత ఐదేళ్లుగా తన నియోజకవర్గంలో ప్రొటోకాల్ పాటించలేదన్నారు. శాసనమండలిలో ప్రతిపక్షనేతగా యనమల రామకృష్ణుడు ఉన్నా.. ప్రొటోకాల్ పాటించని సంఘటనలు అనేకం ఉన్నాయని తెలపారు. మండలి ఛైర్మన్ మోషేను రాజుకు ఎదురైన సంఘటనలపైనా విచారించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

## చట్ట సభల్లో బిసిలకు 33 శాతం రిజర్వేషన్లు

- శాసనసభలో తీర్మానం



**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

చట్ట సభల్లో బిసిలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ గురువారం అసెంబ్లీ తీర్మానం చేసింది. బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత బిల్లును ప్రవేశపెట్టారు. బిల్లుపై సిఎం చంద్రబాబు మాట్లాడుతూ.. టిడిపి మొదటి నుంచి బిసిలకు ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. గతంలో స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్లు ఆమోదించామన్నారు. భారత రాజ్యాంగాన్ని సవరిస్తూ దేశ వ్యాప్తంగా చట్ట సభల్లో బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ మేరకు కేంద్రాన్ని కోరతామన్నారు. బిసిల అభ్యున్నతే లక్ష్యంగా టిడిపిని ఎన్‌టిఆర్ స్థాపించారన్నారు. వెనుకబడిన తరగతులకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించారన్నారు. ఆయన స్ఫూర్తితో పదవులు, సీట్లు కేటాయింపుల్లోనూ బిసిలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. మరింత మంది బిసిలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలన్న ఉద్దేశంతో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని తీర్మానం ప్రవేశపెట్టామన్నారు.

**త్వరలో నూతన టెక్స్‌టైల్స్ పాలసీ**

జౌళి పరిశ్రమ అభివృద్ధి కోసం త్వరలో నూతన టెక్స్‌టైల్స్ పాలసీ తీసుకురానున్నట్లు మంత్రి సవిత పేర్కొన్నారు. ఎమ్మిగనూరు టెక్స్‌టైల్స్ పార్కుపై ఎమ్మెల్యే బి జయనాగేశ్వరరెడ్డి అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానం చెప్పారు. 2015 ఆగస్టు 15 సందర్భంగా చేనేతలకు ఆసరాగా ఉండేలా ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటుకు నిర్ణయించారని, ఇందుకోసం 90 ఎకరాలు భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. అయితే ఈ భూమిని పేదల ఇళ్ల కోసం గత వైసిపి ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ నిర్ణయంపై కోర్టు కెళ్లి స్టే తీసుకొచ్చినట్లు తెలిపారు. ఎమ్మిగనూరుతోపాటు రాయదుర్గం, మైలవరం, పామిడిలోనూ టెక్స్‌టైల్స్ పాలసీ తీసుకురానున్నట్లు పేర్కొన్నారు.

## గంజాయిని కూకటి వేళ్లతో పెకిలిస్తాం

- హోంమంత్రి అనిత

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

గత ఐదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రంలో గంజాయి సాగు విచ్చలవిడిగా పెరిగిందని శాసనసభలో హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. రాష్ట్రంలో గంజాయి నిర్మూలన, బ్లేడ్ బ్యాచ్ ఆగడాలను అరికట్టే అంశంపై గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల్లో ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, రెడ్డప్పగారి మాధవి, సుందరపు విజయకుమార్ అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. 2014-19 టిడిపి పాలనతో పోలిస్తే 2019-24 మధ్య వైసిపి ప్రభుత్వ హయాంలో గంజాయి విచ్చలవిడిగా పెరిగిందన్నారు. గంజాయి రవాణా రాష్ట్రమంతటా జరుగుతున్నా.. వైసిపి పాలనలో చెక్‌పోస్టుల్లో కనీసం సిసి కెమెరాలు కూడా ఏర్పాటు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే చెక్ పోస్టులను పెంచడంతోపాటు నిరంతరం పర్యవేక్షణ కోసం సిసి కెమెరాలను ఏర్పాటుచేశామన్నారు. ఫలితంగానే ఐదు నెలల పాలనలో సుమారు 25 వేల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోగలిగినట్లు సభకు ఆమె వివరించారు. ఇప్పటి వరకు 916 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. గంజాయి నేరస్తులపై సిఎం చంద్రబాబు ఆదేశాలతో పిడి యాక్టులతోపాటు వారి ఆస్తులు కూడా స్వాధీనం చేసుకునేలా కఠిన చర్యలు చేపడుతున్నామన్నారు. గంజాయి నిర్మూలన కోసం ఇప్పటికే 469 మంది సిబ్బందితో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ విభాగాన్ని ఏర్పాటుచేశామన్నారు. స్పెషల్ ఫోర్స్‌కు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ప్రత్యేక బడ్జెట్‌నూ కేటాయించామన్నారు. అడిషనల్ డిజిపి స్థాయి వ్యక్తిని టాస్క్‌ఫోర్స్‌కు పర్యవేక్షణ అధికారిగా నియమించేందుకు ఇటీవల కేబినెట్ ఆమోదిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు హోంమంత్రి అనిత పేర్కొన్నారు. గంజాయి నిర్మూలన కోసం ప్రజల్లో సామాజిక బాధ్యత పెంచేలా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రకటించారు. రాజమండ్రి, విజయవాడ ప్రాంతాల్లో బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు ఎక్కువగా ఉన్నాయని, ఈ నేపథ్యంలో ఆ ప్రాంతాల్లో పటిష్ట నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. దా'రుణ' యాప్ బాధితుల్లో చదువుకున్న వారే అధికమని పేర్కొన్నారు.

## భూ కబ్జాల నిరోధానికి ప్రత్యేక చట్టం

- శాసనసభలో ఆమోదం

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

భూ కబ్జాలను నిరోధించేందుకు రూపొందించిన ల్యాండ్ గ్రాబింగ్ నిషేధ చట్టానికి శాసనసభ గురువారం ఆమోదించింది. ఎక్కడ భూమి కబ్జా చేసినా ఈ చట్టం ప్రకారం శిక్షార్హులవుతారు. భూ కబ్జాకు ప్రయత్నించినా, బెదిరించినా ఈ చట్టం ప్రకారం శిక్షించే అవకాశాన్ని కల్పించారు. అయితే ల్యాండ్ కబ్జా చేయలేదని ఆరోపణకు గురైన వారే నిరూపించుకోవాల్సి ఉంటుంది. రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ బిల్లును ప్రవేశపెట్టారు. బిల్లుపై సుదీర్ఘ చర్చ జరిగింది. చర్చ ముగింపులో సిఎం చంద్రబాబు మాట్లాడుతూ.. తనకు వచ్చే ఫిర్యాదుల్లో 90 శాతం భూ కబ్జాలపైనే ఉంటున్నాయన్నారు. అందుకే ఈసారి కఠినమైన చట్టాన్ని తెస్తున్నామని తెలిపారు. అన్ని రాష్ట్రాల్లో అధ్యయనం చేశాక యాంటీ ల్యాండ్ గ్రాబింగ్ యాక్టు తెచ్చామన్నారు. ఎవరైనా ఎదుటివారి భూములను ఆక్రమిస్తే ఈ చట్టం నుంచి తప్పించుకోలేరని అన్నారు. వారు ఆక్రమించిన భూమిని స్వాధీనం చేసుకుని నిందితులను జైలుకు పంపుతామన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. పిడి యాక్టుకు కూడా పదును పెడుతున్నామన్నారు. పకడ్బందీగా చట్టం ఉంటేనే అక్రమదారులు భయపడతారని తెలిపారు. భూ ఆక్రమణలకు పాల్పడ్డవారిని 6 నెలల్లోనే శిక్షిస్తామన్నారు. కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేస్తామన్నారు. డిఎస్‌పి కన్నా పైస్థాయి అధికారి ఈ కేసులపై విచారణ జరుపుతారన్నారు.

## త్వరలో మత్స్యకారులకు వేట నిషేధ భృతి

- మంత్రి అచ్చెన్నాయుడు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

మత్స్యకారులకు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటా నిలబెట్టుకుంటుందని, వారి మెరుగైన జీవనోపాధి కోసం చిత్తుశుద్ధితో పనిచేస్తుందని మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రపంచ మత్స్య దినోత్సవ వేడకలు-2024 విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. ప్రతియేటా మత్స్య దినోత్సవం రోజున వేట నిషేధ భృతి ఇవ్వడం ఆనవాయితీగా వస్తోందని, ఈ ఏడాది ఆర్థిక సమస్యలు కారణంగా ఇవ్వలేకపోయామని చెప్పారు. త్వరలోనే ఈ ఏడాది ఒక్కో లబ్ధిదారునికి రూ.10 వేలు భృతి ఇస్తామన్నారు. వచ్చే ఏడాది నుంచి భృతి రూ.20 వేలు ఇస్తామని అన్నారు. నాన్ ఆక్వా జోన్‌లోని ఆక్వా ఉత్పత్తుల సాగుకు యూనిట్ రూ.1.50కు విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, దీనిపై విధి విధానాలు రూపొందుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలోని మత్స్య ఉత్పత్తులు పెంచడానికి 1020 కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతంలో కేరళ తరహాలో ప్రతి 30 కిలోమీటర్లకు ఒక ఫిషింగ్ హార్బర్ గానీ, జట్టీ, ఫిష్ ల్యాండింగ్ సెంటర్ గానీ ఏర్పాటు చేయడానికి ప్రణాళికా బద్ధంగా ముందుకెళ్తున్నామన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు బడ్జెట్‌లో రూ.750 కోట్లు కేటాయించిందన్నారు. ఈ సందర్భంగా మత్స్య రంగంలో విశిష్ట సేవలు అందించిన వారిని సత్కరించారు. తొలుత ఏర్పాటుచేసిన ఆక్వా స్టాల్స్‌ను మంత్రులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ కేలండర్‌పై పిడిఎఫ్ వాయిదా తీర్మానం

- సూపర్ సిక్స్‌పై వైసిపి
- తిరస్కరించిన ఛైర్మన్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టుల భర్తీకి సంబంధించిన జాబ్ కేలండర్‌పై చర్చించాలని కోరుతూ పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు, స్వతంత్ర ఎమ్మెల్సీ పి రఘువర్మ వాయిదా తీర్మానం అందించారు. శాసనమండలి ప్రారంభం కాగానే ఈ అంశంపై చర్చించాలని ఛైర్మన్‌ను గురువారం కోరారు. సూపర్ సిక్స్ హామీలపై చర్చించాలని కోరుతూ వైసిపి సభ్యులు కె శ్రీనివాస్, పండుల రవీంద్ర బాబు, వై శివరామిరెడ్డి ఇచ్చిన వాయిదా తీర్మానాలను తిరస్కరిస్తున్నట్లు ఛైర్మన్ కె మోషేను రాజు వెల్లడించారు. ఈ అంశాలపై చర్చించాలని సభ్యులు వారి స్థానాల్లో కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. మరో విధానంలో చర్చకు రావాలని చెబుతూ.. వాయిదా తీర్మానాలను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించి ప్రశ్నోత్తరాలను ప్రారంభించారు.

## స్టీల్‌ప్లాంట్‌పై మౌనం తగదు

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ



**ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)**

విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని సుదీర్ఘకాలంగా కార్మికులు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు ఆందోళనలు చేపడుతున్నప్పటికీ కేంద్రం మౌనంగా ఉండడం సరికాదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్, డి.ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1379వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఎన్నికల సమయంలో ఉక్కు దీక్షా శిబిరానికి వచ్చి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడతామని హామీ ఇచ్చారని, ఆ తరువాత టిడిపి కూటమి అధికారంలోకి వచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఉండిపోయిందని తెలిపారు. ఈ నెల 29న ప్రధాని మోడీ విశాఖ వస్తున్న నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్‌పై కచ్చితమైన హామీ ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రధాని వద్ద స్టీల్‌ప్లాంట్ అంశాన్ని చర్చించాలని కోరారు. ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఉక్కు ఉద్యమంలో భాగంగా డిసెంబర్ 2న చలో కలెక్టరేట్ చేపట్టనున్నట్టు తెలిపారు.

# 'లా' విద్యార్థినికి న్యాయం చేయాలి

- గ్యాంగ్ రేప్ నిందితులను కఠినంగా శిక్షించాలి
- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి




విశాఖలో చేపట్టిన మానవహారంలో పాల్గొన్న రమాదేవి, ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థులు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)**

విశాఖ నగరంలో గ్యాంగ్ రేప్‌కు గురైన 'లా' విద్యార్థినికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. సమీపంలోని రహదారిపై మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై అకృత్యాలు రోజురోజుకూ పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖలో లా విద్యార్థినిని మోసం చేయడంతోపాటు లైంగికంగా హింసించే పనిలో పలువురిని ప్రధాన నిందితుడు భాగస్వాములను చేశాడని, వారి బారి నుంచి బయటపడే మార్గంలేక విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని తెలిపారు. రాష్ట్రంలో ఇటువంటి వరుస ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. గ్యాంగ్ రేప్ నిందితులు వంశీ, ఆనంద్ జగదీష్, రాజేష్‌లను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గంజాయి, మద్యం, మత్తు పదార్థాలను నిషేధించాలన్నారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలపై అత్యాచారాలు పెరిగాయని తెలిపారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు మాసాలు అయినప్పటికీ వాటిని నివారించడంలో విఫలమైందని విమర్శించారు. ఐదు నెలల కాలంలో ఒక్క కేసుపై కూడా విచారణ సవ్యంగా సాగలేదని, నిందితులకు శిక్షలు పడలేదని తెలిపారు. మహిళలు, ఆడపిల్లలపై జరుగుతున్న అత్యాచారాలపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న నిర్మలా సీతారామన్ దేశంలో పురుషాధిక్యత విషయం తెలియదని చెప్పడం సరికాదన్నారు. సనాతన ధర్మం పేరిట స్త్రీలను అణచివేస్తున్నారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సనాతన ధర్మం పేరిట కులమతాలను రెచ్చగొడుతున్నారన్నారు. వరుస అత్యాచార ఘటనలపై రాష్ట్ర ప్రభుత్వం నిపుణులతో కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, విశాఖ జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యుఎస్ఎన్.రాజు, కె.సంతోష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, వివిధ కాలేజీలకు చెందిన విద్యార్థినులు పాల్గొన్నారు. లా విద్యార్థినికి న్యాయం చేయాలంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన అనకాపల్లి జిల్లాలోని అనకాపల్లి, పాయకరావుపేట, నర్సీపట్నం ప్రాంతాల్లో ధర్నాలు, మానవహారాలు నిర్వహించారు.




ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

## కొవ్వాడ అణుప్లాంట్‌ను వ్యతిరేకిస్తూ ధర్నా

**ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్**

కొవ్వాడ అణుపార్కుకు వ్యతిరేకంగా శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం ఎన్‌జిఒ హోం ఆవరణలోని కొవ్వాడ భూసేకరణ కార్యాలయం ఎదుట సిపిఎం నాయకులు గురువారం ధర్నా చేపట్టారు. అణుపార్కు వద్దే వద్దు అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.తేజేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ అమ్మన్నాయుడు మాట్లాడుతూ.. అణు విద్యుత్కేంద్రాలు సురక్షితమంటూ ఆటమ్ ఆన్ వీల్స్ సంస్థ ప్రత్యేక ఎగ్జిబిషన్ ప్రచారాలు చేపట్టి ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ అణుశక్తి శాఖ అధికారులు గ్రామాల్లో చేయిస్తున్న ఈ ప్రచారాలను ప్రమాదకరమైన అణు కుంపటిని వ్యతిరేకిస్తున్న ప్రజలు నమ్మొద్దన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల్లో తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని, ప్రమాదకరమైన కొవ్వాడ అణు ప్లాంట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కొవ్వాడలో అణుపార్కు పెట్టడమంటే ఉత్తరాంధ్రలో అణుబాంబు పెట్టడమేనన్నారు. కొవ్వాడ భూకంపాల జోన్‌లో ఉందని, అధిక జనసాంద్రత కలిగి ఉన్న ప్రాంతమని గుర్తు చేశారు. చిన్న ప్రమాదం సంభవించినా కాకినాడ నుంచి ఒడిశాలోని ఛత్రపూర్ వరకూ నాశనమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ యోగ్యమైన భూములను నాశనం చేసి, అణుపార్కు పెట్టడానికి పాలకులు పూనుకోవడం దారుణమన్నారు. రూ.లక్షల కోట్ల ప్రజాధనంతో ఒకేచోట ఆరు అణు రియాక్టర్లు పెట్టడం దేశ ఆర్థిక వ్యవస్థకు, ప్రజల ప్రాణాలకు పెను ప్రమాదమని హెచ్చరించారు. అణువ్యర్థాలు నిక్షిప్తం చేయలేని స్థితిలో ప్రత్యామ్నాయ మార్గాల వైపు అడుగులు వేస్తుంటే, అమెరికా కార్పొరేట్ ప్రయోజనాల కోసం బిజెపి ప్రభుత్వం కొవ్వాడలో అణుపార్కు పెట్టేందుకు సిద్ధమవుతోందని విమర్శించారు. ధర్నాలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.ప్రసాదరావు, నాయకులు కె.సూరయ్య, ఆర్.ప్రకాష్, పి.గోవర్ధనరావు, ఎల్.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కౌలు రైతులకే పంట రుణం

- పిడిఎఫ్ ఎమ్మెల్సీల ప్రశ్నకు మంత్రి అచ్చెన్నాయుడు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

కౌలు రైతులకు పంట రుణాలిచ్చిన తరువాతే భూ యాజమానులకు అందించేలా కొత్త కౌలుదారుల చట్టం తీసుకొస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు వెల్లడించారు. బ్యాంకర్లతో ఈ దిశగా చర్చలు జరుపుతున్నామని తెలిపారు. కౌలు రైతుల సమస్యలపై శాసనమండలి ప్రశ్నోత్తరాల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు ప్రశ్న వేశారు. ఈ సందర్భంగా కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. కౌలు రైతులకు రుణం పొందాలంటే భూ యజమాని సంతకం ఉండాలని 2019లో చట్టం చేశారని చెప్పారు. దీనివల్ల రుణ అర్హత కార్డు వారు పొందలేకపోయారని, ఈ నిబంధన తొలగిస్తారా? లేదా? అని ప్రశ్నించారు. రుణ అర్హత కార్డు వచ్చినా భూ యజమాని రుణం తీసుకోవడంతో రైతులకు రావడం లేదన్నారు. భూమిపై భూ యజమానికి, పంటపై కౌలు రైతులకు రుణం ఇచ్చేలా ప్రభుత్వం ఏమైనా ఆలోచన చేస్తుందా? అని ప్రశ్నించారు. ఈ దిశగా బ్యాంకర్లతో మాట్లాడే అవకాశం ఉందా? అని ప్రశ్నించారు. ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఒసిలుగా ఉన్న కౌలురైతులను కులం పేరుతో అనర్హులుగా చేయడం సమంజసం కాదన్నారు. నూతన చట్టంలో కులాన్ని బట్టి కాకుండా కౌలు చేసే వారికి గుర్తింపు కార్డులు ఉండాలని చెప్పారు. ప్రభుత్వ సహాయ కార్యక్రమాలు వీరికి వర్తింపజేయాలని కోరారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 16 లక్షల మంది కౌలు రైతులు భూములను సాగు చేస్తున్నారని చెప్పారు. ఈ ఏడాది రూ.4 వేల కోట్లు కౌలురైతులకు రుణాలందించాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఇప్పటి వరకు రూ.1,400 కోట్ల రుణాలు అందించామని తెలిపారు. కొత్త చట్టానికి సంబంధించిన ముసాయిదాపై కౌలు రైతులు, సంఘాల అభిప్రాయాలు సేకరిస్తున్నామని, మరో 2-3 సమావేశాలు పూర్తయిన తరువాత కొత్త చట్టాన్ని తీసుకొచ్చి న్యాయం చేస్తామన్నారు. ముసాయిదాపై సలహాలు ఇవ్వాలని కోరారు.

# ప్రాణం తీసిన రుణభారం

- చిన్నారితో సహా దంపతుల ఆత్మహత్య
- అనంతపురం జిల్లా నార్పలలో విషాద ఘటన



కృష్ణకిశోర్, శిరీష, చిన్నారి

**ప్రజాశక్తి-నార్పల**

రుణ భారం ఓ కుటుంబాన్ని బలితీసుకుంది. మెడికల్ షాప్ నిర్వహణ కోసం చేసిన అప్పులు తీరే మార్గం లేక ఐదు నెలల చిన్నారితో సహా దంపతులు ఉరేసుకుని తనువు చాలించారు. అనంతపురం జిల్లా నార్పల మండలంలో గురువారం వెలుగు చూసిన ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు...నార్పల మండల కేంద్రంలోని పాత పోలీసు స్టేషన్ సంతబజారులో దంపతులు కృష్ణకిషోర్ (45), శిరీష (35) నివసిస్తున్నారు. వీరికి ఐదు నెలల కుమార్తె ఉన్నారు. నార్పల గూగూడు రోడ్డులో కృష్ణకిశోర్ మెడికల్ స్టోర్‌ను నిర్వహిస్తున్నారు. షాపు నిర్వహణ కోసం అప్పులు చేసినట్లు సమాచారం. షాపులో ఆదాయం లేకపోవడంతో అప్పులు తీరే దారిలేక గత నాలుగు రోజుల క్రితం భార్యభర్తలిద్దరూ తమ ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. గత నాలుగు రోజుల నుంచి కృష్ణకిశోర్ ఇంటి తలుపులు మూసి ఉండడం, ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు అనుమానంతో పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఇంటి తలుపులు బద్దలుకొట్టి చూడగా భార్యాభర్తలిద్దరూ ఉరికి వేలాడుతూ ఉన్నారు. ఐదు నెలల కుమార్తె ఉయ్యాలలో విగత జీవిగా పడి ఉన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే వీరు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్ తెలిపారు.

# పారిశుధ్య కార్మికుల విధుల బహిష్కరణ

- అనంతపురంలో నిరసన



విధులు నిర్వహించి నిరసన తెలుపుతున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు

**ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్**

తమ సమస్యల పరిష్కారం కోరుతూ అనంతపురం నగర పాలక సంస్థ పారిశుధ్య కార్మికులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. అనేకసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో గురువారం ఆరు సర్కిళ్ల పరిధిలో నిరసనబాట పట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, సిఐటియు ఒకటో పట్టణ కార్యదర్శి వెంకటనారాయణ మాట్లాడుతూ కార్మికులకు రావాల్సిన మూడు సంవత్సరాల సరెండర్ లీవు బకాయిలు, యూనిఫామ్, కొబ్బరి నూనె, చెప్పులు, పనిముట్లు అందజేయడంలో అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతోందన్నారు. చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పిస్తూ ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, అదనపు కార్మికులకు కనీస వేతనం రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కార్మికులకు 2011 సంవత్సరంలో బకాయి ఉన్న పిఎఫ్, ఇఎస్ఐ చెల్లించాలని కోరారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రెగ్యులర్ కార్మిక సంఘం అధ్యక్షులు ఎల్ ముత్తరాజు, ఎంఆర్‌పిఎస్ నాయకులు నల్లప్ప, వెంకటేశు, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రిస్వామి, తిరుమలేశు పాల్గొన్నారు.

# మినీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా మార్చాలి

- అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ
- విజయనగరం కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల ధర్నా



ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

**ప్రజాశక్తి-విజయనగరం టౌన్**

అంగన్‌వాడీ మినీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జిఒ ఇవ్వాలని, మినీ అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తల వేతనాలు పెంచాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. విజయనగరం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరావమ్మ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేద గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్‌వాడీ మినీ వర్కర్లు అనేక సేవలందిస్తున్నారని తెలిపారు. మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని జిఒ ఉన్నా సక్రమంగా అమలు కావడం లేదన్నారు. అత్యవసరమైన సమయాల్లో ఎటువంటి సెలవులూ ఇవ్వడం లేదని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారం కోసం 42 రోజులపాటు జరిగిన సమ్మె సందర్భంగా మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చుతామని ప్రభుత్వం అంగీకరించిందని, ఇందుకు సంబంధించిన జిఒను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేసవి సెలవులు ఇవ్వాలనీ, ఖాళీ పోస్టుల్లో ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. మినీ వర్కర్లకు మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని, గ్రేడ్ 2 సూపర్‌వైజర్ పోస్టులకు అవకాశం కల్పించాలని కోరారు. ధర్నా అనంతరం ఐసిడిఎస్ ఎపిడికి వినతి పత్రం అందజేశారు. ధర్నాలో యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పైడిరాజు, ఎస్.అనసూయ, గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి, డి.శ్యాలకుమారి, జ్యోతి, కామేశ్వరి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.




విద్యుత్ భవన్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సిపిఐ, సిపిఎం నాయకులు

# ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించొద్దు

**విద్యుత్ భవన్ ఎదుట సిపిఎం, సిపిఐ ధర్నా**

**ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి**

స్మార్ట్ మీటర్లు బిగించొద్దని, ట్రూ అప్ ఛార్జీల భారాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేస్తూ తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ కార్యాలయ విద్యుత్ భవన్ వద్ద సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి అరుణ్, సిపిఐ జిల్లా కార్యదర్శి టి మధు మాట్లాడారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపేయాలని డిమాండ్ చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముందుగా ప్రభుత్వ కార్యాలయాలకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించారని, ప్రస్తుతం చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థలతో సహా అందరికీ స్మార్ట్ మీటర్లు పెడుతున్నారన్నారు. విద్యుత్ వినియోగదారుల అనుమతిలేకుండా వీటిని బిగించేస్తున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉండగా టిడిపి, జనసేన పార్టీలు స్మార్ట్ మీటర్లను తీవ్రంగా వ్యతిరేకించాయని గుర్తు చేశారు. నాడు మీటర్లు పగులగొట్టాలని పిలుపునిచ్చిన వారే.. నేడు మీటర్లు బిగిస్తుండం దారుణమన్నారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలపై భారం పెరుగుతుందన్నారు. ముందుగానే డబ్బు చెల్లించి రీఛార్జ్ చేయించుకోవాలని అన్నారు.

బ్యాలెన్స్ పూర్తి కాగానే అర్ధాంతరంగా విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, పేదలకు అంధకారమే మిగులుతుందన్నారు. మీటరుకు అయ్యే వ్యయం రూ.13 వేలను 96 నెలల పాటు వాయిదాల పద్ధతిలో వినియోగదారుల నుండే వసూలు చేస్తారన్నారు. వ్యవసాయ ఉచిత విద్యుత్తుకు ఎసరపెట్టేందుకే పంపు సెంట్లకు మీటర్లు బిగిస్తున్నారన్నారు. ఇప్పటికే రూ.17 వేల కోట్ల రూపాయలు ట్రూ అప్ ఛార్జీల భారం వేస్తున్నారని, మరోవైపు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారన్నారు. వీటిని ప్రతిఘటించాలని కోరారు. ఈ ధర్నాలో సిపిఐ, సిపిఎ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కడపలో ఆర్‌జివి, పోసాని, శ్రీరెడ్డి, శ్యామలపై ఫిర్యాదు

**ప్రజాశక్తి-కడప అర్బన్**

సోషల్ మీడియాలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోం మంత్రి అనిత, విద్యాశాఖ మంత్రి లోకేష్‌పై అసభ్యకర పోస్టింగులు, పదజాలాలు వాడిన సినీ దర్శకుడు రాంగోపాల్‌వర్మ, నటుడు పోసాని కృష్ణమురళి, నటి శ్రీరెడ్డి, యాంకర్ శ్యామలపై కడప వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఐటిడిపి కడప నగర ఇన్‌ఛార్జ్ బొమ్మిచెట్టి చంద్రశేఖర్ గురువారం సిఐ రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిఎం, డిప్యూటీ సిఎం, హోం మంత్రి, విద్యాశాఖ మంత్రి ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టారన్నారు. వారిపై అసభ్యకర పదజాలం వాడారని తెలిపారు.

## రేణిగుంట విమానాశ్రయంలో శ్రీవాణి టికెట్ల పెంపు

**ప్రజాశక్తి -తిరుపతి సిటీ**

రేణిగుంట విమానాశ్రయంలో ప్రతిరోజూ జారీ చేస్తున్న శ్రీవాణి దర్శన టికెట్ల సంఖ్యను టిటిడి 100 నుండి 200కు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కౌంటర్‌లో యాత్రికులు టికెట్లను బుక్ చేసుకోవచ్చు. బోర్డింగ్ పాస్ ద్వారా తిరుపతి ఎయిర్‌పోర్ట్ కౌంటర్‌లో మాత్రమే ఈ ఆఫ్‌లైన్ టికెట్లు జారీ చేస్తారు. అలాగే, తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనం వెనుక వైపు ఉన్న శ్రీవాణి టికెట్ కౌంటర్‌లో ఆఫ్ లైన్‌లో జారీ చేస్తున్న టికెట్ల సంఖ్యను 900 నుండి 800కు తగ్గించింది. మొదట వచ్చిన వారికి మొదటి ప్రాతిపదికన ఈ టికెట్లను జారీ చేస్తారు. ఈ విధానం శుక్రవారం నుంచి అమలులోకి రానుంది. యాత్రికులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని టిటిడి అధికారులు కోరారు.

# సివిల్ సప్లయ్స్ హమాలీల కూలి రేట్లు పెంపు

- త్వరలోనే ఇతర డిమాండ్లపై మరో దఫా చర్చలు
- కె. ఉమామహేశ్వరరావు వెల్లడి

**ప్రజాశక్తి-అమరావతిబ్యూరో**

సివిల్‌సప్లయ్స్ హమాలీల కూలి రేట్లు క్వింటాకు రూ. 25 నుంచి 28 రూపాయలకు పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించినట్లు పౌరసరాల సంస్థ హమాలీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.ఉమామహేశ్వరరావు తెలిపారు ఇతర డిమాండ్ల పరిష్కారానికి త్వరలోనే మరో దఫా చర్చించడానికి కూడా ప్రభుత్వం అంగీకరించిందని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెళ్ల మనోహర్, ఆ శాఖ కమిషనర్ వీరపాండ్యన్, ఎండి డాక్టర్ మనజిర్ జిలానీలతో సిఐటియు, ఎఐటియుసి అనుబంధ పౌరసరఫరాల సంస్థ హమాలీ వర్కర్స్ రాష్ట్ర యూనియన్ల జాయింట్ యాక్షన్ కమిటీలతో చర్చలు జరిపారని తెలిపారు. కూలి రేట్లను రూ. 25 నుంచి 27 మాత్రమే పెంచుతామని ప్రభుత్వం తొలుత ప్రతిపాదించిందని, తెలంగాణా ప్రభుత్వం ఇటీవల క్వింటాకు కూలి రూ. 29కు పెంచిన విషయాన్నిమంత్రి, అధికారుల దృష్టికి సిఐటియు తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని, ఇప్పటికే క్వింటాకు రూ. 72.50 ఖర్చవుతోందని చెప్పారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే హమాలీ సంఘాలు క్వింటాకు రూ. 28 కి అంగీకరించాయని చెప్పారు. 1999 నుంచి ఇఎస్ఐ వాటా చెల్లించకపోవడంతో 26 ఏళ్లగా కార్మికులు నష్టపోతున్నారని, ఇఎస్ఐ అమలు చేస్తే 5 వేల కుటుంబాలకు న్యాయం జరుగుతుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. ప్రభుత్వం అంగీకరించిన కూలి రేట్లు రూ. 28 ఎరియర్స్‌తో సహా ఈ ఏడాది జనవరి నుంచి అమలు చేయాల్సి ఉందన్నారు. ఇతర డిమాండ్లపై అధికారుల సమక్షంలో త్వరలోనే చర్చలు జరపడానికి అంగీకారం కుదిరిందని వెల్లడించారు. సిఐటియు అనుబంధ సంఘం ఉమామహేశ్వరరావుతోపాటు ఎస్ ఉదయ్‌భాస్కర్, శేకర్, ఓ శివశంకర్, యోహాను, ఎఐటియుసి అనుబంధ సంఘం నుంచి ఎస్ వెంటకసుబ్బయ్య, చల్లా ఆంజనేయులు, అంజిబాబు చర్చల్లో పాల్గొన్నట్లు తెలిపారు.

# మంగోల్ రిఫైనరీకి మేఘా వెసెల్స్

**సొంత యూనిట్లలో పరికరాల తయారీ**



**ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో**

మంగోలియా దేశంలో నిర్మిస్తున్న మంగోల్ గ్రీన్ ఫీల్డ్ రిఫైనరీకి అవసరమైన కీలక పరికరాలైన వెస్సెల్స్ (ఫ్లషింగ్ ఆయిల్ డ్రమ్)ను మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) సొంత యూనిట్లలో తయారు చేసి ఎగుమతి ప్రారంభించింది. వెస్సెల్స్ రవాణాను మంగోల్ రిఫైనరీ సిఇఒ ఆల్ట దశదావా గురువారం హైదరాబాద్‌లోని ఎంఇఐఎల్ వెస్సెల్ తయారీ విభాగంలో జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్ (ఇఐఎల్) ప్రతినిధి వికల్ప్ పాలివాల్, ఎంఇఐఎల్ డైరెక్టర్ (హైడ్రోకార్బన్స్) పి దొరయ్య, ఎంఇఐఎల్ హైడ్రో కార్బన్స్ విభాగం ప్రెసిడెంట్ పి రాజేష్ రెడ్డి సహా పలువురు పాల్గొన్నారు. మంగోలియాలో గ్రీన్ ఫీల్డ్ ఆయిల్ రిఫైనరీని ఎంఇఐఎల్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. మంగోల్ రిఫైనరీ నిర్మాణం మంగోలియాలో రిఫైనరీల అభివద్ధిలో కీలక భూమికను పోషిస్తుందని దశదావా తెలిపారు. తమ దేశంలో ఇదే తొలి రిఫైనరీ అన్నారు. మంగోల్ రిఫైనరీలో ఉపయోగించే వెస్సెల్స్‌లో మొదటిది సరఫరా చేయటం సంతోషంగా ఉందని పి దొరయ్య పేర్కొన్నారు. మంగోలియాలోని వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటూ తమ సిబ్బంది కఠినతరమైన రిఫైనరీని సకాలంలో పూర్తి చేసేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నారని తెలిపారు.

## డామ్సన్ టెక్నాలజీస్ రూ.200 కోట్ల పెట్టుబడులు

**న్యూఢిల్లీ :** కంప్యూటర్, మొబైల్ ఉపకరణాల సంస్థ డామ్సన్ టెక్నాలజీస్ కొత్తగా రూ.200 కోట్ల పెట్టుబడులను ప్రకటించింది. తయారీ యూనిట్‌ను నెలకొల్పడానికి మూడు దశల్లో వ్యయాలు చేయనున్నట్లు వెల్లడించింది. అహ్మదాబాద్‌లో ఏర్పాటు చేయనున్న ఈ ప్లాంట్‌లో దేశంలోని ఇతర ప్రముఖ అనుబంధ బ్రాండ్‌ల కోసం ఉత్పత్తులను తయారు చేయనుంది. ఈ పెట్టుబడిలో భాగంగా ఫ్యాక్టరీ ఏర్పాటుకు రూ.110 కోట్లు, అధునాతన యంత్రాల కోసం రూ.60 కోట్లు, తయారీ ప్రక్రియకు మరో రూ.30 కోట్ల చొప్పున వ్యయం చేయనున్నట్లు డామ్సన్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ రితేష్ గోయెంకా తెలిపారు. తొలిదశలో ఆరు అసెంబ్లీ లైన్‌లతో ప్రారంభించి, ఫేజ్ 3లో ఈ సౌకర్యం 20 అసెంబ్లీ లైన్‌లకు విస్తరించనున్నామన్నారు.

# ఘనంగా ముగిసిన విశాఖ బాలోత్సవం



నృత్యాలతో ఆకట్టుకున్న విద్యార్థులు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)**

విశాఖలోని సెయింట్ ఆంథోనీ స్కూల్ వేదికగా మూడు రోజులుగా జరుగుతున్న విశాఖ బాలోత్సవం గురువారంతో ముగిసింది. చివరి రోజూ సాంస్కృతిక ప్రదర్శనలు, వివిధ రకాల పోటీలు ఆకట్టుకున్నాయి. ముగింపు వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన విశాఖ జిల్లా ఉప విద్యాశాఖ అధికారి సోమేశ్వరరావు మాట్లాడుతూ విశాఖ బాలోత్సవం నిర్వహణ తీరు ప్రశంసనీయమని కొనియాడారు. డిజిటల్ యుగంలో విద్యార్థులకు వివిధ రకాల సాంస్కృతిక పోటీలు, ఎకడమిక్ పోటీలను నిర్వహించడం అభినందించదగ్గ విషయమన్నారు. మూడు రోజులపాటు బాలలకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన వారికి ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ సినీ గేయ రచయిత బల్ల విజయకుమార్, రెవరెండ్ ఫాదర్ రత్నకుమార్, బాల వికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు, కన్సర్న్ ట్రస్ట్ చైర్మన్ పికె.జోష్, పౌర గ్రంథాలయ సేవా సమితి కార్యదర్శి బిఎల్.నారాయణ, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారికి, జడ్జిలుగా వ్యవహరించిన వారికి, వలంటీర్లకు ప్రత్యేక మెమొంటోలు అందజేశారు. విశాఖ బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జిఎస్.రాజేశ్వరరావు, అధ్యక్షులు పిల్లలమర్రి రఘు, ఉపాధ్యక్షులు డాక్టర్ కె.రమాప్రభ, దండు నాగేశ్వరరావు, ఎం.ఎల్లాజీ, సిహెచ్.సత్యనారాయణ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

**చివరి రోజు సాగిందిలా..**

విశాఖ బాలోత్సవం మూడో రోజు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. మట్టితో పక్షులు, పల్లె వాతావరణం బొమ్మల తయారీతో కార్యక్రమం ప్రారంభమైంది. జానపద నృత్యాలు ఉత్సాహాన్నిచ్చాయి. బృంద నృత్యాలు, క్లాసికల్ డ్యాన్స్‌లు, మైమ్, ముద్దులొలికే చిన్నారుల ఫ్యాన్సీ డ్రెస్ పోటీలతో ఉత్సవ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది.

సంపాదకీయం

# అకృత్యాలను ఆపాలి

ప్రేమ, పెళ్లి పేరిట నమ్మించి విశాఖలో ఒక న్యాయశాస్త్ర విద్యార్థినిపై సహ విద్యార్థి లైంగికదాడి చేయడం; ఆ దృశ్యాలను చిత్రీకరించి, బ్లాక్‌మెయిల్ చేస్తూ అతడి మిత్రులూ అఘాయిత్యానికి పాల్పడడం ఘోరమైన దుర్మార్గం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల కాలంలో వందకు పైగానే అత్యాచార ఘటనలు వెలుగు చూశాయి. తిరుపతిలో ఓ కామాంధుడు మద్యం మత్తులో పసిపాపపై హత్యాచారానికి ఒడిగట్టిన నీచం మొదలుకొని, హిందూపురంలో అత్తాకోడళ్లు ఇద్దరిపైనా సామూహిక అత్యాచారానికి పాల్పడ్డ అమానుషం దాకా మనుషులు నిర్ఘాంతపోయే పశు ప్రవృత్తి పెచ్చరిల్లుతూనే ఉంది. ప్రేమించలేదని అమ్మాయిలపై దాడులకు తెగించటం, ఉన్మాదంతో దాడులు చేయడం తరచూ వార్తలకెక్కుతున్నాయి. ఇలాంటి సందర్భాల్లో గంభీర ప్రకటనలు చేస్తున్న పాలకులు అంతటితో సరిపెట్టకుండా- నిందితులను పట్టుకోవడంలో, అకృత్యాలను అరికట్టడంలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాల్సి ఉంది.

అకృత్యాలు వార్తల్లోకొచ్చినప్పుడు అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ వాటిని తమ రాజకీయ ఆయుధాలుగా వాడుకోవడం రివాజుగా కనిపిస్తోంది. చట్టసభల్లోనూ, బయటా మహిళల రక్షణ గురించి మాట్లాడుతున్నప్పుడు తమ పార్టీ ఒక్కటీ గొప్ప విలువలు పాటిస్తున్నట్టు, ప్రత్యర్థి పార్టీ అనైతికాలు అన్నిటికీ కారణమన్నట్టూ సున్నితమైన అంశాలను రాటు చర్చగా మార్చేస్తున్నాయి. నిందితుల్లో తమ పార్టీ అనుయాయులు ఉన్నప్పుడు ఈ తీరు మరింత ఘోరంగా అఘోరిస్తోంది. గుజరాత్‌లో సామూహిక అత్యాచార నిందితులు జైలు నుంచి విడుదల అయినప్పుడు బిజెపి నేతలు వారికి పూలమాలలు వేసి, ఘనంగా స్వాగతించిన సన్నివేశం ఇలాంటి దురంతాలకు పరాకాష్ట. ఇటీవల మన రాష్ట్రంలోనూ నిందితులు తమ పార్టీకి చెందినవారైతే, వారిని రక్షించేందుకు, కేసును నీరుగార్చేందుకు ప్రయత్నాలు జరిగిన ఉదాహరణలు ఉన్నాయి. ఆడపిల్ల మీద అమానుషం జరిగితే- పార్టీ, ప్రాంతం, కులం, మతం వంటి వాటితో సంబంధం లేకుండా తప్పును తప్పుగా ఖండించాలి. చట్టపరంగా నిందితులకు శిక్ష, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి. పాలకపక్షం బాధితుల పక్షాన నిలబడి, చట్టబద్ధంగా అన్ని చర్యలూ తీసుకోవాలి. 11 ఏళ్ల క్రితం వర్మ కమిషన్ చేసిన సిఫార్సులూ, నిర్భయ చట్టం, ఇతర చట్టాలను కచ్చితంగా అమలు చేయాలి. కామాంధుల దాడికి పసిపిల్లలు, మానసిక శారీరక వికలాంగులు, ఒంటరి మహిళలూ లక్ష్యంగా ఉంటారన్న సంగతిని నేర గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ అకృత్యాల వెనుక సామాజికంగా నెలకొని ఉన్న వివక్ష, ఆధిపత్య భావజాలం కూడా స్పష్టంగానే కనిపిస్తోంది. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకొని మహిళలకు భద్రత ఇవ్వడంలో, దోషులను శిక్షించటంలో ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించాలి.

ఆడవారిని సరుకుగా చూపే మార్కెట్టు, మగవారి ఆస్తిగా చూసే మతమూ మహిళల పట్ల తక్కువచూపును సృష్టిస్తున్నాయి. పురుషాధిపత్య భావజాలం, ఆధిపత్య ధోరణి కారణంగా ఆడవారిని కించపరిచే అభ్యంతకర భాష నిర్లజ్జగా సాగుతోంది. ప్రత్యర్థులను నిందించటానికి ఇటీవల రాజకీయ నాయకులు ఈ తరహా నీచభాషను నాలుకల మీద నాట్యం చేయిస్తున్నారు. సామాజిక మాధ్యమాల నిండా ఈ చెత్త రకరకాలుగా ప్రవహిస్తోంది. వివిధ వెబ్‌సైట్లు, సినిమాలు, వెబ్ సిరీస్ అశ్లీలతను వేగంగా ప్రాచుర్యం తెచ్చే సరుకుగా వాడుకుంటున్నాయి. ఏ విధంగానైనా ప్రచారం పొందాలి, పాపులర్ కావాలీ అన్న వికార జాఢ్యం అన్నిచోట్లా విస్తరిస్తోంది. చిన్న స్కూళ్లు మొదలు పెద్ద విద్యాసంస్థల వరకూ సాంస్కృతిక కార్యక్రమాల్లో అశ్లీల కాలుష్యం విరుచుకుపడుతోంది. నియంత్రణ లేని ఈ బాధ్యతారాహిత్యమంతా ఆడబిడ్డలపై కోరలు చాచే విషనాగులా పరిణమిస్తోంది.

మహిళలపై నేరాల నివారణకు, నియంత్రణకు ప్రభుత్వాలు తక్షణ, దీర్ఘకాలిక కార్యాచరణతో ముందుకు సాగాలి. నేరం జరిగిన వెంటనే బాధితులకు భరోసా ఇచ్చి, నిందితులను కఠినంగా శిక్షించే తక్షణ చర్యను నిక్కచ్చిగా పాటించాలి. మహిళల పట్ల తక్కువచూపును పెంచుతున్న మార్కెట్టుపరమైన, మతపరమైన, సామాజికపరమైన భావజాలాల కుత్తుకలను కత్తిరించే ప్రచార కార్యక్రమాలను చేపట్టాలి. ఈ తరహా ద్విముఖ వ్యూహం చేపడితేనే మహిళలకు రక్షణ, సమాజ అభ్యున్నతీ సాధ్యమవుతాయి.

మహనీయుల మాట



ఎంత గొప్ప స్థానానికి చేరినా సరే విద్యార్థిగానే ఉండు. అది నిన్ను మరింత ఉన్నత స్థానానికి తీసుకెళుతుంది.
- డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్

Radhakrishnan

# అధిక సంతానం పరిష్కారమా?

విశ్లేషణ



వి. రాంభూపాల్

**తాము బలహీనంగా వున్న దక్షిణాది రాష్ట్రాల్లో పార్లమెంట్ స్థానాలను తగ్గించి, తమకు అనుకూలంగా వున్న ఉత్తరాది రాష్ట్రాల స్థానాలతో అధికారాన్ని సుస్థిరం చేసుకునేందుకు బిజెపి ప్రయత్నిస్తున్నది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని, సమాఖ్య వ్యవస్థను తుంగలో తొక్కేందుకు జమిలి ఎన్నికలను తెస్తున్నది. తమ మతతత్వ ఎజెండాను, కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలను మరింతగా అమలు చేసుకునేందుకు 2025 జనాభా లెక్కలను అవకాశంగా తీసుకుంటున్నది.**



మరింత మంది పిల్లలను కనమని దంపతులకు మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాజాగా మరోసారి పిలుపునిచ్చారు. గత ఆరు సంవత్సరాల క్రితం ఆయన ఇదే మాట మాట్లాడారు. అప్పుడు మాట్లాడింది 15వ ఆర్థిక సంఘం కేంద్ర నిధుల కేటాయింపుకు, జనాభాకు ముడిపెట్టినప్పుడు. ఇప్పుడు మాట్లాడుతుంది 2026లో జనాభా ఆధారంగా కేంద్ర నిధుల కేటాయింపుతో పాటు పార్లమెంట్ నియోజక వర్గాల పునర్విభజన గురించి కేంద్రం నిర్ణయిస్తున్నప్పుడు. చిన్న కుటుంబం చింతల్లేని కుటుంబమనేది పాత సామెత, పెద్ద కుటుంబం సంతోష కరమైన కుటుంబమనేది నేటి సామెత అని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ వ్యంగ్యంగా చెబుతూనే సంతానాన్ని పెంచమని తమిళ ప్రజలను కోరారు. జనాభా నియంత్రణలో అద్భుత విజయాలను సాధించిన దక్షిణాది రాష్ట్రాలకు జరిమానా విధిస్తారా అంటూ చాలామంది మేధావులు, ఆర్థికవేత్తలు ప్రశ్నిస్తున్నారు. కేంద్రం అలా చేస్తే జనాభా పెరగడం తప్ప మాకు వేరే దారి లేదని మరి కొందరు వాదిస్తున్నారు. ఈ వాదనల్లో రెండు అంశాలు ఉన్నాయని రిజర్వు బ్యాంకు మాజీ చైర్మన్ దువ్వూరి సుబ్బారావు విశ్లేషించారు. ఒకటి ఆర్థిక అంశాలు, రెండు రాజకీయాలు.

రాజ్యాంగం ప్రకారం మన దేశం రాష్ట్రాల సమాఖ్య (ఫెడరల్) విధానం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయాల్సిన బాధ్యతలను కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాల్లో రాజ్యాంగం నిర్దేశించింది. ఈ బాధ్యతలను అమలు చేయడానికి నిధుల పంపిణీ గురించి కూడా అందులో పేర్కొన్నారు. కాంగ్రెసు రాజకీయ ఆధిపత్య కోణం నుండే రాష్ట్రాలను తమ ఆధీనంలో వుంచుకోవాలని చూస్తే, బిజెపి మాత్రం తన మాతృ సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతం ఆధారంగా, కార్పొరేట్ శక్తుల ఆర్థిక ప్రయోజనాల కోసం రాష్ట్రాలను బలహీనం చేస్తున్నది. వాజ్‌పేయి పాలనా కాలంలో అధ్యక్ష తరహా విధానాన్ని అమలు చేసేందుకు రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నించి భంగపడ్డారు. ఇదే విధానాన్ని మోడీ కొత్త రూపాల్లో అమలు చేస్తున్నారు. ఒకే పన్ను, ఒకే భాష, ఒకే మతం, ఒకే విధానం, ఒకే ఎన్నిక ఇలా ఒకేలన్నీ ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాలోని కేంద్రీకృత పాలనకు 'ఒకే' చెప్పడంలో భాగమే. ప్రణాళికా సంఘాన్ని రద్దు చేయడం, నీతి ఆయోగ్ పేరుతో కేంద్ర దయాదాక్షిణ్యాల మీద రాష్ట్రాలు ఆధారపడేటట్లు చేయడం, ప్రపంచ బ్యాంకు ద్వారా రాష్ట్రాలకు అప్పులు ఇప్పిస్తూ తమ గుప్పిట్లో పెట్టుకోవడం జరుగుతుంది. తాజాగా జనాభా లెక్కల ఆధారంగా కేంద్ర నిధుల పంపిణీ, పార్లమెంట్ స్థానాల పునర్విభజన ఎజెండాను తెర పైకి తెచ్చారు. ఇందు కోసం 2025లో జనాభా లెక్కలు సేకరిస్తారు. ఆ జనాభా ఆధారంగా 2026 నుండి కేంద్ర నిధులు, పార్లమెంట్ సీట్లు నిర్ణయిస్తారు. దీనివల్ల జనాభా తక్కువగా వున్న దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి.

ప్రస్తుత దేశ జనాభాలో సగం మంది 25 సంవత్సరాల వారే. దేశ జనాభా మధ్యస్త వయస్సు 28.4 సంవత్సరాలు. ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా వున్న దేశం మనది. అయితే ఈ పరిస్థితి దేశమంతా ఒకే విధంగా లేదు. జనాభా నియంత్రణ కోసం 1952లో ఏర్పడిన కుటుంబ నియంత్రణ జాతీయ కార్యక్రమాన్ని దక్షిణాది రాష్ట్రాలతో పాటు, మరికొన్ని ఈశాన్య రాష్ట్రాలు సమర్ధవంతంగా అమలు చేయడంతో ఆయా రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల తగ్గింది. జనాభా ఆధారంగా కేంద్ర నిధులు అంటే ఈ రాష్ట్రాలు నష్టపోతాయి. అందుకే 1971 జనాభా లెక్కల ఆధారంగా ఈ రాష్ట్రాలకు 25 శాతం వెయిటేజీ (అదనపు సౌకర్యం) ఇవ్వాలని 1976లో కేంద్రం నిర్ణయించింది. 13వ ఆర్థిక సంఘం వరకూ ఇదే విధానం కొనసాగింది. 2013లో రిజర్వుబ్యాంకు మాజీ చైర్మన్ ప్రొఫెసర్ వై.వి.రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పడిన 14 ఆర్థిక సంఘం ఈ 25 శాతం వెయిటేజీని 17.5 శాతానికి తగ్గించి, 2011 జనాభా లెక్కలకు 10 శాతం వెయిటేజీ ఇచ్చింది. ఈ విధానం దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక స్థితిని దిగజార్చింది. ముఖ్యంగా తమిళనాడు, కేరళ రాష్ట్రాలు 13వ ఆర్థిక సంఘం కేటాయించిన నిధుల కంటే 14వ ఆర్థిక సంఘం ఇచ్చిన నిధుల్లో సంవత్సరానికి సుమారు 6 నుండి 8 వేల కోట్లు నష్టపోయాయి. 1971 నుండి 2011 మధ్య ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్ రాష్ట్రాల్లో జనాభా రెట్టింపు కాగా, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో గణనీయంగా తగ్గింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జనాభా పెరుగుదల మందగించింది. 'జనాభా పేరుతో రాష్ట్రాలకు శిక్ష వేస్తారా?' అని 2018 ఏప్రిల్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఢిల్లీలో విలేకరుల సమావేశం పెట్టి మోడీని ప్రశ్నించారు. ఇదే నెలలోనే తెలంగాణ అప్పటి ముఖ్యమంత్రి చంద్రశేఖర్ -కేంద్రానికి మనం ఇస్తున్న పన్నుల్లో సగం కూడా తిరిగి కేంద్రం మనకు ఇవ్వడంలేదని, ఉత్తరాది రాష్ట్రాల కోసం మనం కష్టపడాల్సి వస్తుందని-ఘాటుగా మాట్లాడారు. కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు కూడా 14వ ఆర్థిక సంఘం నిర్ణయంపై తీవ్రంగా నిరసన వ్యక్తం చేసాయి. 2005-10 మధ్య కేంద్రం రాష్ట్రాలకు ఇస్తున్న గ్రాంట్స్ లెక్కల ప్రకారం ఉత్తరప్రదేశ్‌కు రూ.1,33,471.45 కోట్లు, బీహార్‌కు రూ.75,648.83 కోట్లు ఇవ్వగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రూ.50,353.26 కోట్లు, కేరళకు రూ.19,607.72 కోట్లు మాత్రమే కేటాయించారు. దేశ జనాభాలో 16.30 శాతం వున్న ఉత్తరప్రదేశ్ దేశ స్థూల జాతీయ ఉత్పత్తి (జిడిపి)లో కేవలం 8.4 శాతం వాటాను మాత్రమే కలిగి ఉంది. జనాభాలో కేవలం 2.76 శాతం వున్న కేరళ దేశ స్థూల జాతీయ ఉత్పత్తిలో 3.8 శాతం వుంది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడు రాష్ట్రాలు దేశ స్థూల జాతీయ ఉత్పత్తిలో 2023-24లో 30 శాతానికి పైగా వాటా కలిగి వున్నాయి. ఇప్పటి వరకు జనాభాకు అదనంగా అనుసరిస్తున్న వెయిటేజీ విధానంలోనే దక్షిణాది రాష్ట్రాలతో పాటు, మరికొన్ని చిన్న రాష్ట్రాలు నష్టపోతుంటే 2026 తర్వాత జనాభా లెక్కల ఆధారంగానే నిధులు కేటాయిస్తే మా పరిస్థితి ఏమిటనేది ఈ రాష్ట్రాల ఆందోళన.

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న జనాభా ఆధారిత నిధుల కేటాయింపు, పార్లమెంట్ స్థానాల పునర్విభజన అనేది ప్రపంచీకరణ, మతతత్వ విధానాల అమలులో భాగమే. 1991 నుండి దేశంలో అమలులోకి వచ్చిన ప్రపంచీకరణ విధానాలు అన్ని రాష్ట్రాలను అప్పుల్లో ముంచాయి. రోజువారీ అవసరాలకు కూడా కేంద్రం దగ్గర లేదా ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ బ్యాంకుల దగ్గర దేబిరించాల్సిన పరిస్థితి వచ్చింది. అలాంటి పరిస్థితులు ఎంత బలంగా వుంటే అంతగా ఈ ఆర్థిక సంస్థల షరతులకు రాష్ట్ర ప్రభుత్వాలు లొంగిపోతాయి. కాబట్టే కేంద్రం నుండి గ్రామ పంచాయితీ వరకు ప్రపంచ బ్యాంకు విధానాలు, షరతులు వేగంగా అమలవుతున్నాయి. చట్టబద్ధంగా రావలసిన నిధులను కూడా కేంద్రం ఇవ్వకుండా ప్రపంచ బ్యాంకుతో అప్పు ఇప్పిస్తామంటే అదే మహాప్రసాదం అన్నట్లుగా కొందరు ముఖ్యమంత్రులు చేతులు చాచి కళ్ళకు అద్దుకుంటున్నారు. ఇటీవల మన రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు ద్వారా ఇప్పించే రూ.15 వేల కోట్లను పార్లమెంట్‌లో దేశ ఆర్థికమంత్రి ఎంత ఘనంగా చెప్పారో, రాష్ట్ర ప్రభుత్వం ఎంత తన్మయత్వంతో స్వాగతించిందో చూశాం. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు, రోజువారీ ఖర్చులకు కూడా కేంద్రం మీద రాష్ట్రాలు ఆధారపడేటట్లు చేయడం ద్వారానే దేశమంతా ఒకే విద్యుత్, విద్య, వైద్యం, రవాణా, గనుల విధానం అమలు చేయించి స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీలకు ఈ రంగాలను సులభంగా హస్తగతం చేస్తున్నారు.

2025 జనాభా లెక్కల ఆధారంగా పార్లమెంట్ స్థానాలను పునర్విభజన చేసి 2026లో జమిలి ఎన్నికలకు పోవాలని కేంద్ర బిజెపి నిర్ణయించుకుంది. తాము బలహీనంగా వున్న దక్షిణాది రాష్ట్రాల్లో పార్లమెంట్ స్థానాలను తగ్గించి, తమకు అనుకూలంగా వున్న ఉత్తరాది రాష్ట్రాల స్థానాలతో అధికారాన్ని సుస్థిరం చేసుకునేందుకు బిజెపి ప్రయత్నిస్తున్నది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని, సమాఖ్య వ్యవస్థను తుంగలో తొక్కేందుకు జమిలి ఎన్నికలను తెస్తున్నది. తమ మతతత్వ ఎజెండాను, కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలను మరింతగా అమలు చేసుకునేందుకు 2025 జనాభా లెక్కలను అవకాశంగా తీసుకుంటున్నది. రోగం ఒకటైతే, మందు మరొకటి ఇచ్చిన చందంగా కార్పొరేట్, మతోన్మాద జమిలి ప్రయోజనాల కోసం చేస్తున్న బిజెపి కుట్రలను చెప్పకుండా అధిక సంతానాన్ని పెంచమని ప్రజలకు రాష్ట్ర ముఖ్యమంత్రి పిలుపునిస్తున్నారు. బిజెపి అనుసరించే విధానాలను ప్రతిఘటించకుండా రాష్ట్రానికి రావలసిన నిధులు సాధించలేరు, ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోలేరు. ఈ విషయాన్ని గుర్తించకపోగా ఆ పార్టీతో టిడిపి, జనసేన ప్రత్యక్షంగా, వైసిపి పరోక్షంగా చెలిమి చేస్తూ దేశానికి, రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్నాయి. మన రాష్ట్రంలో ఎన్నడూ లేనంతగా మతోన్మాద భావ వ్యాప్తి చెందడానికి ఆర్‌ఎస్‌ఎస్‌కు ఒక ఆయుధంగా పవన్ కళ్యాణ్ తోడ్పడుతున్నారు. రాష్ట్రాలను బలహీనం చేసే బిజెపి కుట్రలను చైతన్యవంతులైన ఆంధ్ర ప్రజలు ఐక్యంగా ప్రతిఘటించేందుకు సిద్ధం కావాలి.

**రోగం ఒకటైతే, మందు మరొకటి ఇచ్చిన చందంగా కార్పొరేట్, మతోన్మాద జమిలి ప్రయోజనాల కోసం చేస్తున్న బిజెపి కుట్రలను చెప్పకుండా అధిక సంతానాన్ని పెంచమని ప్రజలకు రాష్ట్ర ముఖ్యమంత్రి పిలుపునిస్తున్నారు. బిజెపి అనుసరించే విధానాలను ప్రతిఘటించకుండా రాష్ట్రానికి రావలసిన నిధులు సాధించలేరు, ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోలేరు. ఈ విషయాన్ని గుర్తించకపోగా ఆ పార్టీతో టిడిపి, జనసేన ప్రత్యక్షంగా, వైసిపి పరోక్షంగా చెలిమి చేస్తూ దేశానికి, రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్నాయి.**

/వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు/

# నిరసనలపై 'స్వాట్' యుద్ధం

సమస్య



జి.కోటేశ్వరరావు



**పౌర హక్కులు, కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తున్న అప్రజాస్వామిక పాలకవర్గ నిర్ణయాలపై పోరాడే గొంతులను నొక్కేందుకు దేశంలో యుఎపిఎ తీసుకొచ్చినట్లు, చంద్రబాబు నాయుడు ప్రభుత్వం స్వాట్ టీమ్‌కు రాష్ట్రంలో ఊపిరి పోసింది. వైసిపి ప్రభుత్వ నిర్ణయాలను తూర్పారబడుతున్న కూటమి ప్రభుత్వం దానికి భిన్నమైన ప్రజాస్వామిక పద్ధతులను పటిష్టం చేసేలా ప్రవర్తించడంలేదు. కార్పొరేట్ శక్తులకు ఆర్థిక ప్రయోజనం కల్గించడానికి పరిపాలన సాగిస్తోంది.**

బాధితులు, వారి మద్దతుదార్లు తమకు పరిహారాన్నివ్వమని అడగడం, సమస్యలపై మాట్లాడ్డం, అభిప్రాయాలను పంచుకోవడం, తప్పుని ప్రశ్నించడం నేరంగా భావిస్తున్న సమాజంలో మనమిప్పుడు బతుకుతున్నాం. మోడీ ప్రభుత్వం ప్రయోగిస్తున్న చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యుఎపిఎ) అయినా, వైసిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన, తాజాగా టిడిపి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఊపిరి పోసి అమలుకు సిద్ధపడుతున్న స్పెషల్ వెపన్స్ అండ్ టాక్టిక్స్ (స్వాట్) టీమ్ అయినా ప్రజాస్వామిక హక్కులను అణచివేయడానికి ఉపయోగిస్తున్నవన్నీ ముమ్మాటికీ నిరంకుశమైనవి. అప్రజాస్వామికమైనవి. సంపన్నులు, పారిశ్రామికాధిపతుల మెప్పు కోసం సాధారణ ప్రజలు, కార్మికుల హక్కులను అణచివేసే విపరీత వైఖరి కూటమి ప్రభుత్వం తీసుకుంది. కార్మికుల ఆందోళనలను, నిరసనలను అణచివేయడానికి స్వాట్ టీమ్‌తో పోలీసు బలగాలను మోహరించి భయభ్రాంతులు సృష్టించడానికి ప్రభుత్వం సిద్ధమైంది.

పౌర హక్కులు, కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తున్న అప్రజాస్వామిక పాలకవర్గ నిర్ణయాలపై పోరాడే గొంతులను నొక్కేందుకు దేశంలో యుఎపిఎ తీసుకొచ్చినట్లు, చంద్రబాబు నాయుడు ప్రభుత్వం స్వాట్ టీమ్‌కు రాష్ట్రంలో ఊపిరి పోసింది. వైసిపి ప్రభుత్వ నిర్ణయాలను తూర్పారబడుతున్న కూటమి ప్రభుత్వం దానికి భిన్నమైన ప్రజాస్వామిక పద్ధతులను పటిష్టం చేసేలా ప్రవర్తించడంలేదు. కార్పొరేట్ శక్తులకు ఆర్థిక ప్రయోజనం కల్గించడానికి పరిపాలన సాగిస్తోంది.

అనకాపల్లి జిల్లాలో కొద్ది రోజుల క్రితం స్వాట్ టీమ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయించింది. హోం మంత్రి అనిత సొంత జిల్లాలో ఈ తరహా టీమ్ ఏర్పాటు కావడం కాకతాళీయం కాదు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఏర్పాటు చేసింది. అనకాపల్లి జిల్లాలో ప్రధానంగా తీర ప్రాంతంలో మత్స్యకారులు, రైతులు, ఇతర ప్రజానీకం నుంచి రానున్న ప్రతిఘటనను ఎక్కడికక్కడ అణచివేసేందుకు, ముందుగా భయభ్రాంతులకు గురిచేసి తమ సమస్యలపై మాట్లాడుకోవడానికి, ఒకచోట కూర్చొని చర్చించుకోవడానికి వీల్లేని వాతావరణం సృష్టించడానికి స్వాట్ ఏర్పాటు చేసింది. కార్మికుల రక్షణ, భద్రతను యాజమాన్యాలు పట్టించుకోకపోవడం, పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలలో మృతి చెందడం, గాయపడ్డం, పర్యావరణ ప్రమాణాలు పాటించకపోవంతో పరిసర ప్రాంత ప్రజలు వివిధ రకాల సమస్యలు, వ్యాధులతో బాధ పడుతున్నారు. వీటికి తోడు తీరంలో కాలుష్య విషతుల్యమైన బల్క్ డ్రగ్ పార్కు సహా కాలుష్య కారక పరిశ్రమల ఏర్పాటుకు అనేక రాయితీలు, అవకాశాలు పారిశ్రామికాధిపతులకు కల్పించ బూనుకుంది. ఇప్పటికే పరిశ్రమల్లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు, విద్యార్హత కల్గిన యువతకు స్థానిక పరిశ్రమల్లో ఉపాధి కల్పించడంలేదు. ఇవి స్థానికులకు ఆగ్రహాన్ని కల్గిస్తున్నాయి. ప్రభుత్వాలపై అసంతృప్తిని రగిలిస్తున్నాయి. భూమి లేక, ఉపాధి చూపకపోవడంతో బతుకు తెరువు పోయిన బాధిత కుటుంబాలు నిత్యమూ సంఘర్షణకు లోనవుతున్నారు. వీరు వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నారు. ఆందోళనకు దిగుతున్నారు.

భూములు తీసుకొని ఉపాధి చూపకుండా ఇంతవరకు నిర్వాసితులు, మత్స్యకారుల పొట్ట కొట్టిన ప్రభుత్వం, ఇప్పుడు ప్రభుత్వ తప్పిదాలు బాహ్య ప్రపంచానికి తెలీకుండా నిరసనలు, ఆందోళనలు నిర్దాక్షిణ్యంగా అణచివేసేందుకు అనకాపల్లి జిల్లాను ఎంచుకుంది. ముఖ్యమంత్రి, మంత్రులు పర్యటనకు వచ్చినప్పుడు ప్రజలు, కార్మికుల తరపున సమస్యలు చెప్పుకొనే వీల్లేకుండా సిఐటియు, సిపిఎం, ఇతర ప్రజా సంఘాల నాయకులను బయటకు రానివ్వడంలేదు. కొద్ది రోజుల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబు పరవాడ వచ్చినప్పుడు, అభిజిత్ ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీ అక్రమ లేఆఫ్ ఎత్తివేసి ఉపాధి కల్పించాలని వినతిపత్రం ఇవ్వడానికి బయల్దేరిన కార్మికులు, సిఐటియు నాయకత్వాన్ని అచ్యుతాపురం పొలిమేర దాటనివ్వలేదు.

సెజ్‌లో కార్మిక సంఘాలు ఏర్పాటు చేసుకొనే హక్కు ప్రభుత్వం లేకుండా చేసింది. కనీసం వారి సమస్యలపై మాట్లాడే హక్కు, పరిష్కరించుకొనే సమాలోచన చేయకుండా ప్రజాస్వామిక హక్కులపై ప్రభుత్వం దాడిచేస్తోంది. ప్రతి ఒక్కరికీ భావ ప్రకటనా స్వేచ్ఛ, ఇతరుల జోక్యం లేకుండా సొంత అభిప్రాయాలు చెప్పే హక్కు వుందని రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 చెబుతోంది. ప్రతి ఒక్కరికీ పని చేయడానికి, సమాన పనికి సమాన వేతనం, తన ప్రయోజనాలను కాపాడుకోవడానికి కార్మిక సంఘాలు ఏర్పాటు చేసుకొని, చేరే హక్కు ఆర్టికల్ 23 (1) కల్పించింది.

రాజ్యాంగం పౌర హక్కులపై భరోసా ఇచ్చినప్పటికీ, కార్పొరేట్ సంస్థలు, పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసం ఆ హక్కులకు భంగం కల్గించేలా ప్రభుత్వాలు కఠినమైన నిర్ణయాలు తీసుకుంటున్నాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలుచేసిన చంద్రబాబు నాయుడు, ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో పారిశ్రామిక ప్రగతి సాధిస్తామని చెబుతున్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ విధానం కొద్దిమంది పారిశ్రామికాధిపతులు లాభపడ్డానికి ఉపయోగపడింది తప్ప పారిశ్రామిక వృద్ధికి దోహదపడలేదు. ఉపాధి కల్పన, వేతనాల మెరుగుదలలో దిగజారుడుతనమే గానీ పురోగతి లేదు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరిట కార్మిక సంఘాలు పెట్టుకునే హక్కు లేకుండా చేయజూస్తున్నారు. ఫ్యాక్టరీల్లో ప్రమాదాల వల్ల కార్మికులు చనిపోయినా, అంగవైకల్యం పొందినా, వారికి పరిహారం ఇవ్వాలని ఆందోళనలు, నిరసనలు చేసే వారిని భయపెట్టి, చెదరగొట్టేందుకు స్వాట్ టీమ్ ఏర్పాటు చేశారు. పరిశ్రమల్లో స్వతంత్రంగా వెళ్లి తనిఖీలు నిర్వహించే అధికారం, వేతనాల అమలు పర్యవేక్షణాధికారం...పరిశ్రమల తనిఖీ అధికారులు, కార్మిక శాఖాధికారులకు ప్రభుత్వం లేకుండా చేసింది. కార్మికులు తమ సమస్యలపై ఆందోళన చేసిన సందర్భాల్లో కార్మిక శాఖాధికారులు జోక్యం చేసుకోవాలి తప్ప, శాంతి భద్రతలు కాపాడే పేరుతో పోలీసులు బలప్రయోగంతో ఉద్యమాలను అణచివేయడం పారిశ్రామికాభివృద్ధికి దోహదపడదు. పరవాడ ఫార్మా, అచ్యుతాపురం సెజ్, ఇతర ఔషధ, రసాయన పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవిస్తూనే వున్నాయి. ఎసెన్షియా ప్రమాదంలో 17 మంది చనిపోయి, 38 మంది గాయపడినా, సినర్జీస్ ఫార్మా ప్రమాదంలో నలుగురు చనిపోయినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదు. కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వడం లేదు. పని ప్రదేశంలో భద్రత లేదు. ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యూటీ అమలు చేయడం లేదు. ఇవి అమలు చేయని యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు లేవు. తమ హక్కులను అమలు చేయాలని కోరిన కార్మికులు, కార్మిక సంఘాల నాయకులపై నిర్బంధం ప్రయోగించడం, అక్రమ కేసులు పెట్టడం కొనసాగుతోంది.

ప్రభుత్వ విధానాలతో పెరుగుతున్న భారాలు, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై మాట్లాడి, పోరాడి, నిరసన తెలిపే హక్కు లేకుండా స్వాట్ టీమ్‌ను రాష్ట్ర ప్రభుత్వం ముందుకు తెచ్చింది. ఎక్కడైనా ఎవరు నిరసన తెలిపినా స్వాట్ టీమ్ రెప్ప పాటులో వాలిపోయి చెల్లాచెదురు చేయనుంది. నిర్బంధ పద్ధతులను ప్రభుత్వం విడనాడి, కార్మికుల సంక్షేమం, శ్రేయస్సును యాజమాన్యంతో అమలు చేయించి, తగిన వాతావరణాన్ని నెలకొల్పే పారిశ్రామిక, కార్మిక విధానాలను అమలు చేయాలి. ఆ విధానాల రూపకల్పనలో కార్మిక సంఘాల ప్రతినిధులను భాగస్వాములు చేయాలి. పరిశ్రమల ప్రోత్సాహం పేరుతో పరిశ్రమాధిపతుల ప్రయోజనాల కోసం ఏకపక్ష, అప్రజాస్వామిక విధానాలను అమలు చేయడానికి ప్రభుత్వం అడుగులు వేస్తే కార్మిక వర్గం, పౌర సమాజం ప్రతిఘటించకుండా వుండలేదు.

/ వ్యాసకర్త అనకాపల్లి జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి,
సెల్ : 949030010 /

సందర్భం

## జీవ పరిణామం నిరంతర ప్రక్రియ

మన ప్రాచీనులు నమ్మినట్లు జీవ ఆవిర్భావం అనేది ఏ ఒక్క రోజో జరగలేదు. ప్రముఖ శాస్త్రవేత్త ఛార్లెస్ డార్విన్ ప్రతిపాదించిన జీవ పరిణామ సిద్ధాంతం భూమి మీది జీవుల పరిణామ క్రమాన్ని తెలియజేస్తుంది. ఆధునిక జీవ శాస్త్రంలో డార్వినిజం చాలా మార్పు తెచ్చింది. మూఢ నమ్మకాలను విభేదించడంలో కూడా డార్వినిజం కీలక పాత్ర పోషించింది. మనిషి ఒక రకమైన కోతి జాతి నుంచి పరిణామం చెందుతూ వచ్చాడని ఈ సిద్ధాంతం చెబుతోంది. డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం మార్క్సిస్ట్ చారిత్రక భౌతికవాద రచనలకు కూడా ఊపిరి పోసింది. ప్రస్తుతం ప్రపంచంలో కనబడుతున్న రకరకాల ప్రాణులు మొదటి నుంచీ లేవనేది ఈ సిద్ధాంతం ప్రధానమైన వాదన. కుక్కలూ, నక్కలూ, తోడేళ్ళూ ఒక జాతివి. పిల్లులూ, చిరతపులులూ, పెద్ద పులులూ, సింహాలూ మరొక జాతికి చెందినవి. గుర్రాలూ, గాడిదలూ, జీబ్రాలూ ఒకలాంటివి. గతంలో వీటికి తలొక "పూర్వీకుడూ" ఉండి ఉండాలి. ఇంకా వెనక్కెళితే ఈ 'ఆదిమ' శునకానికీ, మార్జాలానికీ, అశ్వానికీ జన్మనిచ్చిన మరేదో మృగం ఉండి ఉంటుంది. ఇంకా ప్రాచీన యుగంలో ఈ క్షీరదాలకీ, తక్కిన చేపలూ, తాబేళ్ళూ, జలచరాలూ, పక్షులూ అన్నిటి ఆవిర్భావానికీ దారితీసిన ప్రాణి ఏదో ఉండే ఉంటుంది. వీటిలో కొన్ని శాకాహారులుగానూ, మరికొన్ని మాంసాహారులుగానూ రూపొందడానికి భౌతిక ప్రేరణలూ, పర్యావరణ పరిస్థితులే కారణాలయి ఉంటాయనే ఉద్దేశంతో డార్విన్ చాలా పరిశోధనలు చేశారు. జీవజాతుల మధ్య సంఘర్షణ ఉంటుంది. సజాతి సంఘర్షణ, విజాతి సంఘర్షణ, ప్రకృతిలో సంఘర్షణ. ఈ సంఘర్షణలో నెగ్గినవే ప్రకృతి ఎన్నిక చేసిన సార్థక జీవులు. ఇవే మనుగడను సాగిస్తాయి. ఈ జీవులలోని వైవిధ్యాలే తరాలు మారుతూ పోగా కొత్త జాతుల ఉత్పన్నానికి మూలాధారాలు అవుతాయి. ఇది సంక్షిప్తంగా డార్విన్ పరిణామ వాదం. దీనినే మనుగడ కోసం పోరాటం అంటారు. ఇటువంటి విషయాలను క్రోడీకరించి డార్విన్ 'జీవ జాతుల ఉత్పత్తి' అనే పుస్తకాన్ని రాసి 1859 నవంబర్ 24న తొలిసారి ప్రచురించారు.

- యం. రాం ప్రదీప్,
సెల్ : 9492712836

/ నవంబర్ 24 జీవపరిణామ దినోత్సవం/

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

# కమ్యూనిటీ హెల్త్‌వర్కర్లను ఆశాలుగా మార్చాలి

● ఏపి కమ్యూనిటీ హెల్త్‌వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గిరిజన ప్రాంతాల్లో ఐటిడిఎల పరిధిలో పనిచేస్తున్న 2,361 మంది కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్చాలని ఏపి కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు మహిళా, శిశు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి యూనియన్ నాయకులు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా హెల్త్ వర్కర్ల సమస్యలను యూనియన్ ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి మంత్రికి వివరించారు. ఆశాలుగా మార్చే వరకు కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు ఆశాలతో సమాన వేతనం, ఇతర సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు రూ.4 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. బకాయి వేతనాలు చెల్లించాలన్నారు. యూనిఫాం, రికార్డ్స్, మెడికల్ కిట్లు, టిఎ, డిఎలు ఇవ్వాలన్నారు. రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ఎఎన్ఎం శిక్షణ పొందిన గిరిజన ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను గిరిజన ప్రాంతాల్లో ఎఎన్ఎంగా నియమించాలని అన్నారు. సిహెచ్‌డబ్ల్యుకు గౌరవ వేతనం డైరెక్టరేట్ నుంచి చెల్లించాలన్నారు. యూనియన్ కార్యదర్శి కె లక్ష్మి, ఉపాధ్యక్షులు జి కుమారి, రాష్ట్ర కమిటీ సభ్యులు వి రేణుక తదితరులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.



మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతి పత్రం అందచేస్తున్న ధనలక్ష్మి తదితరులు

## ఆర్‌జివిపై కేసులో కౌంటర్ వేయండి

### పోలీసులకు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మపై నమోదు చేసిన కేసు వివరాలను సమర్పించాలని పోలీసులకు హైకోర్టు ఆదేశించింది. సమగ్ర వివరాలతో కౌంటర్ వేయాలని నోటీసులిచ్చింది. విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. వ్యూహం సినిమా రిలీజ్ సందర్భంగా చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్‌ను కించపర్చేలా వర్మ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని కేసు నమోదైంది.

## పోలవరం ఎత్తు తగ్గిస్తే కలిగే నష్టాన్ని వివరిస్తాం

● వైసిపి ఎంపిలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించే నిర్ణయం వల్ల రాష్ట్రానికి కలిగే నష్టాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావిస్తామని వైసిపి ఎంపిలు పేర్కొన్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో గురువారం సమావేశమై చర్చించామని వైసిపి ఎంపిలు పిల్లి సుభాష్ చంద్రబోస్, గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి, తనూజారాణి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పోలవరం ప్రాజెక్టు ఎత్తును 45.72 మీటర్లకు నిర్మించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తామన్నారు. ప్రాజెక్టుకు పెండింగ్ నిధులు, పునరావాస కార్యక్రమాలకు నిధులు విడుదల చేయాలని ప్రధానికి విజ్ఞప్తి చేస్తామని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రయత్నాన్ని అడ్డుకుంటామని, అవసరమైతే ఆందోళన చేస్తామని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా విషయంలోనూ వెనుకడుగు వేసేది లేదన్నారు. కేంద్రం తీసుకొస్తున్న వక్ఫ్ బిల్లును ఆమోదించేది లేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా కార్యకర్తలపై జరిగిన దాడులు, విధ్వంసం, హత్యలు జరుగుతున్నాయని తెలిపారు. మరోవైపు టిడిపి సోషల్ మీడియా కార్యకర్తలు పెట్టిన పోస్టులపై ఆధారాలతో సహా పోలీసులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ అంశాలను పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావిస్తామని చెప్పారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితిని జాతీయ స్థాయిలో అన్ని పార్టీల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

## చెత్తపన్ను రద్దుకు శాసనసభ ఆమోదం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పట్టణ ప్రాంతాల్లో చెత్తపన్ను రద్దుకు శాసనసభ గురువారం ఆమోదం తెలిపింది. మున్సిపల్‌శాఖ మంత్రి పి నారాయణ బిల్లు ప్రవేశపెట్టగా సభ్యుల చర్చ తర్వాత సభ ఆమోదించింది. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో చెత్తపన్ను వసూలు, కాంట్రాక్టుల్లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. టిడిపి హయాంలో మున్సిపాలిటీల్లో ఒక్క రూపాయి కూడా ట్యాక్స్ పెంచలేదని అన్నారు. ఇంటి పన్ను రూ.50 పైన్న పేద వారి నుంచి చెత్తపన్ను ఏడాదికి రూ.360 వసూలు చేశారని ఎద్దేవా చేశారు. చెత్త తొలగింపు కాంట్రాక్టర్లకు సొమ్ము చెల్లించేందుకు వీలుగా ఈ పన్ను వసూలు చేశామని గత పాలకులు చెప్పారన్నారు. 2014-19 మధ్య టిడిపి అధికారంలో ఉన్న సమయంలో మున్సిపాలిటీల్లో ఒక్క రూపాయి కూడా ట్యాక్స్ పెంచలేదని తెలిపారు. కానీ వైసిపి చెత్తపన్నుతోపాటు ఆస్తి పన్ను పెంచిందన్నారు.

## మైనారిటీలు, అణగారిన వర్గాలపై బుల్డోజర్లు నడిపిస్తూ సాహితీ బహుమతులా?

● జెసిబి సాహితీ బహుమతిపై వందమందికి పైగా రచయితల లేఖ

న్యూఢిల్లీ : జెసిబి ఏర్పాటు చేసిన సాహితీ బహుమతిని 'కపటత్వం'గా విమర్శిస్తూ వందమందికి పైగా రచయితలు, అనువాదకులు, ప్రచురణకర్తలు బహిరంగ లేఖ రాశారు. దీనికి నిధులు అందిస్తున్న బ్రిటిష్ బుల్డోజర్ తయారీ కంపెనీ జెసిబి భారత్, పాలస్తీనాల వ్యాప్తంగా ఇళ్ల విధ్వంసంలో ప్రధాన పాత్ర పోషించిందని వారు విమర్శించారు. వివిధ రాష్ట్రాల్లో ముస్లిముల దుకాణాలు, ఇళ్లు, ఆరాధనా స్థలాలను ధ్వంసం చేయడానికి ఒక పద్ధతి ప్రకారం జెసిబి బుల్డోజర్లను బిజెపి ప్రభుత్వం ఉపయోగిస్తోందని వారు పేర్కొన్నారు. బుల్డోజర్ న్యాయం పేరుతో దీన్ని సాగిస్తున్నారన్నారు. జెసిబి సాహితీ బహుమతిని ప్రకటించడానికి రెండు రోజుల ముందుగా ఈ లేఖ విడుదల చేశారు. రచయిత, విమర్శకుడు కె.సచ్చిదానందన్, కవి, ప్రచురణకర్త అసద్ జైదీ, కవి, నవలా రచయిత మీనా కందసామి ప్రభృతులు ఈ బహిరంగ లేఖపై సంతకాలు చేశారు. మైనారిటీల పట్ల విద్వేషాన్ని చూపించే కార్యకలాపాలకు చిహ్నంగా మారిన జెసిబి తన సాహితీ బహుమతితో చట్టబద్ధతను పొందడానికి ప్రయత్నిస్తోందని రచయిత, జర్నలిస్టు జియా ఉస్ సలామ్ విమర్శించారు. బ్రిటీష్ నిర్మాణ సామాగ్రి తయారీదారైన జెసిబికి అనుబంధ సంస్థగా జెసిబి (ఇండియా) వుంది. బ్రిటీష్ కన్జర్వేటివ్ పార్టీకి అత్యధికంగా విరాళాలు అందించే సంస్థల్లో జెసిబి ఒకటి. భారతదేశంలో మితవాద హిందూ ఆధిపత్య ప్రాజెక్టుల్లో జెసిబి పరికరాలను ఉపయోగించడం ఈ సందర్భంగా ఎలాంటి ఆశ్చర్యాన్ని కలిగించదని ఆ లేఖ పేర్కొంది. జెసిబి ఏజెంటుకు, ఇజ్రాయిల్ రక్షణ శాఖకు మధ్య కుదిరిన కాంట్రాక్టులో భాగంగా ఆక్రమిత పాలస్తీనా భూభాగంలో ఇళ్ల కూల్చివేతలో కూడా జెసిబి బుల్డోజర్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆ లేఖ పేర్కొంది. అట్టడుగున గల, వైవిధ్యమైన రచయితలను లక్ష్యంగా చేసుకుని జెసిబి ఈ సాహితీ బహుమతిని సృష్టించిందని ఆ లేఖ విమర్శించింది. ఇలాంటి బహుమతులు అందజేసినంత మాత్రాన జెసిబి తన నెత్తుటి చేతులను తుడుచుకోలేదని, రచయితలుగా తాము దీన్ని ఖండిస్తున్నామని వారు ఆ లేఖలో పేర్కొన్నారు.

## కేజ్రీవాల్ కేసులో ఇడికి ఢిల్లీ హైకోర్టు నోటీసు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)కి ఢిల్లీ హైకోర్టు నోటీసులిచ్చింది. ఎక్సైజ్ పాలసీ కేసుతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ కేసులో తనపై ఇడి దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకున్న ట్రయల్ కోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు గురువారం విచారణ జరిపింది. ఈ పిటిషన్‌పై స్పందించేందుకు జస్టిస్ మనోజ్ కుమార్ ఓహ్రీ ఇడికి గడువు ఇచ్చారు. స్టే దరఖాస్తుపై కోర్టు ఎలాంటి ఉత్తర్వులూ ఇవ్వలేదు. కేజ్రీవాల్ తరపున సీనియర్ న్యాయవాదులు ఎన్ హరిహరన్, రెబెకా ఎం జాన్ వాదనలు వినిపించారు. ఇడి తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఉందని తెలిపారు.

# రూ.1.87 లక్షల కోట్లతో ఎన్‌టిపిసి పెట్టుబడులు

- రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం
- సిఎం సమక్షంలో సంతకాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రూ.1.87 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌టిపిసి ముందుకొచ్చింది. రాష్ట్ర పునరుత్పాదక విద్యుత్ సంస్థ (ఎన్‌ఆర్‌ఇడిసిఎపి), ఎన్‌టిపిసి గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఎన్‌జిఇఎల్) మధ్య ఇందుకు సంబంధించిన ఒప్పందం జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో సచివాలయంలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. ఇంధన రంగంలో రాష్ట్రాన్ని అగ్రగామి చేసే క్రమంలో ఇది కీలక అడుగు అని చంద్రబాబు అన్నారు. సౌర, పవన, పంప్డ్ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా వంటి పునరుత్పాదక విద్యుత్ రంగ ప్రాజెక్టులను ప్రోత్సహించడానికి తాము ఎప్పుడూ ముందుంటామని చెప్పారు. ఈ ప్రాజెక్టు తొలిదశను 2027 ఏప్రిల్ మే నాటికి పూర్తిచేయాలన్నారు. ఇంటిగ్రేటెడ్ ఎనర్జీ పాలసీలో భాగంగా వచ్చే ఐదేళ్లలో 78.50 గిగావాట్ల సౌరశక్తి, 35 గిగావాట్ల పవన శక్తి, 22 గిగావాట్ల పంప్డ్ స్టోరేజ్, 1.50 ఎంఎంటిపిసి గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. ఈ జాయింట్ వెంచర్‌తో పెద్దయెత్తున ఉద్యోగ అవకాశాలు రావడమే కాకుండా ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాల రూపురేఖలు మారుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, ఎన్‌టిపిసి గ్రీన్ ఎమ్‌డి, ఛైర్మన్ గురుదీప్ సింగ్, ఎన్‌జిఇఎల్ ఇడి ఆర్ సారంగపాణి, ఎపి జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధర్ బాబు, ట్రాన్స్‌కో జెఎమ్‌డి కీర్తి చేకూరి తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న ఎన్‌టిపిసి, ఎన్‌ఆర్‌ఇడిసిఎపి ప్రతినిధులు

## విద్యాసాగర్ బెయిల్ కేసులో జత్వానీకి నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి

సినీనటి కాదంబరి జత్వానీ ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు బెయిల్ ఇవ్వాలంటూ వైసిపి నేత, వ్యాపార వేత్త విద్యాసాగర్ దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం హైకోర్టు విచారణ జరిపింది. కౌంటర్ దాఖలు చేయాలని జత్వానీతోపాటు సిఐడిని ఆదేశించింది. విచారణను వచ్చే వారానికి వాయిదా వేస్తూ జస్టిస్ మల్లికార్జునరావు ఆదేశాలిచ్చారు. తప్పుడు కేసులో ఇరికించి తన ఆధార్ కార్డులు, ఇతర పత్రాలను ఫోర్జరీ చేశారని పేర్కొంటూ విద్యాసాగర్‌పై జత్వానీ పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో బెయిల్ ఇవ్వాలని ఆయన హైకోర్టును ఆశ్రయించారు.

## గౌతంరెడ్డి కేసు విచారణ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

విజయవాడ, సత్యనారాయణపురం పిఎస్‌లతో తనపై నమోదైన హత్యాయత్నం కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ వైసిపి నేత పి గౌతంరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ఈ నెల 26కు వాయిదా పడింది. ఈలోగా గౌతంరెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవద్దన్న గత ఉత్తర్వులను జస్టిస్ మల్లికార్జునరావు గురువారం మరోసారి పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## పర్యాటక ప్రాంతాల్లో ప్రవేశఫీజు వద్దు

- మంత్రి దుర్గేష్‌కు డివైఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సూర్యలంక, రామవరం, రుషికొండ, కాకినాడ, మైపాడు తదితర బీచ్‌ల వద్ద పర్యాటకుల నుంచి ప్రవేశ రుసుం, వాహనాల నుంచి రుసుం వసూలు చేసే యోచనను విరమించుకోవాలని డివైఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ కోరింది. పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుతో కలిసి పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను అసెంబ్లీలో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని స్వాగతించారు. కానీ వినోదం కోసం వచ్చే పర్యాటకుల నుంచి ప్రవేశ రుసుం పేరుతో డబ్బులు వసూలు చేయడం సరైంది కాదని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధి, నిర్వహణ పూర్తిగా ప్రభుత్వమే బాధ్యత తీసుకుని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. పార్కింగ్ ఛార్జీలు, ప్రవేశ రుసుం లేకుండా చూడాలన్నారు. రాష్ట్రంలో అనేక చోట్ల పర్యాటకులను ఆకట్టుకునే ప్రాంతాలున్నా నిర్లక్ష్యానికి గురయ్యాయని, వాటిని అభివృద్ధి చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో డివైఎఫ్‌ఐ అధ్యక్ష, కార్యదర్శులు వై రాము, జి రామన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు కె పిచ్చయ్య తదితరులు ఉన్నారు.

## విశాఖలో మరో హైకోర్టు బెంచ్ ఏర్పాటు

- ప్రభుత్వాన్ని కోరిన పిడిఎఫ్ సభ్యులు కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హైకోర్టు బెంచ్‌ను కర్నూలులో ఏర్పాటు చేస్తూ శాసనమండలిలో పెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నామని, అదే సమయంలో ఉత్తరాంధ్ర ప్రాంతానికి మేలు చేసే విధంగా విశాఖలోనూ మరో బెంచ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. శాసనమండలిలో న్యాయశాఖ మంత్రి ఎన్.ఎండి ఫరూక్.. ఎపి ఉన్నత న్యాయస్థానం ధర్మాసనాన్ని హైకోర్టులో ఏర్పాటు చేయాలనే తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో సభ్యులు కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ... పెద్ద రాష్ట్రాల్లో రెండు బెంచ్‌లు ఏర్పాటు చేశారని తెలిపారు. విశాఖలో బెంచ్ ఏర్పాటు అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. సభ్యులు వై శివరామిరెడ్డి మాట్లాడుతూ.. సిబాగ్ ఒప్పందం ప్రకారం కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేయాల్సి ఉందని, బెంచ్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం చేతులు దులుపుకుంటుందని చెప్పారు. సభ్యులు రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ... గత ప్రభుత్వం హైకోర్టును కర్నూలులో ఏర్పాటు చేస్తామంటే అడ్డుకున్నది టిడిపి నాయకులేనన్నారు. ఎంవి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ... కర్నూలులో న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు 243 ఎకరాలు కేటాయించారని, దీని నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ సందర్భంగా సభ్యులు రామ్‌గోపాల్ రెడ్డి, నాయుడు, అరుణ్‌కుమార్ తదితరులు ప్రసంగించారు.

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేస్తామన్న గత ప్రభుత్వం.. గత ఐదేళ్ల కాలంలో కనీసం ప్రతిపాదనలు కూడా సమర్పించలేకపోయిందని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. ఇది కర్నూలు ప్రజలకు పండగ వంటిదని మంత్రి టిజి భరత్ తెలిపారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. రాయలసీమకు వైసిపి హయాంలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం హైకోర్టు బెంచ్ కర్నూలులో ఏర్పాటు చేసేందుకు తీర్మానం చేసి తదుపరి చర్యల కోసం హైకోర్టును కోరుతున్నట్లు చెప్పారు. అక్కడ ఏర్పాటుచేసిన ఎపిఇఆర్‌సి, మనవ హక్కుల కమిషన్ కార్యాలయం, ఇతర కార్యాలయాలను తరలించేది లేదని అన్నారు. న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ.. రాష్ట్ర తొలి రాజధాని కర్నూలుకు పూర్వవైభవం రానుందని, హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడాన్ని సీమ ప్రజలు స్వాగతిస్తున్నారని చెప్పారు.

## లైంగిక వేధింపుల కేసుల్లో అనారోగ్య కారణాలతో బెయిల్‌పై ఎంతమంది వచ్చారు?


- వివరాలు ఇవ్వాలని జైళ్ల శాఖకు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

చిన్నారులపై లైంగిక వేధింపులు, మహిళలపై అత్యాచారాలు, హత్యలు, కిడ్నాపులకు పాల్పడిన కేసుల్లో ఎంతమందికి శిక్షలు పడ్డాయో, వారిలో ఎంతమంది అనారోగ్య కారణాలతో విడుదలయ్యారో పూర్తి వివరాలు అందజేయాలని జైళ్ల శాఖకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పూర్తి వివరాలు నివేదించాలని జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్‌ను గురువారం ఆదేశించింది. అదే మాదిరి శిక్ష అనుభవిస్తూ అనార్యోగాలకు గురైన ఖైదీల వివరాలు కూడా ఇవ్వాలంది. అత్యవసర చికిత్స కోసం బయట ఉండే ఆస్పత్రులు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు పంపేందుకు ఒక నిర్దిష్ట విధానాన్ని రూపొందించాలని ఆదేశించింది. రెండు వారాల్లోగా పూర్తి వివరాలు ఇవ్వాలని జస్టిస్ గుహనాథన్ నరేందర్, జస్టిస్ తూటా చంద్ర ధనశేఖర్‌తో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ఆదేశించింది. బాపట్ల మండలానికి చెందిన శ్రీనివాస వర్మ అనే యువకుడికి గుంటూరు పోక్సో ప్రత్యేక కోర్టు జీవిత ఖైదు విధిస్తూ 2022 డిసెంబర్ 19న తీర్పు చెప్పింది. రాజమండ్రి జైల్లో ఉన్న వర్మ తనకు గుండె సమస్య ఉన్నందున అత్యవసర చికిత్స కోసం ఆరు నెలల బెయిల్ ఇవ్వాలని హైకోర్టులో పిటిషన్ వేశారు. ఇలాంటి ఖైదీ రోగులకు మంగళగిరి ఎయిమ్స్ వంటి బయట ఆస్పత్రుల్లో చికిత్స అందజేయాలని ఆదేశించింది. ఈ తరహా ఖైదీలను ఆరోగ్యశ్రీ పథకం కింద నెట్వర్క్ ఆస్పత్రులకు పంపుతున్నామని డిఐజి తరపున ఎజి దమ్మాలపాటి శ్రీనివాస్ తెలిపారు. ఇలాంటి కేసుల్లో ఖైదీలకు న్యాయం అందడం ఆలస్యమైతే ప్రాణ హాని ఉంటుంది కాబట్టి జైలు ఉన్నతాధికారులే తగిన నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు స్పష్టం చేసింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

# కుప్పకూలిన అదానీ షేర్లు

- దలాల్ స్ట్రీట్‌లో కలవరం
- సెన్సెక్స్ 422 పాయింట్ల పతనం
- ఎల్ఐసికి మళ్లీ భారీ నష్టం




| కంపెనీ పేరు | నష్టం |
|---|---|
| అదానీ ఎంటర్‌ప్రైజెస్ | 22.61 శాతం |
| అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ | 20 శాతం |
| అదానీ గ్రీన్ ఎనర్జీ | 18.80 శాతం |
| అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ | 13.53 శాతం |
| అంబూజా సిమెంట్స్ | 11.98 శాతం |
| అదానీ టోటల్ గ్యాస్ | 10.40 శాతం |
| అదానీ విల్మార్ | 9.98 శాతం |
| అదానీ పవర్ | 9.15 శాతం |
| ఎసిసి | 7.29 శాతం |

**ముంబయి :** అమెరికాలోనూ సోలార్ పవర్ కాంట్రాక్టులు దక్కించుకోవడానికి గౌతం అదానీ లంచాలు ఇవ్వజూపారనే అభియోగాలు దలాల్ స్ట్రీట్‌ను తీవ్ర కలవరానికి గురి చేశాయి. ఇవి అదానీ కంపెనీలను సహా ఇతర షేర్లను తీవ్ర ఒత్తిడికి గురి చేయడంతో సెన్సెక్స్, నిఫ్టీలు కుప్పకూలాయి. లక్షల కోట్ల మదుపర్ల సొమ్ము హరించుకుపోయింది. గతేడాది అదానీ అవినీతిపై హిండెన్‌బర్గ్ విడుదల చేసిన రిపోర్ట్ తర్వాత భారీగా నష్టపోయిన అదానీ కంపెనీల షేర్లు.. తాజాగా మరోమారు అదే గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. మరోవైపు రష్యా, ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు పెరగడం మదుపర్లను ఆందోళనకు గురి చేశాయి. తుదకు బిఎస్‌ఇ సెన్సెక్స్ 423 పాయింట్లు లేదా 0.54 శాతం పతనమై 77,156కు పడిపోయింది. ఇంట్రాడేలో ఏకంగా 776 పాయింట్లు కోల్పోయి.. 76,803 కనిష్ట స్థాయిని ఎదుర్కొంది. తుదకు బిఎస్‌ఇ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.5.28 లక్షల కోట్లు హరించుకుపోవడంతో రూ.425.38 లక్షల కోట్లకు పరిమితమైంది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 169 పాయింట్ల నష్టంతో రూ.23,350 వద్ద ముగిసింది. వరుసగా ఏడు రోజులు భారీ నష్టాలను చవిచూసిన మార్కెట్లు.. బుధవారం నాటి లాభాలు స్వల్ప ఉపశమనం కలిగించాయని భావించినంతలోనే మరుసటి రోజే నిరాశ ఎదురయ్యింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 7 పైసలు పతనమై 84.49 జీవితకాల కనిష్టానికి పడిపోయింది. సెన్సెక్స్-30లో అదానీ పోర్ట్స్, ఎస్‌బిఐ, ఎన్‌టిపిసి, బజాజ్ సహా 20 స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. డి-మార్ట్, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్, ఏషియన్ పెయింట్స్, ఇంద్రప్రస్థ గ్యాస్, బంధన్ బ్యాంకు, ఇండస్‌ఇండ్ బ్యాంకు స్టాక్స్ 52 వారాల కనిష్టానికి జారాయి.

**అదానీ సంపద రూ.2.5 లక్షల కోట్లు ఫట్**

అదానీ గ్రూపులోని 10 లిస్టెడ్ కంపెనీల షేర్లు భారీ పతనాన్ని చవి చూడటంతో గౌతం అదానీ సంపద భారీగా హరించుకుపోయింది. ఆయా షేర్లు 23 శాతం వరకు పడిపోవడంతో ఒక్క పూటలోనే దాదాపు రూ.2.60 లక్షల కోట్లు ఆవిరైంది. మొత్తంగా గ్రూపు కంపెనీల మార్కెట్ విలువ రూ.14.28 లక్షల కోట్ల నుంచి రూ.12.42 లక్షల కోట్లకు పడిపోయిందని అంచనా. గౌతమ్ అదానీ సంపద ఒకరోజులో దాదాపు 12.1 బిలియన్ డాలర్లు పడిపోయి.. 70 బిలియన్ డాలర్ల నుంచి 57.7 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. ఇప్పటివరకు ఫోర్బ్స్ బిలియనీర్ ఇండెక్స్ జాబితాలో 22 స్థానంలో కొనసాగిన అదానీ ప్రస్తుతం 25వ స్థానానికి పడిపోయారు. హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌తో గతేడాది 34 శాతం విలువ కోల్పోయిన అదానీ కంపెనీలు.. ఈ దఫా కూడా అదే స్థాయిలో నష్టాలు జరగొచ్చని.. రిటైల్ ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

**ఎల్ఐసికి రూ.12 వేల కోట్ల నష్టం**

అదానీ షేర్లు కుప్పకూలడంతో దిగ్గజ బీమా కంపెనీ ఎల్ఐసి భారీ నష్టాన్ని చవిచూసింది. అదానీకి చెందిన ఎంటర్‌ప్రైజెస్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, అదానీ టోటల్ గ్యాస్, ఎసిసి, అంబుజా సిమెంట్స్‌లో ఎల్ఐసి కీలక వాటాలను కలిగి ఉంది. ఈ స్టాక్స్ 20 శాతం వరకు విలువ కోల్పోవడంతో.. ఎల్ఐసి దాదాపు రూ.12,000 కోట్లు నష్టపోయింది. గతేడాది అదానీపై హిండెన్‌బర్గ్ రిపోర్ట్ సమయంలోనూ ఎల్ఐసి వేల కోట్ల సంపదను కోల్పోయింది.

# అపరకుబేరుడి అక్రమాలెన్నో!

**న్యూఢిల్లీ :** గౌతమ్ అదానీపై ఆ గ్రూపునకు చెందిన మరో ఆరుగురిపై అమెరికా న్యాయస్థానంలో కేసు నమోదైన నేపథ్యంలో ఇప్పటివరకు అదానీ గ్రూపుపై వచ్చిన ఆరోపణలు, కుంభకోణాలను పరిశీలిద్దాం. అదానీ గ్రూపు చరిత్ర అంతా అవకతవకలు, అవినీతి ఆరోపణలమయమే. పర్యావరణానికి హాని కలిగించే ప్రణాళికలు, కుట్రలు, కుతంత్రాలతో నిండి వుంది. తాజాగా అమెరికా ఇన్వెస్టర్లను తప్పుదారి పట్టించారంటూ అక్కడి కోర్టులో కేసు నమోదవడం వీటికి పరాకాష్టగా వుంది. గతేడాది జనవరిలో, అదానీ గ్రూపు స్టాక్‌ల అవకతవకలకు, అవినీతికి పాల్పడిందంటూ అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదిక ఆరోపించింది. విదేశాల్లో పన్నులకు స్వర్గధామాలుగా వున్న ప్రాంతాలను అనుచితంగా ఉపయోగించు కుంటున్నారని పేర్కొంది.

**భారీ కుంభకోణాలు, ఆరోపణలు...**

2023 జనవరి – హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదిక : అదానీ గ్రూపు తీవ్ర స్థాయిలో స్టాక్‌ల అవకతవకలకు, అవినీతికి పాల్పడిందంటూ అమెరికాకు చెందిన కంపెనీ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపించింది. ఈ అవకతవకలు, అవినీతి దశాబ్దాలుగా కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. సమర్ధించుకోలేని రీతిలో అధిక రుణ భారాలతో సతమతమవుతోందని, పైగా విదేశీ పన్ను స్వర్గధామాలను అనుచితమైన రీతిలో ఉపయోగించుకుంటోందని విమర్శించింది.

**2023 ఆగస్టు :** ఒసిసిఆర్‌పి నివేదిక : భారత సెక్యూరిటీల చట్టాలను ఉల్లంఘించి అదానీ గ్రూపు కంపెనీల్లో విదేశీ నిధులను పెట్టుబడులుగా పెడుతున్నారంటూ అదానీ కుటుంబంపై వారి సహచరులపై ఆరోపణలతో ఒసిసిఆర్‌పి (ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్) ఒక నివేదికను వెలువరించింది.

**2024 నవంబరు** – అమెరికా కోర్టు అభియోగపత్రం, సివిల్ కేసు : 26కోట్ల డాలర్లకు పైగా ముడుపులను అందించి భారత ఉపఖండంలో సౌర విద్యుత్ ప్రాజెక్టులను చేపడుతున్న విషయాన్ని దాచిపెట్టి అమెరికా పెట్టుబడిదారులను మోసగించారంటూ గౌతమ్ అదానీపై అమెరికా న్యాయస్థానంలో కేసు నమోదైంది.

**గత ఎనిమిదేళ్లలో అదానీ గ్రూపు అక్రమాలపై ప్రజాందోళనలు**

2017 – కార్మిచెల్ బొగ్గు గని ప్రాజెక్టు : ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్‌లో దాదాపు 1100కోట్ల డాలర్లతో కార్మిచెల్ బొగ్గు గని ప్రాజెక్టును చేపట్టాలని అదానీ ఎంటర్‌ప్రైజెస్ ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టుకు వాతావరణ కార్యకర్తల నుండి తీవ్రమైన నిరసన ఎదురైంది. ఈ ప్రాజెక్టు వెలువరించే కర్బన ఉద్గారాల వల్ల ఆస్ట్రేలియాలోని గ్రేట్ బారియర్ పగడపు దిబ్బలకు తీవ్రంగా నష్టం వాటిల్లే ప్రమాదముందంటూ విస్తృత స్థాయిలో ఆందోళనలు, నిరసనలు చేపట్టారు.

**2017 – గొడ్డా విద్యుత్ ప్లాంట్ :** అదానీ గ్రూపు జార్ఖండ్‌లోని గొడ్డాలో విద్యుత్ ప్లాంట్‌ను నెలకొల్పింది. ఇందుకోసం బంగ్లాదేశ్‌తో విద్యుత్ కొనుగోలు ఒప్పందం కుదుర్చుకుంది. గిరిజనుల హక్కులను ఉల్లంఘిస్తున్నారన్న కారణంతో ఈ ఒప్పందంపై అటు బంగ్లాదేశ్‌లో ఇటు జార్ఖండ్‌లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి.

**2021 – యాంగాన్ పోర్ట్ :** మయన్మార్‌లోని యాంగాన్ నగరంలో కంటెయినర్ టెర్మినల్‌ను నిర్మించాలన్న అదానీ పోర్ట్స్ ప్రణాళికను అంతర్జాతీయ పెట్టుబడిదారులు తీవ్రంగా పరిశీలించారు. మయన్మార్ మిలటరీకి చెందిన సంస్థల నుండి లీజుకు తీసుకున్న భూమిలో దీన్ని నిర్మించాలనుకోవడమే ఇందుకు కారణం. ఆ తర్వాతే మయన్మార్‌లో సైనిక కుట్ర జరగడం, వందలాదిమంది చనిపోవడం చోటు చేసుకుంది.

**2022 – శ్రీలంక పవన విద్యుత్ ప్రాజెక్టు :** శ్రీలంకలోని ఉత్తర ప్రావిన్స్‌లో నిర్మించే ప్రాజెక్టుల ద్వారా గాలి మరల విద్యుత్‌ను శ్రీలంక ప్రభుత్వానికి విక్రయించేందుకు అదానీ గ్రీన్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టును పర్యావరణ కార్యకర్తలు, స్థానికులు తీవ్రంగా నిరసించారు. జీవ వైవిధ్యంపై, స్థానికుల జీవనోపాధులపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుందని వ్యతిరేకించారు.

**2023 డిసెంబరు – ధారావి పునర్ అభివృద్ధి ప్రాజెక్టు :** ఆసియాలోనే అతిపెద్ద మురికివాడల్లో ఒకటైన ముంబైలోని ధారావిలో 259 హెక్టార్లను అభివృద్ధి పరిచే ప్రాజెక్టును అదానీ ప్రాపర్టీస్ 2022 నవంబరులో చేజిక్కించు కుంది. ఇందుకు వేలాదిమంది ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుకు వేసిన బిడ్‌లలో అదానీ గ్రూపునకే ప్రభుత్వం ప్రాధాన్యతను ఇచ్చిందని ప్రతిపక్షాలు విమర్శించాయి.

మహారాష్ట్రలో ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని ప్రభుత్వాన్ని అస్థిరపరిచి, బిజెపి నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అదానీ నివాసంలోనే సమావేశం జరిగిందని ఇటీవల వెలుగులోకి వచ్చింది.

**2024 సెప్టెంబరు – నైరోబి ఎయిర్‌పోర్ట్ :** అదానీ గ్రూపుతో కెన్యా ఎయిర్‌పోర్ట్ అథారిటీ కుదుర్చుకున్న ఒప్పందాన్ని వందలాదిమంది కార్మికులు తీవ్రంగా నిరసించారు. ఈ ఒప్పందం కింద నైరోబి విమానాశ్రయాన్ని 30ఏళ్లపాటు లీజుకు తీసుకుని, నిర్వహించే బాధ్యతను అదానీ గ్రూపు తీసుకోనుంది. దీనివల్ల ఉద్యోగాల్లో కోత వుంటుందని కార్మికులు భయాందోళనలు వ్యక్తం చేశారు.

## అవినీతి భాగోతంపై
# పార్లమెంట్‌లో నిలదీస్తాం




**న్యూఢిల్లీ :** అవినీతికి పాల్పడిన గౌతమ్ అదానీని వెంటనే అరెస్ట్ చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అదానీపై అమెరికాలో కేసు నమోదు నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ గురువారం ఉదయం మాట్లాడుతూ అదానీని అరెస్టు చేసి, సెబీ చైర్‌పర్సన్ మాధబిపురి బచ్‌పై విచారణ జరిపించాలని అన్నారు. అదానీ భారతీయ, అమెరికన్ చట్టాలను ఉల్లంఘించినట్లు ఇప్పుడు స్పష్టంగా నిర్ధారణైందని చెప్పారు. ప్రధాని మోడీ 'ఏక్‌హైతో సేఫ్‌హై' నినాదాన్ని ప్రస్తావిస్తూ భారత్‌లో ప్రధాని మోడీ, అదానీ కలిసున్నంతవరకు సురక్షితంగా ఉంటారని ఎద్దేవా చేశారు. సోమవారం నుండి ప్రారంభంకానున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతామని చెప్పారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ విచారణకు ప్రతిపక్షాలు కట్టుబడి ఉన్నాయని స్పష్టం చేశారు. 'మోడీ ప్రభుత్వం అదానీని రక్షిస్తున్నందున భారత్‌లో అదానీని అరెస్ట్ చేయడం లేదా విచారణ చేపట్టడం జరగదని నేను హామీ ఇవ్వగలను' అని రాహుల్ అన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంది అన్న అంశంతో సంబంధం లేకుండా అన్ని రాష్ట్రాల్లోనూ విచారణ జరగాలని చెప్పారు.

**అదానీని అడ్డుకున్నాం : ఆప్**



ఢిల్లీ ఇంధన రంగంలోకి ప్రవేశించాలనే అదానీ గ్రూప్ ప్రయత్నాలను అడ్డుకున్నామని ఆప్ తెలిపింది. గురువారం మీడియాతో ఆప్ ఎంపి సంజయ్ సింగ్ మాట్లాడుతూ 'అదానీ గ్రీన్ ఎనర్జీ గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ వంటి పలు రాష్ట్రాల్లో పవర్ సప్లై కాంట్రాక్టులు దక్కించుకుంది. ఢిల్లీ ఎలక్ట్రిసిటీ మార్కెట్‌లోకి ప్రవేశించాలని ప్రయత్నించింది. అప్పటి సిఎం కేజ్రీవాల్ ఆ ప్రయత్నాన్ని అడ్డుకున్నారు' అని తెలిపారు. త్వరలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతామని చెప్పారు.

**జెపిసి ఏర్పాటు చేయాలి : ఫరూక్ అబ్దుల్లా**



గౌతమ్ అదానీపై అమెరికాలో కేసు నమోదు అంశం తీవ్రమైన విషయమని, దీనిపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) ఏర్పాటు చేయాలని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) అధ్యక్షులు ఫరూక్ అబ్దుల్లా కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2021లో జమ్ముకాశ్మీర్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ పాలన సమయంలో జెకె పవర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఇసిఐ) మధ్య కుదిరిన ఒప్పందంపై విచారణ చేస్తామని తెలిపారు. 'ఇది ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వం, ప్రజలకు ప్రతిదీ తెలుసుకునే హక్కు ఉంది' అని చెప్పారు.

## అదానీ గ్రూపు అధికారులతో జగన్ భేటీ వెనుక...?

**న్యూఢిల్లీ :** 2021 సెప్టెంబర్ 13న అదానీ, ఇతర గ్రూప్ అధికారులతో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భేటీ అయ్యారని వార్తలొచ్చాయి. అప్పట్లో ఈ సమావేశం వివరాలు మాత్రం బయటకు రాలేదు. 2021 సెప్టెంబరులో అదాని తన సోదరులతో కలిసి అప్పటి ముఖ్యమంత్రి తాడేపల్లి నివాసంలో జగన్‌తో సమావేశమయ్యారని ఆ నెల 13న ఓ వార్త వచ్చింది. ఈ పర్యటనపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. సాధారణంగా ఇలాంటి సమావేశాలు జరిగినప్పుడు అధికారిక ప్రకటనలు ఇస్తుంటారు. ఈ పర్యటనకు ముందు గంగవరం ఓడరేవులో ప్రభుత్వానికి ఉన్న 10.4 శాతం వాటాను అదానీ గ్రూపునకు విక్రయించాలని ఏపీ సర్కారు ప్రయత్నించింది. ఆ సమయంలో ప్రభుత్వానికి పోర్టులో 89.61 శాతం వాటాలు ఉన్నాయి. అయితే ప్రభుత్వ ప్రయత్నాలను హైకోర్టులో కొందరు వ్యక్తులు సవాలు చేశారు. జగన్, అదానీల మధ్య జరిగిన రహస్య సమావేశం వివరాలను బహిర్గతం చేయాలని వామపక్షాలు అప్పట్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ సమావేశం తర్వాత రాష్ట్రంలో 9,000 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంటును ఏర్పాటు చేసేందుకు అదానీ గ్రూపును అనుమతిస్తూ రాష్ట్ర క్యాబినెట్ ఓ తీర్మానాన్ని ఆమోదించింది. ప్రాజెక్ట్ అమలుకు అనేక మంది కాంట్రాక్టర్లు ముందుకు వస్తే అదానీకి మాత్రమే ఎందుకు అప్పగించారని ప్రతిపక్షాలు ప్రశ్నించాయి. 2021 డిసెంబరులో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ పంపిణీ కంపెనీలు సెసీతో విద్యుత్ సరఫరా ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. వీటి ప్రకారం ఏడు గిగావాట్ల సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ అంగీకరించింది. 2021లో అదానీ, జగన్ మధ్య సమావేశం జరిగిన నెల రోజుల తర్వాత అదానీలు, అంబానీలకు చెందిన ప్రత్యేక ప్రయివేటు జెట్లను ఉపయోగించుకునేందుకు ఏపీ ముఖ్యమంత్రి ఆసక్తి చూపారు. తిరుమల దేవాలయ పర్యటన కోసం చిత్తూరు వెళ్లేందుకు ఆదానీ విమానాన్ని జగన్ ఉపయోగించారు. అదానీలతో సమావేశం కావడానికి ముందు ఆగస్టులో రిలయన్స్ గ్రూపునకు చెందిన విమానాన్ని జగన్ వాడారు.

# ఒప్పందాలు రద్దు చేసుకున్న కెన్యా


విలియం రుటో

**నైరోబి :** అమెరికాలో గౌతమ్ అదానీపై కేసు నమోదైన నేపథ్యంలో అదానీ గ్రూపుతో అన్ని ఒప్పందాలను కెన్యా రద్దు చేసుకుంది. దేశంలో ప్రధాన విమానాశ్రయం నిర్వహణను అప్పగించడంతో సహా అదానీ గ్రూపుతో అన్ని ఒప్పందాల రద్దు ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అధికారులను కెన్యా అధ్యక్షులు విలియం రుటో ఆదేశించారు. ప్రజలను ఉద్దేశించి ఆయన గురువారం ప్రసంగించారు. విద్యుత్ సరఫరా లైన్ల నిర్మాణం కోసం అదానీ గ్రూపునకు చెందిన ఒక యూనిట్‌తో దేశ ఇంధన మంత్రిత్వ శాఖ గత నెలలో సంతకం చేసిన 736 మిలియన్ డాలర్ల పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ ఒప్పందాన్ని కూడా రద్దు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ శాఖతోపాటు పెట్రోలియం, రవాణా శాఖలకు చెందిన సంస్థలకు అదానీ గ్రూపుతో అన్ని ఒప్పందాలను తక్షణమే రద్దు చేసుకోవాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. దర్యాప్తు సంస్థలు, భాగస్వామ్య దేశాలు ఇచ్చిన కొత్త సమాచారం ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

**అదానీ గ్రూపుతో ఎలాంటి వాణిజ్య సంబంధాలు లేవు : తమిళనాడు మంత్రి**

అదానీ గ్రూపుతో ఎలాంటి వాణిజ్య సంబంధాలు లేవని తమిళనాడు ప్రభుత్వం స్పష్టం చేసింది. గురువారం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి వి.సెంథిల్ బాలాజీ విలేకరులతో మాట్లాడుతూ తమిళ నాడు జనరేషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ (టిఎఎన్‌జిఇడెసిఒ), అదానీ గ్రూపు కంపెనీల మధ్య ఎలాంటి వాణిజ్య సంబంధాలు లేవని తెలిపారు. తమిళ నాడు ఎలక్ట్రిసిటీ బోర్డుకు సంబంధించినంత వరకు, గత మూడేళ్లుగా అదానీ గ్రూపు సంస్థలతో ఎలాంటి వాణిజ్య సంబంధాలు లేవని చెప్పారు. విద్యుత్ కొనుగోలు కోసం కేంద్ర ఇంధన శాఖ ఆధీనంలో ఉన్న సంస్థలతోనే ఒప్పందాలను కుదుర్చుకున్నట్లు తెలిపారు.

## పాక్‌లో ప్రయాణికుల వాహనంపై దాడి

- 38 మంది మృతి

**పెషావర్ :** పాకిస్థాన్‌లో ప్రయాణీకులతో వెళుతున్న వాహనంపై గుర్తుతెలియని సాయుధులు కాల్పులు జరపడంతో 38 మంది మరణించగా, మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. వాయువ్య పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని కుర్రమ్ వద్ద గురువారం ఈ దాడి జరిగింది. బాధితులంతా షియా ముస్లింలనే అధికారులు తెలిపారు. మృతుల్లో ఆరుగురు మహిళలు ఉన్నారని, గాయపడిన వారిలో 10 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్పారు.



## కాగ్ అధిపతిగా సంజయ్‌మూర్తి ప్రమాణ స్వీకారం

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)గా రాష్ట్రానికి చెందిన సీనియర్ ఐఎఎస్ అధికారి కొండ్రు సంజయ్ మూర్తి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. కాగ్ అధిపతిగా బాధ్యతలు చేపట్టిన తొలి తెలుగు వ్యక్తిగా సంజయ్ మూర్తి నిలిచారు. 1996లో కాంగ్రెస్ నుంచి అమలాపురం మాజీ ఎంపిగా ఎన్నికైన కెఎస్ఆర్ మూర్తి కుమారుడు సంజయ్ మూర్తి. 1964 డిసెంబర్ 24న జన్మించిన ఈయన, మెకానికల్ విభాగంలో ఇంజినీరింగ్ పూర్తిచేశారు. 1989లో ఐఎఎస్‌లో హిమాచల్‌ప్రదేశ్ కేడర్‌కు ఎంపికయ్యారు. ఆ తరువాత కేంద్ర సర్వీసుల్లోకి వచ్చిన ఆయన, 2021 సెప్టెంబర్ నుంచి ఉన్నత విద్యా కార్యదర్శిగా పనిచేశారు. వచ్చే నెలలో ఉద్యోగ విరమణ చేయాల్సిన ఆయనకు కాగ్ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వం అప్పగించింది. ఆయన ఈ పదవిలో గరిష్ఠంగా ఆరేళ్లు కానీ, ఆయనకు 65 ఏళ్ల వయసు వచ్చే వరకు కానీ కొనసాగుతారు.

## ఎఒబిలో కాల్పులు

- మావోయిస్టు మృతి

**ప్రజాశక్తి - సీలేరు (అల్లూరి జిల్లా)**

ఆంధ్ర – ఒడిశా సరిహద్దుల్లో మావోయిస్టులకూ, పోలీసులకూ మధ్య గురువారం ఉదయం జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక మావోయిస్టు మృతి చెందారు. జవాన్‌కు గాయాలయ్యాయి. ఒడిశా పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్ర – ఒడిశా సరిహద్దు మల్కనగిరి జిల్లా కలిమిల బ్లాక్ జినెలగుడా అటవీ ప్రాంతంలో పోలీసు బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడ్డారు. ఇరువురి మధ్య జరిగిన కాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందారు. అతని వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనలో జవాన్ దమ్రుబాద్ నాయక్ తీవ్రంగా గాయపడటంతో ఆయన్ను మల్కనగిరి ఆస్పత్రికి తరలించారు. తప్పించుకున్న మావోయిస్టుల కోసం ఎఒబిని పోలీసులు జల్లెడ పడుతున్నారు.

# భారీ ముడుపుల స్కామ్

(మొదటి పేజీ తరువాయి)

భారత్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోన వ్యక్తులకు సంబంధించినవే అయినప్పటికీ ఈ వ్యవహారంలో అమెరికా మదుపరులు లేదా బ్యాంకర్ల ప్రమేయం ఉన్నందున అవినీతి ఆరోపణలు మోపేందుకు ఆ దేశ చట్టాలు అనుమతించాయి. ఈ ఆరోపణలు నిరాధారమైనవని అదానీ గ్రూప్ తోసిపుచ్చింది.

**అభియోగాలు వీరి పైనే**

గౌతమ్ అదానీని భారతీయ ఇంధన కంపెనీ 'అదానీ గ్రీన్ ఎనర్జీ' వ్యవస్థాపకుడు, చైర్‌పర్సన్‌గా అమెరికా ప్రాసిక్యూటర్లు తమ అభియోగాలలో పేర్కొన్నారు. ఈ కంపెనీయే ఇప్పుడు వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. ఇంధన కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా సాగర్ అదానీ పేరును ప్రస్తావించింది. అజూర్ పవర్ సిఇఓ రంజిత్ గుప్తా, ఆ సంస్థ కన్సల్టెంట్ రూపేష్ అగర్వాల్‌పై కూడా అమెరికా ప్రాసిక్యూటర్లు కేసు నమోదు చేశారు. అజూర్ పవర్ అనేది అమెరికాకు చెందిన ప్రభుత్వ సంస్థ.

**ఏమిటీ కేసు ?**

అమెరికా ప్రాసిక్యూటర్ల అభియోగాల ప్రకారం... భారత ప్రభుత్వానికి చెందిన సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఇసిఐ-సెసీ)కు 12 గిగావాట్ల విద్యుత్‌ను సరఫరా చేసేందుకు అదానీ గ్రీన్ ఎనర్జీ, అమెరికా సంస్థ కలిసి కాంట్రాక్ట్ దక్కించుకున్నాయి. సెకీకి భారత్‌లో సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసే వారు కన్పించలేదు. కొనుగోలుదారులు లేకపోవడంతో ఈ ఒప్పందం ముందుకు సాగలేదు. ఫలితంగా ఈ రెండు కంపెనీలు తాము ఆశించిన లాభాలను పొందలేని పరిస్థితి తలెత్తింది. ఆ సమయంలో అదానీ గ్రూప్, అజూర్ పవర్ కలిసి ఓ పథకాన్ని రూపొందించుకొని భారత ప్రభుత్వంలోని ఉన్నత స్థానాల్లోని వ్యక్తులకు ముడుపులు అందించాయి.

దీనికి ప్రతిఫలంగా సెకీతో విద్యుత్ సరఫరా ఒప్పందాలు కుదుర్చుకునేలా ఆ వ్యక్తులు పలు రాష్ట్రాల విద్యుత్ పంపిణీ కంపెనీలను ఒప్పించారు. ఆ విధంగా కొన్ని రాష్ట్ర విద్యుత్ కంపెనీలు సెకీతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. 2021 జులై, 2022 ఫిబ్రవరి మధ్య కాలంలో ఒరిస్సా, జమ్ము కాశ్మీర్, తమిళనాడు, చత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విద్యుత్ పంపిణీ కంపెనీలతో ఒప్పందాలు జరిగాయి. ఈ రెండు కంపెనీలు భారత ప్రభుత్వంలోని పెద్దలకు 265 మిలియన్ డాలర్ల మేర ముడుపులు అందిస్తామని హామీ ఇచ్చాయి. ఇందులో అధిక భాగం ఆంధ్రప్రదేశ్‌లోని అధికారులకే చేరాయి. 2021 డిసెంబరు 1న ఆంధ్రప్రదేశ్ విద్యుత్ పంపిణీ కంపెనీలతో సెకీ ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా దాదాపు ఏడు గిగావాట్ల సౌర విద్యుత్‌ను కొనేందుకు రాష్ట్రం అంగీకరించింది. మరే ఇతర రాష్ట్రం కన్నా కూడా ఆంధ్రప్రదేశ్ కొనేందుకు అంగీకరించిన మొత్తమే ఎక్కువగా వుంది.

ఒప్పందంలో భాగంగా ఆ రెండు కంపెనీల నుండి ఈ రాష్ట్రాలు సౌర విద్యుత్‌ను కొనుగోలు చేశాయి. ఎవరెవరికి ఎంతెంత సొమ్ము ముట్టచెప్పాలనే విషయంపై అదానీ గ్రీన్ ఎనర్జీ, అజూర్ పవర్ కలిసే నిర్ణయం తీసుకున్నాయి. అయితే అవి తమ గుట్టు బయటపడకుండా కోడ్ నేమ్స్‌ను ఉపయోగించాయి. ఉదాహరణకు గౌతమ్ అదానీని 'న్యూమెరో ఉనో', 'ది బిగ్ మ్యాన్' అని సంబోధించారు. గుప్త సందేశాల ద్వారా సంప్రదింపులు జరిగేవి.

**కథ అడ్డం తిరిగింది**

ఇక్కడే కథ అడ్డం తిరిగింది. అమెరికా సంస్థ యాజమాన్యం చేతులు మారడంతో గుట్టు రట్టయింది. 2019-2022 మధ్యకాలంలో రంజిత్ గుప్తా అజూర్ పవర్‌కు సిఇఓగా వ్యవహరించారు. 2022-23 నుండి రూపేష్ అగర్వాల్ ఆ బాధ్యతలు చేపట్టారు. ఈ ప్రాజెక్టుతో ప్రమేయమున్న కొందరు కంపెనీ ఎగ్జిక్యూటివ్‌లను రాజీనామా చేయాల్సిందిగా కోరారు. హామీ ఇచ్చిన ప్రకారం ముడుపులు ఎలా అందించాలనే విషయంపై చర్చించేందుకు అనేక సమావేశాలు జరిగాయి. ప్రాజెక్ట్ మొత్తాన్ని కొన్ని భాగాలుగా విభజించి వాటిని బదిలీ చేయడం, ఫీజుల రూపంలో చెల్లింపులు జరపడం వంటి అవకాశాలను పరిశీలించారు. 'కుట్రదారులు తమ ప్రణాళికలను అమలు చేయడం ప్రారంభించారు. ముడుపుల హామీని నెరవేర్చడంలో భాగంగా అందులో ఓ భాగాన్ని అదానీ గ్రీన్ ఎనర్జీ కంపెనీకి వాపసు చేశారు. సొమ్మును వాపసు చేయడానికి వారు కొన్ని కారణాలను సృష్టించారు. న్యాయపరమైన వివాదం, క్షీణిస్తున్న ఆర్థిక పరిస్థితిని సాకుగా చూపారు' అని అమెరికా ప్రాసిక్యూటర్లు వివరించారు. అయితే మరికొన్ని విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను (పిపిఎలు) పొందేందుకు ప్రతిఫలంగా ముడుపులు ఇస్తామని తాము ఇప్పటికే హామీ ఇచ్చిన విషయాన్ని అదానీ గ్రూప్ అమెరికా సంస్థ డైరెక్టర్ల బోర్డుకు చెప్పకుండా దాచిపెట్టింది.

**బాండ్ల జారీ రద్దు**

ముడుపుల ఆరోపణల నేపథ్యంలో షేర్ మార్కెట్‌లో అదానీ గ్రూప్ వాటాల విలువ దారుణంగా పడిపోయింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ (బిఎస్‌ఇ)లో అదానీ గ్రీన్ వాటాల విలువ 20 శాతం వరకూ పతనమైంది. తనపై అమెరికా ప్రాసిక్యూటర్లు అభియోగాలు మోపి కేసు నమోదు చేయడంతో అదానీ గ్రూప్ 600 మిలియన్ డాలర్ల బాండ్ల జారీని రద్దు చేసుకుంది.

అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ (డిఒజె), సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్‌ఇసి) కేసులు నమోదు చేసిన తర్వాత ఆసియన్ ట్రేడింగ్‌లో అదానీ డాలర్ బాండ్ల విలువ పడిపోయింది. కొన్ని సెక్యూరిటీలు భారీగా నష్టపోయాయి. ధరను నిర్ణయించిన కొద్ది గంటల వ్యవధిలోనే బాండ్ల అమ్మకాన్ని అదానీ గ్రూప్ నిలిపివేసింది. చట్టపరమైన పరిణామాలను కారణంగా చూపింది.

అమెరికా మార్కెట్ల నుండి నిధులు సమీకరించేందుకు సాగర్ అదానీ, వినీత్ జైన్, రూపేష్ అగర్వాల్, సౌరభ్ అగర్వాల్, మల్హోత్రా, సిరిల్ కేబెన్స్‌లు సహా కీలక వ్యక్తులు మదుపుదారులను తప్పుదోవ పట్టించారని అభియోగాలు మోపారు. పత్రాలను నాశనం చేసి, సమాచారాన్ని తొక్కిపెట్టి, అమెరికా ప్రభుత్వానికి తప్పుడు సమాచారం అందజేయడం ద్వారా వీరు పరస్పరం సహకరించుకున్నారని అభియోగాలు మోపారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఈ సంవత్సరం మార్చిలో జారీ చేసిన అదానీ గ్రీన్ ఎనర్జీ బాండ్ల విలువ కనిష్ట స్థాయికి పడిపోయింది. అదానీ గ్రూపునకు చెందిన ఇతర సెక్యూరిటీలు కూడా నష్టపోయాయి.

**తోసిపుచ్చిన అదానీ గ్రూప్**

తమ ఛైర్మన్ గౌతమ్ అదానీ, ఇతర కీలక ఎగ్జిక్యూటివ్‌లపై అమెరికా ప్రాసిక్యూటర్లు మోపిన మోసం, ముడుపుల ఆరోపణలను అదానీ గ్రూప్ తీవ్రంగా ఖండించింది. తమపై నిరాధారమైన ఆరోపణలు మోపారని అంటూ తాము ఎంతో ఉన్నత ప్రమాణాలతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని తెలిపింది. ఆరోపణలను ఎదుర్కొనేందుకు చట్టపరమైన పరిష్కారాలను అన్వేషిస్తామని చెప్పింది.

# సంక్షోభంలో కాప్ 29 చర్చలు!

- తేలని ఫలితం, ముసాయిదాను తిరస్కరించిన దేశాలు
- సవరణలతో కొత్త ముసాయిదా వెలువరిస్తామన్న అధ్యక్షవర్గం
- నిధులు లేక కాదు, రాజకీయాలే కారణమంటూ విమర్శలు




**బాకూ :** వాతావరణ మార్పుల వల్ల తలెత్తుతున్న సంక్షోభాలను, విపత్తులను ఎదుర్కొనేందుకు ఏర్పాటు చేయాలని భావిస్తున్న నూతన వాతావరణ నిధి ప్యాకేజీపై గురువారం తెల్లవారు జామున విడుదల చేసిన ముసాయిదాను ఐక్యరాజ్య సమితి వాతావరణ ఒప్పందంపై సంతకాలు చేసిన ప్రతి ఒక్క దేశమూ తిరస్కరించింది. ఈ ముసాయిదా ఖరారుకు చాలా దూరంలో వుందని, తగు సూచనలు, సలహాలు అందజేయాల్సిందిగా అన్ని దేశాలను కోరామని కాప్29 అధ్యక్షవర్గం పేర్కొంది. ఏకాభిప్రాయం పొందే లక్ష్యంతో మరికొన్ని మార్పులు, చేర్పులు చేసి, సవరణలతో మరో కొత్త ముసాయిదాను రూపొందిస్తున్నామని ప్రకటించింది. రోజురోజుకు పెరుగుతున్న సవాళ్ల నేపథ్యంలో ఏటా కనీసం 1.3 లక్షల కోట్ల డాలర్లు అవసరమవుతాయని వర్ధమాన దేశాలు ఇప్పటికే స్పష్టం చేశాయి. 2009లో ఇచ్చిన 100 బిలియన్ల డాలర్ల హామీ కంటే ఈ మొత్తం కనీసం 13 రెట్లు ఎక్కువ. సంపన్న దేశాలు ఇంకా అధికారికంగా మొత్తాన్ని ప్రతిపాదించనప్పటికీ ఆ మొత్తం ఏటా 200 బిలియన్ల నుండి 300 బిలియన్ల డాలర్ల వరకు వుండేలా చూసుకోవాలని యురోపియన్ యూనియన్ దేశాలు చర్చిస్తున్నట్లు చర్చల్లో పాల్గొన్న ప్రతినిధులు సూచనప్రాయంగా తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న కాప్ 29 సదస్సు లక్ష్యం జీరోగా మిగిలిందని కొలంబియా పర్యావరణ మంత్రి సుశానా మహ్మద్ వ్యాఖ్యానించారు. ఇక్కడ సంపన్న దేశాల వద్ద నిధులు లేకపోవడం సమస్య కాదని, వారు భౌగోళిక రాజకీయాలకు పాల్పడుతుండడమే సమస్యగా వుందని ఆమె వ్యాఖ్యానించారు. ఆమె చేసిన వ్యాఖ్యలకు ప్రతినిధుల నుండి మీడియా నుండి పరిశీలకుల నుండి హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. మెరుగైన ఫలితం లేకుండా బాకూ నుండి వదిలివెళ్ళేది లేదని జి 77 స్పష్టం చేసింది. వాతావరణ నిధిని అంతర్జాతీయ పెట్టుబడుల లక్ష్యంగా మార్చాలని సంపన్న దేశాలు చేస్తున్న ప్రయత్నాలను జి 77 అధ్యక్షులు అదోనియా అయెబరె తీవ్రంగా నిరసించారు.

## 'ఆ నంబర్ 1' జగనేనా?

(మొదటి పేజీ తరువాయి)

చెందిన 'విదేశీ అధికారి 1'ని అనేకసార్లు కలిశారని, సెకీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ పంపిణీ కంపెనీల మధ్య కుదిరిన విద్యుత్ అమ్మకపు ఒప్పందాన్ని గడువు కంటే ముందుగానే అమలు చేయాలని కోరారని అందులో పేర్కొన్నారు. 'అదానీ సదరు వ్యక్తిని 2021 ఆగస్ట్ 7, సెప్టెంబర్ 12, నవంబర్ 20 తేదీలలో కలిశారు. ముడుపుల పథకాన్ని ముందుకు తీసుకుపోయేందుకు, అదానీకి చెందిన పునరుద్పాదక ఇంధన సబ్సిడరీలకు ప్రయోజనం చేకూరేలా ఒప్పందంపై త్వరగా సంతకాలు జరిగేలా చూసేందుకు ఈ సమావేశాలు జరిగాయి' అని అమెరికా ప్రాసిక్యూటర్లు కోర్టుకు తెలిపారు.

## జనసేనకు పిఎసి ఛైర్మన్!

(మొదటి పేజీ తరువాయి)

శివప్రసాద్‌రెడ్డి, అంచనాల కమిటీ ఛైర్మన్‌గా ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌లు నామినేషన్ దాఖలు చేశారు పిఎసి సభ్యత్వానికి నామినేషన్ దాఖలు చేసిన వారిలో టిడిపినుంచి జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బివి జయనాగేశ్వరరెడ్డి, తణకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు, శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి నామినేషన్లు వేశారు, బిజెపి తరపున విష్ణుకుమారరాజు నామినేషన్ దాఖలు చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ (పియుసి) ఛైర్మన్‌గా ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, అంచనాల కమిటీ (ఎస్టిమేట్స్) కమిటీ ఛైర్మన్‌గా మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును కూటమి ప్రభుత్వం ఎంపిక చేయనున్నట్లు సమాచారం. ప్రస్తుతం శాసనమండలిలో ఉన్న బలాబలాలను బట్టి వైసిపి పిఎసిలో ఇద్దరు సభ్యులకు స్థానం దక్కడం ఖాయమని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## త్వరలోనే కర్నూలులో హైకోర్టు బెంచ్

(మొదటి పేజీ తరువాయి)

ట్రిపుల్ ఐటీ, ఉర్దూ యూనివర్సిటీ, అనంతపురంలో సెంట్రల్ వర్సిటీ పెట్టి ఎడ్యుకేషనల్ హబ్ గా మార్చామన్నారు. యువగళంలో ప్రకటించిన విధంగా మిషన్ రాయలసీమ హామీలను నెరవేర్చుతామన్నారు. కేంద్రం రెండు ఇండస్ట్రియల్ పార్కులు ఇస్తే వాటిని కర్నూలు జిల్లా ఓర్వకల్లు, కడప జిల్లా కొప్పర్తిలో ఏర్పాటు చేశామన్నారు. ఓర్వకల్లును డ్రోన్ హబ్‌గా మార్చేందుకు 300 ఎకరాలు కేటాయించామని కర్నూలను బెస్ట్ సిటీగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ అంశంపై జరిగిన చర్చల్లో మంత్రి సవిత మాట్లాడుతూ టిడిపి హయంలోనే కర్నూలు అభివృద్ధి జరిగిందన్నారు. ఎమ్మెల్యేలు కాలువ శ్రీనివాసులు, జి.జయసూర్య, కృష్ణ చైతన్య రెడ్డి, మాధవిరెడ్డి, భూమా అఖిలప్రియ, గౌరు చరిత్ర శ్రీ, బొజ్జల సుధీర్, జయనాగేశ్వరి, కందికుంట వెంకట ప్రసాద్ తదితరులు ప్రసంగించారు.






### మీకోసం


సేమ్యాను అన్నంలా పొడిపొడిగా ఉడికించి పులిహోర చేసుకుంటే చాలా రుచిగా ఉంటుంది.

### జీవన సౌరభం

జ్ఞానం అనేది సంపాదిస్తే కాదు, మనలోని అజ్ఞానాన్ని విడిచిపెడితే వస్తుంది.

JEEVANA జీవన the family

# బుద్ధి వచ్చిన పిల్లి



నరసింహాపురంలోని శరభయ్య ఒక కోడిని, పిల్లిని, మేకను పెంచుతున్నాడు. అతనికి పెంపుడు ప్రాణులతో పాటు పిల్లులంటే చాలా ఇష్టం. వాటిని ఎంతో ప్రేమగా చూసుకునేవాడు.

ఒకరోజు అతడు కొత్తగా మరొక పిల్లిని కూడా తీసుకొని వచ్చాడు. దానిని ఇంట్లో నుంచి చూసిన పిల్లి దానిపై అసూయ పెంచుకొంది. అది కిటికీలో నుంచి కోడితో 'మన యజమాని నా మీద ప్రేమ లేకుండా మరొక పిల్లిని కూడా పట్టుకుని వచ్చాడు. నేను ఇకనుంచి ఇక్కడ ఇంట్లో తిరిగే ఎలుకలను పట్టనే పట్టను' అంది. అప్పుడు కోడి 'అది సరికాదు. మనలాగే ఆ పిల్లి కూడా మనతో స్నేహం చేస్తుందేమో! కొన్ని రోజులు వేచిచూడటం మంచిది. తొందరపాటు మంచిది కాదు' అని అంది. అయినా పిల్లి పట్టించుకోలేదు. కోపంతో లోనికి వెళ్లి శరభయ్య ఇంట్లోని పాలన్నీ పారబోసింది. మరొక రోజు పాలన్నింటినీ తాగింది. ఇంకొక రోజు వంట పాత్రలన్నీ కింద పడవేసింది. అది చూసిన మేక 'ఓ పిల్లీ! ఈ కొత్తపిల్లికి నీవు ఉన్నట్లు తెలుసు. అయినా అది నీ గురించి ఒక్క మాట కూడా చెడుగా మాట్లాడలేదు. నీవు యజమానికి నష్టం చేయకుండా బుద్ధిగా ఉండు' అని అంది. మేక మాటలు పిల్లికి అసలు రుచించలేదు.

ఒకరోజు రాత్రి ఆ పిల్లి శరభయ్య ఇంట్లో నుంచి కోపంతో పారిపోయింది. రాత్రంతా ఎలాగోలా గడిచినా పొద్దునయ్యేసరికి బాగా ఆకలి వేసింది. ఎక్కడా ఆహారం దొరకలేదు. అక్కడేమో, ఇంట్లో పిల్లి కనపడడం లేదని శరభయ్య ఊరంతా వెదికాడు. ఇళ్లన్నీ తిరిగినా పిల్లి ఎక్కడా తిండి దొరక్క, శరభయ్య ఇల్లు వదిలి తప్పు చేశానని బాధపడింది. అప్పుడే ఓ వీధికుక్క దాని వెంట పడింది. పిల్లి భయంతో పరుగులు తీసింది. పారిపోతూ కంగారులో ఒక బురద గుంటలో పడింది. అది చూసిన శరభయ్య తెచ్చిన కొత్త పిల్లి గుంట దగ్గరకి వచ్చి గట్టిగా అరిచింది. దాని అరుపులు విని ఆ దారినే పోతున్న ఒక వృద్ధుడు ఒక కర్ర సాయంతో గుంటలో పిల్లిని కాపాడాడు.

తనను కాపాడడానికి కొత్త పిల్లి ఎంత తాపత్రయపడిందో చూసిన ఈ పిల్లి తప్పుగా అర్థం చేసుకున్నానని సిగ్గుపడింది. కొత్త పిల్లితో పాటు తాను కూడా బుద్ధిగా శరభయ్య ఇంటికి వెళ్లింది. రెండు పిల్లులను వీధి గుమ్మంలో చూసిన శరభయ్య ఎంతో సంతోషించాడు. ప్రేమగా పిల్లుల తల నిమిరి ఆహారం పెట్టాడు. అప్పటి నుంచి ఆ పిల్లి, కొత్తపిల్లితో కలిసి స్నేహంగా ఉండడం ప్రారంభించింది.

**- సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,**
**ధర్మపురి,**
**99085 54535.**



## జత చేయండి

పిల్లలూ, ఇక్కడ రకరకాల వాహనాలు ఉన్నాయి. వాటికి ఎదురుగా డ్రైవర్లు ఉన్నారు. ఏ వాహనానికి ఎవరు డ్రైవరో గుర్తించి జత చేయండి.

## నేను గీసిన బొమ్మ



**దేవులపల్లి శ్రీ వర్ష,**
**1వ తరగతి,**
**నంగునూర్,**
**సిద్దిపేట.**




పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

# మల్లవ్వ గ్రంథాలయం ...!

**ఆమె చదువుకోలేదు.. కానీ చదువు విలువ బాగా తెలుసు. ఒకప్పుడు తన పిల్లలను చదివించుకోలేకపోయిన ఆమె, ఇప్పుడు తన గ్రామంలో పిల్లలందరూ చదువుకునేలా ఊరి నడిబొడ్డున ఓ గ్రంథాలయం స్థాపించింది. సొంత డబ్బులకు తోడు నిధులు సేకరించి దాన్ని నిర్విఘ్నంగా నిర్వహిస్తోంది. భవిష్యత్తులో కూడా గ్రంథాలయ సేవలు విస్తృతపర్చాలని ఎంతగానో తపిస్తోంది. బెంగుళూరుకి చెందిన 48 ఏళ్ల మల్లవ్వ గురించే ఇప్పుడు మనం చెప్పుకుంటోంది. బెల్గావి జిల్లా మంటూరు గ్రామం ఆమెది.**

రైతుగా, పంచాయతీ మాజీ సభ్యురాలిగా మల్లవ్వ ఆ గ్రామంలో చిరపరిచితురాలు. 6 వేల మంది జనాభా గల ఆ గ్రామంలో పిల్లలకు ప్రాథమిక విద్య వరకు మాత్రమే అందుతోంది. ఉన్నతవిద్య కోసం చాలా దూరం వెళ్లాలి. అలా వెళ్లి చదివినా, పోటీపరీక్షలకు సిద్ధమయ్యే వీలు లేక చాలామంది విద్యార్థులు ప్రాథమిక విద్యతోనే చదువుకి స్వస్తి చెప్పారు. మల్లవ్వ ముగ్గురు పిల్లలూ అలాగే చదువుకు దూరమయ్యారు.

చదువు లేకపోవడం వల్ల తన పిల్లలు ఎలాంటి అవకాశాలు అందుకోలేకపోయారని గ్రహించిన మల్లవ్వ, ఆ పరిస్థితి గ్రామంలో మరే ఇతర పిల్లలకి రాకూడదని తపన పడింది. స్మార్ట్‌ఫోనులు, డిజిటల్ వేదికలతో కాలం ఎంత ముందుకుపోతున్నా పుస్తకాలతోనే జ్ఞానం పెరుగుతుందని గ్రహించింది. సరైన ప్రణాళికతో పుస్తకాలు చదివితే జీవితంలో ఎదురయ్యే ఎన్నో అడ్డంకులను అధిగమించవచ్చని తెలుసుకుంది. 'ఎక్కువ చదివితే, ఎక్కువ జ్ఞానం వస్తుంది. తద్వారా మా గ్రామంలో పిల్లలకు ఎన్నో అవకాశాలు వస్తాయి' అని మల్లవ్వ చెబుతోంది.

ఈ ఏడాది సెప్టెంబరు 19న ప్రారంభమైన ఈ గ్రంథాలయ స్థాపన వెనుక మల్లవ్వ చేసిన కృషి గురించి తప్పక చెప్పుకోవాలి. తనకి వచ్చిన ఆలోచనని మొదట గ్రామ పంచాయతి దృష్టికి తీసుకెళ్లింది.



అయితే అక్కడ ఆమెకి చుక్కెదురైంది. 'పంచాయతీలో నా ప్రతిపాదన తిరస్కరించారు. ఆ రోజే, స్వయంగా నేనే ప్రయత్నించాలని అనుకున్నాను. అప్పుడే మా గ్రామంలో బిఎస్ఎన్ఎల్ మొబైల్ టవర్‌కి స్థలం లీజుకిచ్చిన బిర్సిద్దేశ్వర ఆలయ ట్రస్టు గుర్తుకువచ్చింది. లీజు గడువు పూర్తయిందని తెలుసుకున్నాను. వెంటనే వాళ్లని కలిశాను. గ్రంథాలయం కోసం ఒక బ్లాకుని కేటాయించమని కోరాను. వాళ్లు అంగీకరించారు. అయితే ఆ స్థలం గ్రంథాలయ ఏర్పాటుకి ఏమాత్రం చాలదు. అదనంగా మరో గది నిర్మాణం చేయాల్సి వచ్చింద'ని చెబుతున్న మల్లవ్వ, తన సొంత డబ్బులు రూ.లక్షా 20 వేలు గ్రంథాలయం కోసం కేటాయించింది. ఓ రూ.30 వేలు సేకరించింది. గ్రామంలో వడ్రంగి పనిచేసుకునే వ్యక్తి ఫర్నీచర్ బహుకరించాడు. కొంతమంది పెద్దలు కావాల్సిన పుస్తకాలు ఇచ్చారు. ఇలా మల్లవ్వ సంకల్పానికి గ్రామంలోని వారంతా తలా ఓ చెయ్యి వేశారు.

ఇప్పుడు ఆ గ్రంథాలయం పిల్లలతో నిండిపోతోంది. మల్లవ్వ కృషి గ్రామం దాటి బయటిప్రపంచానికి తెలిసింది. మండల తహశీల్దార్ సురేష్ ముంజె మాట్లాడుతూ 'త్వరలో గ్రంథాలయ సందర్శనం చేసి, అవసరమైన నిధులు మంజూరు చేస్తామ'ని చెబుతున్నారు. మల్లవ్వ సాధించిన మొదటి విజయం ఇది. అయితే ఆమె కోరుకుంది ఇది కాదు.. ఈ గ్రంథాలయం ద్వారా, మంటూరు గ్రామ పిల్లలు పెద్ద కలలు కనాలి. కష్టపడి చదవాలి. వారి జీవిత పథాన్ని మార్చుకోవాలి. అప్పుడే మల్లవ్వ కృషికి ఫలితం వచ్చినట్టు ...

# ఆకులతోనూ మేలే..

**బీట్‌రూట్ ఆరోగ్యానికి చాలా మంచిదని అందరికీ తెలుసు. అయితే దీని ఆకులు కూడా ఆరోగ్యానికి మేలని నిపుణులు చెబుతున్నారు. బీట్‌రూట్ ఆకులలో శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి చాలా అద్భుతంగా పని చేస్తాయి. బీట్‌రూట్ ఆకులను తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలేంటో తెలుసుకుందాం.**



- బీట్‌రూట్ ఆకులలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది.
- బీట్‌రూట్ ఆకులలో నైట్రేట్స్ ఉంటుంది. ఇది శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్, ఆక్సిజన్ స్థాయిలను నిర్వహించడానికి సహాయపడుతుంది. ఇది రక్తపోటును అదుపులో ఉంచుతుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.
- ఈ ఆకులలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే హాని నుండి చర్మాన్ని కాపాడతాయి. యాంటీఆక్సిడెంట్‌లతో పాటు అవసరమైన విటమిన్లు కూడా ఉంటాయి. ఈ పోషకాలు కొల్లాజెన్‌ను పెంచడం ద్వారా చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి.
- బీట్‌రూట్ ఆకుల రుచి తీపిగా ఉంటుంది.. కాబట్టి జ్యూస్ చేసుకుని తాగవచ్చు లేక కర్రీగా కూడా చేసుకోవచ్చు. అదీకాకపోతే పకోడా కూడా తయారు చేసుకోవచ్చు.



## మొలకెత్తిన బంగాళదుంపలు తింటున్నారా!

**బంగాళదుంపలు లేని వంటిళ్లు ఉండదు. ప్రతి వంటకంలో బంగాళదుంప అదనపు రుచిని ఇస్తుంది. అయితే కొన్నిసార్లు బంగాళాదుంపలపై మొలకలు వస్తాయి. ఎంచక్కా వీటిని కత్తితో తీసేసి వంటల్లో వాడేస్తారు చాలామంది. కానీ మొలకెత్తిన బంగాళాదుంపలు తినడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.**
**ఎక్కువ రోజులు నిల్వ ఉన్న బంగాళ దుంపలకు మొలకలు వస్తాయి. అలా కాకుండా ఉండాలంటే వాటిని ఎప్పుడూ బహిరంగ ప్రదేశంలో ఉంచాలి. వాటిని ఆహారంలో భాగం చేసుకుంటే వచ్చే అనర్థాలు చూద్దాం.**

- మొలకెత్తిన బంగాళాదుంపలను తినడం వల్ల కళ్ళు వాపులు వచ్చే ప్రమాదం ఉందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.
- మొలకెత్తిన తర్వాత, బంగాళదుంపల్లోని పోషక విలువ తగ్గుతాయి. వాటిలో ఉండే కార్బోహైడ్రేట్లు, విటమిన్ సి వల్ల అవి మొలకెత్తుతాయి. ఈ సమయంలో కొన్ని విషపూరిత సమ్మేళనాలు అందులో ఉత్పత్తి అవుతాయి. మొలకెత్తిన బంగాళాదుంపల్లో గ్లైకోఅల్కలాయిడ్స్ అని పిలువబడే సహజ విష సమ్మేళనాలు ఉంటాయి. వీటిలో సోలనిన్, చాకోనిన్ అనే రెండు గ్లైకోఅల్కలాయిడ్స్ ఉంటాయి.
- గ్లైకోలాయిడ్స్ తెగుళ్ల ఉండే బంగాళదుంపలు తిన్నట్లైతే వికారం, వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి వస్తుంది. తలనొప్పి సమస్య కూడా పెరుగుతుంది.
- మొలకెత్తిన బంగాళాదుంపలను తినడం వల్ల మధుమేహంతో బాధపడేవారి చక్కెర స్థాయిలు వేగంగా పెరుగుతాయి.

# అదాని అవినీతిపై గప్‌చుప్

**• పెదవి విప్పని టిడిపి కూటమి • నేరుగా ఒప్పందం లేదన్న వైసిపి**

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన అదానీ కుంభకోణంపై రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు నేతలు పెదవి విప్పడం లేదు. తప్పనిసరిగా మాట్లాడాల్సిన సమయంలోనూ సూటిగా జవాబుచెప్పకపోవడం, దాటవేత ధోరణితో స్పందిస్తున్నారు. వైసిపి హయాంలో భారీ అవినీతి చోటుచేసుకున్నట్లు, వేల కోట్ల రూపాయలు చేతులు మారినట్లు ఒకవైపు వార్తలు వస్తుండగా ప్రస్తుతం అధికారంలో ఉన్న టిడిపితో పాటు, ఆ పార్టీ కూటమిలోని జనసేన, బిజెపి నాయకులు కూడా మౌనం పాటిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. 'గత ప్రభుత్వ పాలనే కారణం' అంటూ ప్రతి అంశానికి టిడిపి నేతలు విరుచుకుపడుతుండటం కొంత కాలంగా చూస్తున్నదే! ఇదే విషయమై కొందరు మీడియా ప్రతినిధులు రాష్ట్ర మంత్రి లోకేష్‌ను కలవగా ఆయన 'ఒకటి రెండు రోజుల్లో దీనిపై నిర్ణయం తీసుకుంటాం' అని అన్నట్లు వార్తలు వచ్చాయి. నేరుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసిపి కూడా నామమాత్రంగా స్పందించింది. ఆ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డితోపాటు, ఇతర నాయకులు ఎవ్వరు ఈ విషయమై నేరుగా మీడియా ముందుకు రావడానికి సిద్ధపడలేదు. ఆ పార్టీ తరపున వాట్స్‌అప్ గ్రూపుల్లో విడుదల చేసిన ప్రకటనలో సెకితో చేసుకున్న ఒప్పందం గురించి సుదీర్ఘంగా వివరించారు. సెకి కేంద్ర ప్రభుత్వ సంస్థ కాబట్టే దానితో ఒప్పందం చేసుకున్నామని, అదాని గ్రూపుతో నేరుగా ఎటువంటి ఒప్పందం లేదని, అందువల్ల అవినీతి ఆరోపణలు 'సరికాదు' (ఇన్‌కరెక్టు) అని వైసిపి పేర్కొంది అయితే, ఆ వ్యవహారంలో జగన్ ప్రభుత్వం మీద నేరుగా వచ్చిన విమర్శల గురించి 'అత్యున్నత వ్యక్తి' అంటూ అమెరికన్ న్యాయశాఖ, ఎఫ్‌బిఐ పేర్కొన్న అంశాల మీద వైసిపి ప్రకటనలో నామమాత్రపు ప్రస్తావన కూడా లేదు. వేల కోట్ల రూపాయలు చేతులు మారాయన్న ఆరోపణ మీద కూడా వైసిపి స్పందించలేదు. ఇక అవినీతిని ఏమాత్రం సహించేది లేదంటూ పదేపదే ప్రకటిస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా తాజా పరిణామంపై మౌనం పాటించారు. ఆయనగానీ, ఆ పార్టీ నేతలు గానీ వేల కోట్ల రూపాయల అవినీతితో ముడిపడిన ఈ వ్యవహారంతో స్పందించేందుకు సిద్ధపడలేదు. రాష్ట్రానికి చెందిన బిజెపి నేతలదీ అదే పరిస్థితి. జాతీయస్థాయితో పాటు అంతర్జాతీయంగానూ కలకలం రేపుతున్న ఆదాని కుంభకోణంలో రాష్ట్రంలోని ప్రధాన పార్టీల మౌనానికి, దాటవేత ధోరణికి కారణం ఏమిటో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు

**రెండు పార్టీలదీ ఒకే వైఖరి...**

అదాని, బిజెపిల విషయంలో టిడిపి, వైసిపిలు ఒకే వైఖరితో ఉన్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి హోదాలోఉన్న జగన్‌ను అప్పట్లో అదాని స్వయంగా వచ్చి కలవడం కలకలం రేపింది. ఆ తరువాతనే అదాని గ్రూపుతో రాష్ట్రంలో అనేక ఒప్పందాలు జరిగాయి. ఇప్పుడు కొత్తగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఇటీవలే అదానీ కంపెనీలతో కొత్తగా చర్చలు ప్రారంభించిన విషయం తెలిసిందే. రెన్యువలబుల్ ఎనర్జీ రంగంతోపాటు,సెజ్‌లు, పోర్టుల రంగంలోనూ పెట్టుబడులకు ఆహ్వానించింది. దీనికితోడు ప్రధానమంత్రి నరేంద్రమోడీకి, అదానికి ఉన్న సన్నిహిత సంబంధాలు అందరికి తెలిసిందే. టిడిపి నుండి ఎన్నికైన రామ్మోహన్‌నాయుడు కేంద్ర మంత్రిగా ఉన్నారు. మరో ఎంపి పెమ్మసాని చంద్రశేఖర్ సహాయమంత్రి పదవిలో ఉన్నారు.

### వైసిపి ప్రకటనలో ఏముంది?

రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చేనాటికి గత ప్రభుత్వ ఒప్పందాల ఫలితంగా డిస్కమ్‌లపై అదనపు భారం పడుతోందని, దాన్ని తగ్గించుకునేందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థయైన సెకీతో ఒప్పందం చేసుకుందని వైసిపి తెలిపింది.ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో తాము అధికారంలో వచ్చే సమయానికే భారీ వ్యయంతో విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నారని, ఇది రాష్ట్ర ప్రభుత్వానికి పెనుభారంగా మారిందని పేర్కొన్నారు. దీంతో గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ ద్వారా 2020 నవంబరులో 6500 మెగావాట్ల సౌర విద్యుత్‌ను అభివృద్ధి చేసేందుకు టెండర్లు పిలిచినట్లు తెలిపింది. ఇందులో 24 బిడ్లు దాఖలయ్యాయని పేర్కొన్నారు. అయితే అనేక అడ్డంకులు ఎదురయ్యాయని, దీనివల్ల టెండర్ల విధానం ఫలించలేదని తెలిపారు. దీంతో సెకీతో ఒప్పందం చేసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. 7000 మెగావాట్లను కొనుగోలు చేసేందుకు నిర్ణయించి 2024-25 సంవత్సరంలో 3000 మెగావాట్లతో 25 సంవత్సరాల కాలానికి కిలోవాట్‌కు రూ.2.49 పైసలుకు ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కొనుగోలు ప్రక్రియను ఎపిఇఆర్‌సి కూడా ఆమోదించిందని తెలిపింది. అనంతరం డిస్కమ్‌లతో పవర్‌సేల్ అగ్రిమెంటు చేసుకున్నట్లు తెలిపింది. కేంద్రప్రభుత్వ సంస్థయైన సెకితో తప్ప అదానీ గ్రూపు సంస్థలతో డిస్కమ్‌లకు ఎటువంటి ప్రత్యక్ష ఒప్పందమూ లేదని తెలిపింది. అందువల్ల ఈ వ్యవహారంలో వస్తున్న ఆరోపణలు సరికాదని తెలిపింది. సెకి ఒప్పందం రాష్ట్ర ప్రయోజనాల కోసం చేసిందే తప్ప అదనపు భారాలు పడవని పేర్కొన్నారు.

## ప్రేక్షకులు కచ్చితంగా ఎంజాయ్ చేస్తారు



అశోక్ గల్లా తన సెకండ్ మూవీ 'దేవకీ నందన వాసుదేవ' చిత్రం ఈరోజు విడుదల కానుంది. ఈ చిత్రానికి గుణ 369తో హిట్ కొట్టిన అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహించారు. ప్రశాంత్ వర్మ కథ అందించారు. మానస వారణాసి హీరోయిన్‌గా నటించారు. నల్లపనేని యామిని సమర్పణలో లలితాంబిక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సోమినేని బాలకృష్ణ నిర్మించారు. ఈ సందర్భంగా అశోక్ గల్లా మాట్లాడుతూ, 'ప్రశాంత్ గారు నా దగ్గర కథ వుంది వింటావా? అనడిగారు. కథ విన్నాక అద్భుతంగా అనిపించింది. ఈ సినిమాలో యాక్షన్, ఎమోషన్ అద్భుతంగా వుంటుంది. అర్జున్ గారు, ప్రశాంత్ వర్మ కథని చాలా ఎలివేట్ చేశారు. అది కంప్లీట్ యూత్ స్టోరీ'.అని వివరించారు.



# బుమ్రా కెప్టెన్సీకి పరీక్ష

**• నేటినుంచి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ • ఉదయం గం.7.50ని.ల నుంచి**

**పెర్త్:** భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య పెర్త్ వేదికగా నేటినుంచి తొలి టెస్ట్ ప్రారంభం కానుంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఇరుజట్ల మధ్య ఐదు టెస్ట్ టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ జరగనుంది. ఇందులో భాగంగా జరిగే తొలి టెస్ట్‌కు ఇరుజట్లు సన్నద్ధమయ్యాయి. గత రెండు సీజన్‌లలోనూ టీమిండియాజట్టు ఆస్ట్రేలియా గడ్డపై ఆసీస్‌ను చిత్తుచేసిన ఉత్సాహంతో ఈసారి బరిలోకి దిగుతుండగా.. మరోవైపు ఆస్ట్రేలియా ఈసారైనా టీమిండియాను చిత్తుచేయాలన్న దృఢ నిశ్చయంతో ఉంది. ఈ సిరీస్ ప్రారంభానికి ముందు జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీతో ఇరుజట్ల కెప్టెన్లు పాట్ కమిన్స్-జస్ప్రీత్ బుమ్రా గురువారం టెస్ట్ సిరీస్ ట్రోఫీని ఆవిష్కరించారు. ఇరుజట్ల కెప్టెన్లు పేస్ బౌలర్లే కావడం మరో విషయం. యాషెస్ సిరీస్ కంటే టీమిండియాపై టెస్ట్ సిరీస్‌ను గెలవడమే తమ ముందున్న ప్రధాన కర్తవ్యమని ఆసీస్ కెప్టెన్ కమిన్స్ మీడియాతో తెలిపాడు. మరోవైపు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ గైర్హాజరీలో జస్ప్రీత్ బుమ్రా తొలి టెస్ట్ పగ్గాలు అందుకున్నాడు. స్వదేశంలో టీమిండియా.. న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్‌ను 0-3తో చేజార్చుకోవడంతో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్(డబ్ల్యుటిసి) ఫైనల్‌కు చేరాలంటే ఈ సిరీస్ గెలుపు తప్పనిసరి. ఆసీస్ గడ్డపై 2018-19, 2020-21లలో టెస్ట్ సిరీస్‌లను చేజిక్కించుకొన్న టీమిండియా.. హ్యాట్రిక్ ట్రోఫీ లక్ష్యంగా ఫుల్ జోష్‌తో బరిలోకి దిగుతోంది. భారతజట్టుకు హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌కు ఈ సిరీస్ కీలకం కానుంది. స్వదేశంలో న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్ వైట్‌వాష్‌తో గెలుపుపై ప్రధానంగా దృష్టి సారించాడు. బొటనవేలికి గాయమైన శుభ్‌మన్ గిల్ కోలుకున్నట్లు సమాచారం. అయినా అతడు తొలిటెస్ట్ బరిలోకి దిగడంపై సందేహం నెలకొంది.

**నితీశ్‌రెడ్డి అరంగేట్రం ఖాయం: మోర్కెల్**

తొలి మ్యాచ్‌తో తెలుగు తేజం నితీశ్‌రెడ్డి అరంగేట్రం చేయడం ఖాయమని టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ తెలిపాడు. నితీశ్ తన ఆటతీరును తొలిసారిగా భారత టెస్టు జట్టులో ప్రదర్శించనున్నాడని విలేకరుల సమావేశంలో తెలిపాడు. అలాగే నితీశ్‌రెడ్డి బౌలింగ్‌పై మోర్కెల్ ప్రశంసలు కురిపించాడు.

**జట్లు(అంచనా): ఇండియా: బుమ్రా(కెప్టెన్), అభిమన్యు ఈశ్వరన్/నితీశ్ రెడ్డి, జైస్వాల్, కోహ్లి, కెఎల్ రాహుల్, సర్ఫరాజ్, పంత్(వికెట్ కీపర్), అశ్విన్, జడేజా, సిరాజ్, యశ్ దయాల్.**

**ఆస్ట్రేలియా: కమిన్స్(కెప్టెన్), ఖవాజా, హెడ్, స్మిత్, లబూషేన్, ఇంగ్లిస్(వికెట్ కీపర్), మిచెల్ మార్ష్, మెక్‌స్వీనీ/బోలండ్, స్టార్క్, హేజిల్‌వుడ్, లియాన్.**

## క్వార్టర్స్‌కు లక్ష్యసేన్
### సింధు, మాల్విక పరాజయం

**లీ-జెంగ్(చైనా):** చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లగా.. మహిళల సింగిల్స్‌లో పివి సింధు, మాల్విక బన్సోద్‌తోపాటు అనుపమ ఉపాధ్యాయ రెండోరౌండ్‌ను దాటలేకపోయారు. గురువారం జరిగిన రెండోరౌండ్ పోటీలో లక్ష్యసేన్ 21-16, 21-18తో రాస్మస్ జెంకే(డెన్మార్క్)ను వరుససెట్లలో ఓడించాడు. ఇక అనుపమ 7-21, 14-21తో జపాన్‌కు చెందిన నిడైరా చేతిలో పివి సింధు 16-21, 21-17, 21-23తో సింగపూర్‌కు చెందిన యో-జియా మిన్ చేతిలో, మాల్విక 9-21, 9-21తో 8వ సీడ్ సుపరింద (థాయ్‌లాండ్) చేతిలో పరాజయాన్ని చవిచూశారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68